ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698



తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శుక్రవారం 30.01.2026 | సంపుటి : 12 సంచిక : 191 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం

JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్


## అత్యంత ప్రమాదం పొంచిఉన్న డ్యాంల జాబితాలో

# మేడిగడ్డ





- పార్లమెంట్ వేదికగా కేంద్ర జలశక్తి శాఖ వెల్లడి
- బ్యారేజీ భద్రత విషయంలో ఎన్‌డీఎస్ఏ సూచనలు వెంటనే అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వానికి కోరిన కేంద్రం

**ఢిల్లీ(జనంసాక్షి):** కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో కీలకమైన మేడిగడ్డ (లక్ష్మి) బ్యారేజ్ దేశంలోనే అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్న డ్యామ్‌ల జాబితాలో చేరింది. 2025 పోస్ట్-మాన్సూన్ (వర్షాకాలం తర్వాత) తనిఖీల్లో తెలంగాణలోని మేడిగడ్డ బ్యారేజ్ ను జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) కేటగిరి-1గా వర్గీకరించింది. మరమ్మతులు, నివారణ చర్యలు చేపట్టకపోతే బ్యారేజ్ భద్రతకే ముప్పు ఏర్పడే పరిస్థితి ఉందని ఎన్‌డీఎస్ఏ నివేదిక స్పష్టం చేసిందని కేంద్ర జలశక్తి శాఖ వెల్లడించింది. లోక్‌సభలో దేశవ్యాప్తంగా డ్యామ్‌ల సేఫ్టీపై అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. దేశవ్యాప్తంగా కేటగిరీ-1లో గుర్తించిన మూడు డ్యామ్‌లలో తెలంగాణలోని మేడిగడ్డ బ్యారేజ్ ఒకటి కాగా.. మిగతావి ఉత్తరప్రదేశ్‌లోని లోయర్ ఖజూరి డ్యామ్, జార్ఖండ్‌లోని బోకారో బ్యారేజ్‌లు ఉన్నాయని స్పష్టం కేంద్రమంత్రి స్పష్టం చేశారు. డ్యామ్ సేఫ్టీ యాక్ట్-2021 ప్రకారం

మిగతా 2లో..

## ఫోన్‌ట్యాపింగ్ కేసులో

# కేసీఆర్‌కు నోటీసులు





### విచారణకు రాలేను.. మీరే ఎర్రవల్లికి రండి

- భవిష్యత్తులో నోటీసులన్నీ అక్కడికే పంపండి
- శుక్రవారం విచారణకు హాజరు కాలేనంటూ సిట్‌కు కేసీఆర్ ప్రత్యుత్తరం
- మాజీ సీఎం వినతిపై స్పందించిన సిట్
- విచారణ తేది, ప్రదేశంపై న్యాయసలహా తీసుకుని మళ్లీ నోటీసులు ఇవ్వనున్న దర్యాప్తు అధికారులు

2లో..

- నేడు విచారణకు రావాలని సిట్ పిలుపు
- నందినగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి అందజేత

**హైదరాబాద్(జనంసాక్షి):** ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. భారత రాష్ట్ర సమితి అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కు సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. నందినగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి అందజేశారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణ చేస్తామని నోటీసుల్లో పేర్కొన్నారు. వయసు దృష్ట్యా పీఎస్‌కు రావాల్సిన అవసరం లేదని సిట్ పేర్కొంది. ఈ కేసులో ఇటీవల మాజీ మంత్రులు హరీశ్ రావు, కేటీఆర్‌తో పాటు మాజీ ఎంపీ సంతోష్ రావును సిట్ విచారించిన విషయం తెలిసిందే. ప్రధానంగా ఇప్పటివరకు ఈ కేసుకు సంబంధించి మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు, మాజీ ఎంపీ సంతోష్ రావులను సిట్ విచారించిన విషయం తెలిసిందే. తాజాగా.. కేసీఆర్‌నూ విచారించాలని సిట్ నిర్ణయించింది. ఇందులో భాగంగానే విచారణ చేపట్టేందుకు సిట్ అధికారులు సన్నద్ధమైనట్టు సమాచారం. రెండేళ్లుగా సాగుతున్న ఫోన్ ట్యాపింగ్

మిగతా 2లో..

## కేంద్ర కమిటీ నిర్ణయించినప్పటికీ..

# దండకారణ్యం నుంచి కొన్ని బలగాలను రిట్రీట్ చేయలేకపోయాం



'జనంసాక్షి' ప్రశ్నలకు మావోయిస్టు పార్టీ ప్రతినిధి అభయ్ లిఖితపూర్వక సమాధానాలు



- ఈ విషయం పట్ల 2018లోనే కేంద్ర కమిటీ నిర్ణయం తీసుకుంది
- కానీ 'డికె'లో అమలు చేయకపోవడం వల్ల తీవ్ర నష్టం జరుగుతోంది
- కగార్ ముఖ్య కారణమే ఐనా.. మా పొరపాట్లూ దీనిలో భాగమే...
- మావోయిస్టు పార్టీ ఆత్మవిమర్శ
- ఢిల్లీ కేంద్ర హెూంశాఖ కమాండ్ కంట్రోల్ నుంచే ఈ యుద్ధం జరిగింది
- అమెరికా, ఇజ్రాయెల్ సైనికాధికారులు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు
- మల్లోజుల, ఆశన్నలు విప్లవోద్యమంపై విశ్వాసం కోల్పోయి.. ప్రాణభయంతో సరెండర్ అయ్యారు
- వీరిద్దరి ద్వారా పార్టీని దెబ్బతీయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఫలమయ్యాయి
- దేశంలో ఇప్పటికీ అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థే కొనసాగుతోంది
- ఇది ప్రభుత్వ సాయుధ బలగాలకు, మాకు యుద్ధం కాదు.. రాజ్యానికి, ప్రజలకు మధ్య యుద్ధం
- జయాపజయాలను సమీక్షించి, గుణపాఠాలు తీసుకుని ముందుకెళ్తాం

*జనంసాక్షి ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్ :'2018లోనే కేంద్రకమిటీ రానున్న రోజుల్లో తీవ్రతరం కానున్న శత్రుదాడిని అంచనా వేసి దండకారణ్యం నుండి కొన్ని బలగాలను ఇతర రాష్ట్రాలకు రిట్రీట్ చేయాలని చెప్పింది. ఆ తీర్మానపు లోతుపాతులు కింది కమిటీలకు అందక, దాన్ని అమలు చేయని ఫలితంగా 2024 నుండి దండకారణ్యంలో తీవ్రమైన నష్టాలు జరుగుతున్నాయి. కాబట్టి ఈ నష్టాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్న కగార్ యుద్ధం ముఖ్యమైన కారణమే అయినప్పటికీ మా పొరపాట్లు కూడా కారణమే' అని మావోయిస్టు పార్టీ అంగీకరించింది. ఢిల్లీలో కేంద్ర హోంశాఖ కార్యాలయంలో కేంద్ర కమాండ్-కంట్రోల్ కేంద్రం నుంచి జరిగిన ఈ యుద్ధంలో అమెరికా, ఇజ్రాయిల్ సైనిక అధికారులు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నట్టు పేర్కొంది. మల్లోజుల, ఆశన్నలు విప్లవోద్యమ పురోగమనం పట్ల విశ్వాసం కోల్పోయి, ప్రాణభీతికి లోనయి శత్రువుకు సరెండరయ్యారని, వీరిద్దరి ద్వారా పార్టీని లోపలి నుండి దెబ్బతీయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఫలమయ్యాయని తెలిపింది. మన దేశం ఇప్పటికీ అర్ధవలస-అర్ధభూస్వామ్య దేశమేనని భావిస్తున్నట్టు వెల్లడించిన పార్టీ.. ఇది భారత రాజ్యానికి భారత ప్రజలకు మధ్య జరుగుతున్న యుద్ధమని, జయాపజయాలను సమీక్షించుకుని, గుణపాఠాలు తీసుకుని ముందుకెళ్తామని ప్రకటించింది. వివిధ మీడియా సంస్థలనుంచి సేకరించిన ప్రశ్నల్లో భాగంగా 'జనంసాక్షి' ప్రశ్నలకు మావోయిస్టు పార్టీ ప్రతినిధి అభయ్ లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానాలివీ..!*

4లో..



# గ్లోబల్ మ్యాప్‌లో తెలంగాణను అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యం

- అదృష్టంతో విజయం వరించదు కృషి, లక్ష్యం ఉంటేనే సాధ్యం
- హార్వర్డ్ బిజినెస్ స్కూల్ విద్యార్థులతో సీఎం రేవంత్ మాటామంతి

**హైదరాబాద్(జనంసాక్షి):** విజయం అనేది అదృష్టం వల్ల రాదని.. నిరంతర కృషి, లక్ష్యం పట్ల స్పష్టత ఉంటేనే సాధ్యమని తన విజయ మంత్రాన్ని సిఎం రేవంత్ రెడ్డి హార్వర్డ్‌లో విద్యార్థులకు బోధించారు. భారతీయ విద్యార్థుల ప్రత్యేక ఆహ్వానం మేరకు సిఎం రేవంత్ క్యాంపస్‌ను సందర్శించారు . ఈ మేరకు విద్యార్థులతో తన ఆలోచనలను పంచుకున్నారు.

మిగతా 2లో..



# మేడారం జాతరకు కేంద్రం మొండిచేయి

### రూ.3.26 కోట్లు ఇచ్చినట్లు కిషన్‌రెడ్డి దుష్ప్రచారం చేస్తున్నారు

- శాశ్వత అభివృద్ధికి మరో 41 ఎకరాల భూసేకరణ
- శాశ్వతంగా కాటేజీలు, ఫంక్షన్ హాళ్లు, మౌళిక సదుపాయాలు
- జంపన్నవాగునిరంతరంగా పారేలా చర్యలు: మంత్రి పొంగులేటి

**ములుగు బ్యూరో(జనంసాక్షి):** మేడారం అభివృద్ధికి కేంద్రం నయా పైసా సాయం చేయలేదని తెలంగాణ మంత్రి పొంగులేటి చెప్పారు. మేడారంలో మంత్రి సీతక్కతో కలిసి పొంగులేటి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "మేడారం అభివృద్ధికి కేంద్రం రూ. 3.26 కోట్లు ఇచ్చినట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రకటించారు. అందులో వాస్తవం లేదు. కిషన్‌రెడ్డి మాటలు చెప్పడం తప్పు.. చేసిందేమీ లేదు. మేడారాన్ని పూర్తిస్థాయిలో మేం అభివృద్ధి చేస్తాం" అని తెలిపారు. మేడారం సమ్మక్క-సారక్క మహా జాతరలో భక్తుల తాకిడి గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగిందనిమంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. మేడారంలో మీడియాతో మాట్లాడిన మంత్రి మాట్లాడుతూ, గురువారం దాదాపు 80 లక్షల మంది భక్తులు దర్శనం చేసుకున్నారని, సమ్మక్క గద్దెపైకి వచ్చే సమయానికి ఈ సంఖ్య కోటికి మించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తదితర పొరుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు మేడారానికి తరలివస్తున్నారని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తోందని మంత్రి స్పష్టం చేశారు. మేడారం జాతర శాశ్వత అభివృద్ధి కోసం ఇప్పటికే 29 ఎకరాల భూమిని సేకరించామని, మరో 41 ఎకరాల భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోందని మంత్రి తెలిపారు. మొత్తంగా సుమారు 70 ఎకరాల

మిగతా 2లో..



# వనం వీడి జనంలోకి సమ్మక్క

- మేడారం జాతరలో కీలకఘట్టం ఆవిష్కృతం
- గౌరవసూచకంగా గాల్లోకి ఎస్పీ కాల్పులు
- భక్తజన సంద్రంగా మేడారం
- మహాజాతరకు లక్షలాదిగా తరలివస్తున్న జనం
- కేంద్రమంత్రులు జువల్ ఓరం, కిషన్‌రెడ్డిలు ప్రత్యేక పూజలు

వార్త 2 లో

# ఇది ప్రతీకార చర్యే

### కేసీఆర్ సిట్ నోటీసులపై మండిపడ్డ కేటీఆర్

- సింగరేణి కుంభకోణంపై దృష్టి మరల్చడానికే నోటీసులు
- కక్షపూరిత రాజకీయాలకు పరాకాష్ట: హరీశ్ రావు
- మండిపడ్డ పలువురు మాజీ ఎమ్మెల్యేలు



**హైదరాబాద్(జనంసాక్షి):** విచారణల పేరుతో మాజీ సీఎం కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఈ చర్యలు తీసుకుంటోందని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపించారు. కేసీఆర్ తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడని, నోటీసులతో చరిత్రను చెరిపేయలేరని కేటీఆర్ వెల్లడించారు. ఇది విచారణ కాదు.. ఇది ప్రతీకారం. ఇది న్యాయం కాదు.. ఇది రాజకీయ దురుద్దేశం. కేసీఆర్ తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడు. నోటీసులతో, బెదిరింపులతో తెలంగాణ చరిత్రను చెరిపేయలేరు. తెలంగాణ ఉద్యమాన్ని, తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానిస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు. ఈ కక్షసాధింపు రాజకీయాలను బీఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తోంది.'చావు నోట్లో తలబెట్టి.. కేసీఆర్ సచ్చుడో - తెలంగాణ వచ్చుడో అనే మొక్కవోని సంకల్పంతో

మిగతా 2లో..

# విచారణలో భాగంగానే సిట్ నోటీసులు

### వాస్తవాలు తెలుసుకునే ప్రయత్నంలో అధికారులు
### కేసీఆర్‌కు నోటీసులపై పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్



**హైదరాబాద్,జనవరి29(జనంసాక్షి):** జరిగిన వాస్తవాలు తెలుసుకోవడానికి సిట్ ఎవరికైనా నోటీసులు ఇవ్వొచ్చని స్పష్టం టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చేశారు. సిట్ సంపూర్ణ విచారణ జరిగితేనే తెలుస్తుందని.. నిజాలు బయటకు వస్తాయని తెలిపారు. ఈ విషయంలో వాస్తవాలు వెలుగులోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని టీపీసీసీ చీఫ్ అన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌కు సిట్ నోటీసులపై ఆయన స్పందించారు. కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడంలో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని స్పష్టం చేశారు. ఆనాడు ముఖ్యమంత్రి, మంత్రుల ప్రమేయం లేకుండా ఫోన్ ట్యాపింగ్ జరగదని ఆయన చెప్పారు. ప్రభుత్వ పెద్దల ఆదేశాలు లేకుండా అధికారులు ఇలాంటి చర్యలకు పాల్పడరని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో ఎవరు భాగస్వాములో తేలాల్సి ఉందని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో పారదర్శక విచారణ జరగాలని కోరారు మహేశ్ కుమార్. 500కు పైగా ఫోన్ నంబర్లను ట్యాపింగ్ చేశారనే సమాచారం ఉందని చెప్పుకొచ్చారు.


# 'మామునూరు'పై కీలక ముందడుగు

### ఎయిర్‌పోర్ట్‌కు భూమి అప్పగింత

### ఇది చరిత్రలో నిలిచిపోయే రోజు: డిప్యూటి సీఎం భట్టి

**హైదరాబాద్,జనవరి 29(జనంసాక్షి):** ప్రజా ప్రభుత్వం ఏర్పడగానే మామునూరు ఎయిర్‌పోర్ట్ కు అవసరమైన భూమిని సేకరించి గురువారం కేంద్ర విమానయాన శాఖకు అప్పగించడం చరిత్రలో నిలిచిపోయే రోజు అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. వరంగల్ జిల్లాలోని మామునూరు ఎయిర్‌పోర్ట్ కు అవసరమైన 300 ఎకరాల భూమిని కేంద్ర వైమానిక శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు అప్పగించడం

మిగతా 2లో..



# నేనింకా బీఆర్ఎస్ సభ్యుడినే..



- ఎమ్మెల్యే దానం కొత్త పల్లవి
- పార్టీ స్పందన మేరకే ప్రతిస్పందన
- ఎన్నికలకు భయపడనని వెల్లడి



**హైదరాబాద్(జనంసాక్షి):** అనర్హత వ్యవహారంలో స్పీకర్ నోటీసులపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పందించారు. నోటీసులకు వివరణ ఇస్తూ తమ అడ్వకేట్ లేఖ రాశారని.. ఆయన నుంచి జవాబు రాలేదని చెప్పారు. గురువారం మీడియాతో దానం నాగేందర్ మాట్లాడారు." విచారణకు వ్యక్తిగతంగా హాజరుకావాలని నాకు చెప్పలేదు. మా అడ్వకేట్ స్పీకర్‌కు లేఖలో ఏం రాశారో తెలియదు. బీఆర్ఎస్ నన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేయలేదు. వాళ్లు తీసుకునే యాక్షన్ బట్టి నా రియాక్షన్ ఉంటుంది. ఎన్నికలంటే నేనేమీ భయపడను" అని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు.

### అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న సిటీగా హైదరాబాద్

- పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థికసర్వేలో తెలంగాణ అభివృద్ధి ప్రస్తావన
- సాగు యోగ్య భూ విస్తీర్ణం 2.21 కోట్లకు పెరిగినట్లు వెల్లడి
- మున్సిపల్ బాండ్స్ జారీలో హైదరాబాద్‌దే అగ్రస్థానం



2లో..

# వచ్చే ఏడాది వృద్ధి రేటు 6.8-7.2%

### పార్లమెంట్ ముందుకు ఆర్థిక సర్వే • ఉభయ సభల్లో ప్రవేశ పెట్టిన నిర్మల

**న్యూఢిల్లీ,జనవరి29(జనంసాక్షి):** దేశ ఆర్థిక గమనానికి దిక్సూచిగా నిలిచే ఆర్థిక సర్వేను కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా 2025-26 ఆర్థికసర్వే ను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. తర్వాత రాజ్యసభలో కూడా మంత్రి సర్వేను ప్రవేశపెట్టారు. కేంద్ర బడ్జెట్ సమర్పణకు ముందు ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టడం ఆనవాయితీగా వస్తోంది.గత ఆర్థిక సంవత్సరంలో భారత్ సాధించిన అభివృద్ధి, ఎదురైన సవాళ్లు, భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యలు తదితర కీలక విషయాలను ఆర్థిక సర్వేలో ప్రస్తావిస్తారన్న విషయం తెలిసిందే. 2026-27 ఆర్థిక సంవత్సరంలో భారత దేశ రియల్ జీడీపీ 6.8 శాతం నుంచి 7.2 శాతం వృద్ధి చెందే అవకాశం ఉందని ఆర్థిక సర్వే తేల్చింది. సుస్థిర దేశీయ డిమాండ్, స్థూల ఆర్థిక అంశాలు సానుకూలంగా ఉండటంతో భారత ఆర్థిక ప్రగతికి ఢోకా లేదని ఆర్థిక సర్వే తేల్చింది. ఈ సర్వే ప్రకారం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పరిస్థితి కాస్త ఆందోళనకరంగానే ఉంది. ప్రతికూల అంశాల ప్రాబల్యం కొనసాగుతోంది. ఫలితంగా ప్రపంచ ఆర్థిక ప్రగతి ఓ మోస్తరు స్థాయిలోనే కొనసాగుతుంది. స్థూలంగా చూస్తే వస్తువుల ధరలు ఈ ఏడాదిలో స్థిరంగా కొనసాగే అవకాశం ఉంది. కృత్రిమ మేధతో ఆశించిన మేర ఆర్థిక ఫలాలు అందకపోతే ఆస్తుల విలువ తరిగి ఆర్థికరంగంపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. భౌగోళిక అనిశ్చితుల కారణంగా పెట్టుబడులపై ప్రతికూల ప్రభావం పడి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరింత నెమ్మదించవచ్చు. ప్రస్తుత పరిస్థితి నిలకడగా ఉన్నా రాబోయే

మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
30.01.2026

# అత్యంత ప్రమాదం పొంచిఉన్న డ్యాంల జాబితాలో మేడిగడ్డ

ప్రతి సంవత్సరం వర్షాకాలం ముందు..తర్వాత తనిఖీలు తప్పనిసరి. 2025లో దేశవ్యాప్తంగా ప్రీ-మాన్సూన్ (వర్షాకాలానికి ముందు) 6,524 డ్యామ్‌లు పోస్ట్-మాన్సూన్ (వర్షాకాలం తర్వాత).. 6,553 డ్యామ్‌ల తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఈ పరిశీలనల ఆధారంగా డ్యామ్‌లను మరమ్మతుల అత్యవసరతను బట్టి వర్గీకరించినట్లు కేంద్రమంత్రి తెలిపారు. మేడిగడ్డ బ్యారేజ్ విషయంలో ఎన్‌డీఎస్‌ఏ సూచించిన నివారణ, రక్షణ చర్యలను తక్షణమే చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. కాగా.. దేశంలో 50 ఏళ్లు దాటిన 1,681 డ్యాములు ఉన్నాయని రాజ్‌భూషణ్ చౌదరి స్పష్టం చేశారు.

# వచ్చే ఏడాది వృద్ధి రేటు 6.8-7.2%

రోజుల్లో ప్రతికూలతలు పెరిగి పరిస్థితి వికటించే అవకాశం ఉందని కూడా ఆర్థిక సర్వే అంచనా వేసింది.అమెరికా సుంకాల భారం ఉన్నా భారత ఆర్థిక వ్యవస్థ పరుగులు తీసిందని ఆర్థిక సర్వే తేల్చింది. సుంకాల విధింపు తరువాత జీడీపీ వృద్ధి అంచనాలు తగ్గినా వాస్తవంలో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం చేపట్టిన వ్యవస్థాగత మార్పులు, విధానపరమైన నిర్ణయాల కారణంగా సుంకాల భారాన్ని భారత్ తట్టుకోగలిగిందని ఆర్థిక సర్వే అభిప్రాయపడింది. గత సంవత్సర కాలంలో దేశ ఆర్థిక పనితీరును.. రాబోయే సంవత్సరంలో ఆర్థికంగా ఎదురయ్యే సవాళ్లను ముందుగానే అంచనా వేసి చెప్పేదే ఈ ఎకనామిక్ సర్వే. ఆర్థిక మంత్రిత్వశాఖకు చెందిన ఎకనామిక్ అ÷ర్స్ డిపార్ట్‌మెంట్‌లోని ఎకనామిక్ డివిజన్ ఈ సర్వేను రూపొందిస్తుంది. తొలుత 1950-51 సంవత్సరం నుంచి ఆర్థిక సర్వేను బడ్జెట్ తో పాటే ప్రవేశపెట్టేవారు. 1960 తర్వాత బ్జడెట్‌కు ముందు ప్రవేశపెట్టే సంప్రదాయం మొదలైంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ.. దేశ జీడీపీ 6.8-7.2 శాతంగా ఉండొచ్చు. గతేడాదితో పోలిస్తే అంచనాలను పెంచింది. 2025-2026కు జీడీపీ అంచనాలను 7.4 శాతం నుంచి తగ్గించింది. ఇటీవల ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7.4? వృద్ధి రేటు నమోదుకావొచ్చని గణాంకాలు, పథకాల అమలు మంత్రిత్వశాఖ అంచనా వేసిన సంగతి తెలిసిందే. 2024-2025 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు 4.8శాతం. 2025-2026 ఆర్థిక సంవత్సరంలో అది 4.4 శాతంగా ఉంటుందని సర్వే అంచనా వేసింది. అంతర్జాతీయంగా అనిశ్చితులు కొనసాగుతున్నప్పటికీ.. 2026-2027కు భారత్‌లో స్థిరమైన వృద్ధి నమోదవు తుందని అంచనా వేసింది.వికసిత్ భారత్‌ను సాధించడంలో వ్యవసాయరంగం కీలకపాత్ర పోషిస్తుంది. దేశీయంగా తయారీ, ఎగుమతులు ఎలక్ట్రానిక్ రంగం వృద్ధికి దోహదం చేస్తున్నాయి. ఇందులో మొబైల్ తయారీ కీలకం. పదేళ్లలో ఉత్పత్తి విలువ 30 రెట్లు పెరిగి.. రూ.18వేల కోట్ల నుంచి రూ.5.45 లక్షల కోట్లకు చేరింది. డిజిటల్ సేవల విషయంలో గ్రామాలు, పట్టణాల మధ్య అంతరం తగ్గుతోంది. ఇటీవల భారత్-ఈయూ మధ్య కుదిరిన ట్రేడ్ డీల్ గురించి ప్రస్తావించింది.

# అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న సిటీగా హైదరాబాద్

పార్లమెంట్‌లో కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో తెలుగు రాష్ట్రాలైనా తెలంగాణ, ఏపీ అభివృద్ధి అంశాలను ప్రస్తావించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్?కు చెందిన పలు విషయాలను వెల్లడించింది. తెలంగాణ రాష్ట్రంలో సాగు యోగ్య భూ విస్తీర్ణం పెరిగినట్లు ఆర్థిక సర్వే వెల్లడించింది. మిషన్ కాకతీయ, కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల సాగు విస్తీర్ణం మెరుగుపడినట్లు వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రతీ సంవత్సరం ద్రవ్యోల్బణం తగ్గుతూ వస్తోందని పేర్కొంది.తెలంగాణలో సాగు యోగ్య భూ విస్తీర్ణం 2014-23 మధ్య 1.31 కోట్ల ఎకరాలు ఉందని, అది 2.21 కోట్లకు పెరిగినట్లు కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే వెల్లడించింది. తయారీ రంగంలో తెలంగాణ 5 % వాటా నమోదు చేసినట్లు పేర్కొంది. ఏఐ స్టార్టప్‌ల్లో తెలంగాణ వాటా 7 % కాగా 30 శాతంతో కర్ణాటక రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచింది. ఫైనాన్స్, ఐటీ, ప్రొఫెషనల్ సర్వీసుల్లో కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల వాటా 40 శాతంగా ఉంది. భూభారతి పోర్టల్ ద్వారా స్టాంప్స్, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల విభాగాలను తెలంగాణ రాష్ట్రం ఏకీకృతం చేసినట్లు పేర్కొంది.
అత్యధిక పట్టణ జనాభాలో ముంబయి, దిల్లీ, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ ఉన్నట్లు ఆర్థిక సర్వే తెలిపింది. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న సిటీల్లో హైదరాబాద్ నాలుగో స్థానం, ఏపీలోని విజయవాడ 10వ స్థానంలో నిలిచాయి. 2035 సంవత్సరం నాటికి హైదరాబాద్ జీడీపీ 201.4 బిలియన్ డాలర్లు, విజయవాడ 21.3 బిలియన్ డాలర్ల స్థాయికి పెరిగే అవకాశం ఉందని ఆర్థిక సర్వే అంచనా వేసింది. మున్సిపల్ బాండ్స్ జారీలో భాగ్యనగరం అగ్రస్థానంలో నిలిచింది.

# సెల్లార్లను వాహనాల పార్కింగ్‌కే వాడాలి

**వాణిజ్య భవనాల తనిఖీలకు హైడ్రా సిద్ధం: కమిషనర్ రంగనాథ్**

హైదరాబాద్(జనంసాక్షి):
వాణిజ్య భవనాల్లో తనిఖీలకు హైడ్రా సిద్ధమైంది. అగ్ని ప్రమాదాల నివారణే లక్ష్యంగా రద్దీ ప్రాంతాల్లోని వ్యాపార కేంద్రాలను గురువారంనుంచి తనిఖీలు చేపట్టాలని కమిషనర్ ఏవీ రంగనాథ్ నిర్ణయించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో నాంపల్లిలో అగ్ని ప్రమాదానికి కారణాలను అంచనా వేశామని, అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని ఆయన తెలియజేశారు. బుధవారం బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో వివిధ



శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యాపార సముదాయాలు, గృహోపకరణాలు, వస్త్ర తదితర విక్రయకేంద్రాల్లో సంయుక్త తనిఖీలు నిర్వహించాలని ఆయా శాఖలకు స్పష్టంచేశారు. అగ్నిమాపక చర్యలు పాటిం చని భవనాలకు వెంటనే విద్యుత్తు సరఫరా నిలిపేయాలని, లోపాలను తెలుపుతూ భవనం ముందు బోర్డులు ఏర్పాటుచేయాలని సూచించారు. అగ్నిప్రమాదం జరిగితే తప్పించుకునే దారిలేని దుకాణాలు, కాంప్లెక్సుల వివరాలను గుర్తిస్తే హైడ్రా కంట్రోల్‌రూం చరవాణి సంఖ్య 90001 13667ను సంప్రదించి ఆయా కాంప్లెక్సుల పేర్లు, ప్రాంతం, ఇతర సమాచారమివ్వాలని రంగనాథ్ పిలుపునిచ్చారు. ఫొటోలు, వీడియోలను పంపాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. నగరంలో గత ఏడాది 36 ప్రమాదాలు జరిగాయని, సగటున నెలకు మూడు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.తరలించకపోతే తాళమేస్తాం..: 'నాంపల్లిలో ఫర్నీచర్ దుకాణం సెల్లార్‌లో భారీగా గృహోపకరణాలను నిల్వ ఉంచారు. సెల్లారులో చిక్కుకున్నవారు మరణించారు. సెల్లారు దుర్వినియోగంతోనే ప్రాణ నష్టం జరిగింది' అని హైడ్రా కమిషనర్ పేర్కొన్నారు. అన్ని దుకాణాలు, వ్యాపార కేంద్రాల నిర్వాహకులు వెంటనే సెల్లార్లను ఖాళీ చేయాలి. వాహనాల పార్కింగ్‌కే వాడాలని స్పష్టంచేశారు. తనిఖీల్లో దొరికితే భవనానికి తాళం వేస్తామని హెచ్చరించారు.గోదాములు జన సంచారం లేని ప్రాంతాల్లోనే ఉండాలి. సెల్లార్లలో పేలుడు స్వభావం, మండే గుణమున్న వస్తువులను భద్రపరిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.అగ్ని వ్యాపించినప్పుడు మంటలను ఆర్పేసే సిలిండర్లు, స్ప్రింక్లర్లు అన్ని దుకాణాల్లో అందుబాటులో ఉండాలి. భవనం పైకప్పు, వెలుపల నీటి ట్యాంకు తప్పనిసరి. విద్యుదా ఘాతం చోటుచేసుకున్నప్పుడు దుకాణాల్లోని వినియోగదారులు జాగ్రత్తగా బయటకు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ దారి, దాన్ని సూచించే సూచిక బోర్డులు ఉండాలి.

# విచారణకు రాలేను.. మీరే ఎర్రవల్లికి రండి

**హైదరాబాద్(జనంసాక్షి):**ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు రావాలని సిట్ ఇచ్చిన నోటీసులకు భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ స్పందించారు. సిట్ నోటీసులకు కేసీఆర్ ప్రత్యుత్తరం పంపారు. శుక్రవారం విచారణ రాలేనని పోలీసులకు తెలిపారు. తనను ఎర్రవల్లిలో విచారణ చేయాలని కోరారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్లకు రేపే చివరి తేదీ అయినందున విచారణకు రాలేనని వివరించారు. మాజీ సీఎం, ప్రతిపక్ష నేతగా విచారణకు పూర్తిగా సహకరిస్తానని కేసీఆర్ వెల్లడించారు. 160 సీఆర్‌పీసీ కింద విచారణను ఒకే ప్రాంతంలో చేయాలన్న నిబంధనలు లేవని పేర్కొన్నారు. భవిష్యత్తులో నోటీసులన్నింటిని ఎర్రవల్లికే పంపాలని ప్రత్యుత్తరంలో కేసీఆర్ కోరారు.

**స్పందించిన సిట్**

ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు రావాలనే తమ ఆదేశాలకు కేసీఆర్ ఇచ్చిన సమాధానంపై సిట్ స్పందించింది. తేదీ, విచారణ ప్రదేశంపై న్యాయ సలహా తీసుకుని మరో నోటీసు ఇవ్వనుంది. రేపు విచారణకు హాజరుకాలేనన్న కేసీఆర్ విజ్ఞప్తిని సిట్ అంగీకరించింది. ఎర్రవల్లిలో విచారణ చేయాలనే కేసీఆర్ విన్నపంపై సిట్ న్యాయ సలహా తీసుకోనుంది. ఆ తర్వాత మరో నోటీసును కేసీఆర్‌కు ఇవ్వనుంది.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌కు నోటీసులు

కేసు తుది అంకానికి చేరుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే సిట్‌ను పూర్తిగా ప్రక్షాళన చేసి.. సీపీ సజ్జనార్ నేతృత్వంలో మార్పులు చేర్పులు చేశారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన పోలీస్ అధికారులను విచారించి, వారిని రిమాండ్‌కు తరలించారు. ఆ తరువాత ఫోన్ ట్యాపింగ్‌లో బాధ్యులుగా ఉన్నవారిని విచారించి వారి నుంచి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. ఈ కేసులో భాగంగా.. మాజీ ముఖ్యమంత్రిని సిట్ అధికారులు విచారించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే కేసీఆర్ ఈ విచారణకు హాజరవుతారా? లేదా? అనేది ఉత్కంఠగా మారింది.

# ఇది ప్రతీకార చర్యే

సుదీర్ఘ ఉద్యమం చేసి తెలంగాణను సాధించిన మహానాయకుడు కేసీఆర్. సాధించిన తెలంగాణను పదేళ్ల తన పాలనతో ప్రపంచానికి చాటి చెప్పిన నాయకుడు కేసీఆర్. సబ్బండ వర్గాలను కడుపులో పెట్టుకుని, రాష్ట్రాన్ని చంటి బిడ్డలా చూసుకుంటూ సాగునీటి విప్లవం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతుబంధు, రైతు బీమా, దళితబంధు వంటి పథకాలతో తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిన గొప్ప విజనరీ కేసీఆర్. అడ్డగోలు హామీలు ఇచ్చి, అబద్ధాల పునాదుల మీద అధికారంలోకి వచ్చిన అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రజల నోట్లో మట్టి కొట్టి, ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైంది. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, పాలనా లోపాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు, ఇప్పుడు విచారణల పేరుతో కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం అత్యంత దుర్మార్గమైన కక్షసాధింపు రాజకీయానికి నిదర్శనం' అని కేటీఆర్ అన్నారు. ప్రజల పక్షాన నిలబడి, ప్రజల గొంతుకగా ఈ అన్యాయ పాలనపై పోరాటం కొనసాగిస్తాం. తెలంగాణ చరిత్రను విచారణలతో కాదు.. ప్రజల తీర్పుతోనే రాస్తారు' అంటూ మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్‌లో పోస్టు చేశారు.

**రేవంత్ ప్రభుత్వ తీరుపై హరీష్ రావు ఆగ్రహం**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు జారీచేయడంపై ఆ పార్టీ వర్గాలు మండిపడ్డాయి. ఇది పూర్తిగా కక్షపూరిత రాజకీయమని విమర్శించారు. సిఎం రేవంత్‌రెడ్డి చిల్లర రాజకీయాలకు పరాకాష్ఠ అని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. కేసీఆర్‌ను టచ్ చేయడం అంటే తెలంగాణ ఆత్మగౌరవాన్ని టచ్ చేయడమే అని హెచ్చరించారు. ఈ మేరకు హరీష్‌రావు తన ఎక్స్ ఖాతాలో ఒక పోస్ట్ పెట్టారు. కేసీఆర్‌పై రాజకీయ కక్షతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం సాగిస్తున్న కుతంత్రాలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని హరీష్‌రావు తన పోస్టులో పేర్కొన్నారు. స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసి, దశాబ్దకాలంపాటు తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపిన మహానేత కేసీఆర్ అని కొనియాడారు. అలాంటి చరిత్రాత్మక నాయకుడిపై బురద చల్లాలని ప్రయత్నించడం అంటే సూర్యునిపై ఉమ్మి వేసే ప్రయత్నమేనని మండిపడ్డారు. పరిపాలనలో చేతకానితనంతో ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకు, సింగరేణి బొగ్గు కుంభకోణం మరకల నుంచి దృష్టి మళ్లించేందుకు, సిట్ పేరుతో నోటీసులు జారీచేయడం రేవంత్ రెడ్డి చిల్లర, చౌకబారు రాజకీయాలకు పరాకాష్ట అని హరీష్‌రావు విమర్శించారు. ఇలాంటి రాజకీయ వేధింపులతో మున్సిపల్ ఎన్నికల్లో లబ్ధి పొందవచ్చని భావించడం రేవంత్‌రెడ్డి రాజకీయ దివాళాకోరు తనానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. చరిత్రను సృష్టించిన నాయకుడు కేసీఆర్ అయితే, ఆ చరిత్రను మలినం చేయాలని చూస్తున్న చరిత్రహీనుడు రేవంత్ రెడ్డి అని హరీష్‌రావు మండిపడ్డారు. అధికారం శాశ్వతం కాదని, తెలంగాణ సమాజమంతా కేసీఆర్ వెంటే ఉన్నదని అన్నారు. కాంగ్రెస్ రాజకీయ వేధింపులకు భయపడే ప్రసక్తే లేదని, ప్రజలే వారికి తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేయడంపై ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ నియంతృత్వ పోకడలకు ఇదే నిదర్శనమన్నారు.

# గ్లోబల్ మ్యాప్‌లో తెలంగాణ అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యం



కెరీర్ ప్రారంభంలో ఎదురయ్యే ఒడుదొడుకులను ఎలా అధిగమించాలో విద్యార్థులకు దిశానిర్దేశర చేశారు. విజన్ తెలంగాణను గ్లోబల్ మ్యాప్‌లో అగ్రస్థానంలో నిలబెట్టడమే తన ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను కేవలం ఐటీ హబ్‌గానే కాకుండా అన్నిరంగాల్లో నూ మేటిగా తీర్చిదిద్దుతున్నామని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంటోంది. తన పర్యటనలో భాగంగా సీఎం పలు కీలక సమావేశాలు, అంతర్జాతీయ సంస్థలతో చర్చలు, విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ముఖ్యంగా ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హార్వర్డ్ బిజినెస్ స్కూల్లో భారతీయ విద్యార్థులతో జరిగిన భేటీ.. రాజకీయ, విద్య, ఆర్థిక వర్గాల్లో విస్తృత చర్చకు దారితీసింది. సీఎం అమెరికా పర్యటన తెలంగాణకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడమే కాకుండా విదేశాల్లో ఉన్న విద్యార్థులను రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములను చేసేలా ఉంది. విద్యార్థులతో జరిగిన చర్చా గోష్ఠిలో సీఎం రేవంత్ తన రాజకీయ ప్రస్థానాన్ని, ఎదుర్కొన్న సవాళ్లను వివరించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్ట్ గురించి ప్రస్తావించారు. తెలంగాణ అభివృద్ధిలో అంతర్జాతీయ ప్రమాణాలను ఎలా పాటిస్తున్నామో చెప్పారు. భారతదేశ అభివృద్ధిలో యువత పాత్ర అత్యంత కీలకమని సీఎం అభిప్రాయపడ్డారు. విద్యార్థులు పొందుతున్న ఈ ప్రపంచ స్థాయి విద్య, కేవలం మీ కెరీర్ కోసమే కాకుండా దేశాభివృద్ధికి ఉపయోగపడాలని మార్గనిర్దేశర చేశారు. భారతీయ యువత మేధస్సు ప్రపంచాన్ని శాసిస్తోందని వ్యాఖ్యానించారు. హార్వర్డ్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో చదువుతున్న విద్యార్థులు, అంతర్జాతీయ వేదికలపై హైదరాబాద్, తెలంగాణకు బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరించాలని సీఎం పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఉన్న అద్భుతమైన అవకాశాల గురించి ప్రపంచానికి చాటి చెప్పాలని కోరారు.

# 'మామునూరు'పై కీలక ముందడుగు

చరిత్రలో నిలిచిపోయే రోజు అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గురువారం బేగంపేట విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. మామునూరు తరహాలోనే ఆదిలాబాద్, కొత్తగూడెం పట్టణాల్లో ఏర్పాటు చేయదలచిన ఎయిర్‌పోర్ట్ ల నిర్మాణం పనిని వేగవంతం చేయాలని కేంద్రమంత్రికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. తెలుగు గడ్డపై పుట్టిన వ్యక్తి కేంద్రంలో వైమానిక శాఖ మంత్రిగా ఉండడం అభినందనీయమని వారు తెలంగాణ రాష్ట్ర అవసరాలను గుర్తిస్తూ సహకారం అందించాలని డిప్యూటీ సీఎం కోరారు. 2007లోనే ఎయిర్‌పోర్ట్ అథారిటీతో మామునూరు ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి ఒప్పందం చేసుకున్నప్పటికీ గత పది సంవత్సరాలు పరిపాలించిన వారు పట్టించుకోక పోవడంతో వరంగల్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం ఆలస్యమైందని డిప్యూటీ సీఎం తెలిపారు. హైదరాబాద్ కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని టూ టైర్ సిటీలు అయినా కొత్తగూడెం ఆదిలాబాద్ లో ఎయిర్‌పోర్ట్ నిర్మాణం చేయాలని కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టగానే రామ్మోహన్ నాయుడును రాష్ట్ర క్యాబినెట్ మొత్తం కోరగా వారు సానుకూలంగా స్పందించి ముందుకు వెళ్లడం శుభసూచకం అని తెలిపారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ 1930లో నిజాం కాలంలోనే పనులు మొదలుపెట్టారని ఇది ఆనాడు దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద ఎయిర్‌పోర్ట్ అని డిప్యూటీ సీఎం తెలిపారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ భూసేకరణకు 300 కోట్లు అవసరమని గుర్తించి వాటిని వెంటనే విడుదల చేసి వడివడిగా అడుగులు వేసి భూసేకరణ పక్రియను పూర్తి చేశామని డిప్యూటీ సీఎం తెలిపారు.

# ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దులో ఎదురుకాల్పులు

- పలువురు మావోయిస్టులు మృతి
- భారీగా ఆయుధాల స్వాధీనం

**చర్ల(జనంసాక్షి):**ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దులో గురువారం ఎదురుకాల్పులు జరుగుతున్నాయి. బీజాపూర్ జిల్లా దక్షిణ ప్రాంతంలోని పామెడ్ పీఎస్ పరిధిలో జరుగుతున్న ఈ కాల్పుల్లో పలువురు మావోయిస్టులు మృతిచెందినట్లు సమాచారం. ఆ ప్రాంతంలో మావోయిస్టుల నుంచి ఆయుధాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. మావోయిస్టుల మృతిని అధికార వర్గాలు ధ్రువీకరించాల్సి ఉంది.

**తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు..**

# ఫిర్యాదుల కోసం మొబైల్ యాప్

**'టీఈ-పోల్'ను అందుబాటులోకి తీసుకొచ్చిన ఎస్‌ఈసీ**

**హైదరాబాద్:** మరికొన్ని రోజుల్లో తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల సంబంధిత ఫిర్యాదుల కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్‌ఈసీ) 'టీఈ-పోల్' మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎన్నికలకు సంబంధించి సమస్యలుంటే ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చని పేర్కొంది. వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదులు చేయొచ్చని ఎస్‌ఈసీ తెలిపింది. ఏడు నగరపాలక సంస్థలు, 116 పురపాలక సంఘాలకు ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనుంది. 13న ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉంటుంది.

# భారత్- ఈయూ ట్రేడ్ డీల్ మమ్మల్ని నిరాశపరిచింది

**- ఉక్రెయిన్‌లో ఇంకా యుద్ధం కొనసాగుతున్నప్పటికీ ఐరోపా వాణిజ్య ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చింది:అమెరికా**

**జనంసాక్షి:**భారత్- ఐరోపా సమాఖ్యల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. ఈ డీల్ తమను తీవ్రంగా నిరాశపరిచిందని అమెరికా ఆర్థిక శాఖ మంత్రి స్కాట్ బెసెంట్ అన్నారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్‌లో ఇంకా యుద్ధం కొనసాగుతున్నప్పటికీ.. ఈయూ వాణిజ్య ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చిందంటూ ఆయన మండిపడ్డారు. ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ బెసెంట్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'వాళ్లకు ఏది ఉత్తమమైందో వారు అది చేయాలి. కానీ యూరోపియన్లు నన్ను చాలా నిరాశపరిచారు' అని అన్నారు. గతేడాది భారత దిగుమతులపై అమెరికా భారీగా సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. తమలాగే భారత్‌పై అదనపు సుంకాలు విధించేందుకు అప్పుడు ఈయూ విముఖత వ్యక్తం చేసిందన్నారు. సొంత వాణిజ్య ఒప్పందం కోసం ముందుకువెళ్లాలనే ఉద్దేశంతోనే .. వారు ఆ పని చేసేందుకు ఇష్టపడలేదన్నారు. ఐరోపా ఉక్రెయిన్ ప్రజల కంటే వాణిజ్య ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. 'రష్యా చమురు భారత్‌కు వెళ్తుంది. దాన్ని శుద్ధి చేసి భారత్ చమురు ఉత్పత్తులు తయారుచేస్తుంది. ఇప్పుడు యూరోపియన్లు వాటిని కొనుగోలు చేస్తున్నారు.

# మేడారం జాతరకు కేంద్రం మొండిచేయి

విస్తీర్ణంలో శాశ్వత మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయను న్నట్లు చెప్పారు. ఈ ప్రాంతంలో శాశ్వతంగా కాటేజీలు, ఫంక్షన్ హాళ్లు, మరిన్ని మరుగుదొడ్లు, స్నానపు గదులు నిర్మించనున్నట్లు వివరించారు. క్షిణ భారత కుంభమేళాగా పేరొందిన మేడారం జాతర ప్రాధాన్యత ను మరింత పెంచేందుకు బాసర నుంచి భద్రాచలం వరకు రూ.2,500 కోట్ల వ్యయంతో టెంపుల్ సర్క్యూట్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మంత్రి తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని ప్రముఖ ఆలయాల అభివృద్ధిలో మేడారం ఆలయాన్ని కూడా భాగంగా చేర్చనున్నట్లు ఆయన ప్రకటించారు. జంపన్న వాగులో ఏడాది పొడవునా నీరు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ఇందుకోసం రామప్ప?లక్నవరం?జంపన్న వాగు వరకు పైప్‌లైన్ ద్వారా నీటిని తరలించే ప్రాజెక్టును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారని, వాగుపై చెక్‌డ్యామ్‌లు నిర్మించి శాశ్వత నీటి నిల్వకు ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు. మేడారం ప్రాంతానికి ఇప్పటికే ఒక సమగ్ర మాస్టర్ ప్లాన్ సిద్ధమైందని, దాని ప్రకారం అంతర్గత రోడ్ల అభివృద్ధి, ఎకో పార్కుల ఏర్పాటు, పర్యాటక సౌకర్యాల విస్తరణ చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. సోషల్ మీడియాలో వస్తున్న దుష్ప్రచారాలను నమ్మవద్దని భక్తులకు మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం భక్తుల సౌకర్యార్థం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ, ఈసారి గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ రెండు రోజుల్లోనే 70 నుంచి 80 లక్షల మంది భక్తులు ఇప్పటికే దర్శనం చేసుకున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పంతో, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పర్యవేక్షణలో అత్యంత తక్కువ సమయంలో ఆలయ అభివృద్ధి పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. గతంలో ఇరుకైన రోడ్ల కారణంగా ఇబ్బందులు ఉండేవని, ఈసారి ఫోర్-లేన్ రోడ్లతో రాకపోకలు చాలా సులభమయ్యాయని తెలిపారు. భవిష్యత్తులో శాశ్వత తాగునీటి వ్యవస్థతో పాటు భారీ సంఖ్యలో శాశ్వత మరుగుదొడ్ల నిర్మాణం అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విస్తృతంగా చెట్ల పెంపకం చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు.జాతర విజయవంతానికి సహకరించిన రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, ఎస్పీ, అధికార యంత్రాంగం మరియు మీడియా మిత్రులకు సీతక్క అభినందనలు తెలిపారు.నివారం సాయంత్రం 4 గంటలకు తల్లులు గద్దెల నుంచి తిరిగి వనప్రవేశం చేయనున్నారని, అప్పటివరకు భక్తులు ఓపికతో దర్శనాలు చేసుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

## వనం వీడి జనంలోకి సమ్మక్క

ములుగు,జనవరి29(జనంసాక్షి):సమ్మక్క తల్లికి ఘనస్వాగతం పలికిన మంత్రులు సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ - సమ్మక్కకు జై అంటూ భక్తులు నినాదాలు - భక్తుల జయజయధ్వానాలతో కాసేపట్లో గద్దెలపైకి సమ్మక్క మేడారం జాతరలో కీలక ఘట్టం రానే వచ్చింది. వనం (చిలకలగుట్ట) వీడి జనంలోకి సమ్మక్క ఆగమనం ప్రారంభమైంది. సమ్మక్క తల్లికి గౌరవసూచకంగా గాల్లోకి ఎస్పీ రాంనాథ్? కేకన్? కాల్పులు జరిపారు. పోలీసులు సమ్మక్క తల్లికి గౌరవవందనం సమర్పించారు. ఆ తల్లికి మంత్రులు సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ ఘనస్వాగతం పలికారు. భక్తులు సమ్మక్కకు జై అంటూ నినాదాలు చేశారు. భక్తుల జయజయధ్వానాలతో సమ్మక్క కాసేపట్లో గద్దెలపైన కొలువుదీరనుంది. బుధవారమే సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెలపై కొలువుదీరారు.. భక్తజన సంద్రంగా మేడారం
ఆసియాలోనే అతి పెద్ద జాతరైన మేడారంలో వరుసగా కీలక ఘట్టాలు చోటు చేసుకుంటున్నాయి. సారలమ్మ బుధవారం గద్దెపైకి చేరుకోగా.. సమ్మక్క గద్దెనెక్కనున్నారు. ఇందుకోసం చిలకలగుట్ట నుంచి సమ్మక్క గద్దెపైకి రానున్నారు. ఈ నేపథ్యంలో భక్తజనం పులకించనుంది. సమ్మక్క రాకతో ఈ జాతర పరిపూర్ణం కానుంది. గురువారం అర్ధరాత్రి నుంచి వనదేవతలకు భక్తులు మొక్కులు చెల్లించుకోనున్నారు. మరోవైపు ఇప్పటికే ఈ జాతర సందర్భంగా మేడారం భక్తులతో కిక్కిరిసిపోయింది. నేపథ్యంలో మేడారంలో భారీగా పోలీసులు మోహరించారు. ఇక రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి.. జాతర ఏర్పాట్లను స్వయంగా బైక్ నడుపుతూ పరిశీలించారు. జనవరి 28న ప్రారంభమైన ఈ జాతర.. 31న ముగియనుంది. ప్రతి రెండేళ్లకు ఒకసారి జరుపుకునే ఈ జాతరకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి కోట్లాది మంది మేడారం తరలిరానున్నారు. వనదేవత సమ్మక్క.. గురువారం గ్ధదెపైకి రానున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ ఏర్పాట్లపై జిల్లాకు చెందిన మంత్రి సీతక్క ఇప్పటికే ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.

## దేశంలనే అతి పెద్ద గిరజనుల పండగ

మేడారం,జనవరి 29(జనంసాక్షి):మేడారం సమ్మక్క-సారక్క జాతర సందర్భంగా కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరం, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ప్రత్యేకంగా గద్దెలను దర్శించుకుని మొక్కులు సమర్పించారు. సందర్భంగా రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దనసరి అనసూయ సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆలయ ప్రధాన ద్వారం వద్ద కేంద్ర మంత్రులకు ఘన స్వాగతం పలికారు. గిరిజన సంప్రదాయ డోలు,డప్పుల నడుమ ఆలయంలోకి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తల్లులకు నిలువెత్తు బంగారం సమర్పించి మొక్కులు చెల్లించారు. తదనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరం మాట్లాడుతూ, సమ్మక్కసారక్క జాతర దేశంలోనే అతిపెద్ద గిరిజన పండుగ. ఇది గిరిజనుల మహాకుంభంగా నిలుస్తోంది. సుమారు 20 ఏళ్ల క్రితం నేను ఇక్కడికి వచ్చాను. ఇప్పుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు మళ్లీ ఈ పవిత్ర జాతరకు రావడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో నిధులు అందిస్తోందని తెలిపారు. జాతర నిర్వహణకు సహకరిస్తూనే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనకు పాత మిత్రులని, పార్లమెంటులో కలిసి పనిచేసిన అనుభవం ఉందని గుర్తు చేశారు. గిరిజన సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ధర్తీ ఆబా గిరిజన గ్రామ ఉత్కర్ష్ అభియాన్ కింద 1 లక్ష కోట్లు పీఎం జన్-మన్ యోజన కింద 24,000 కోట్లు, తెలంగాణకు 23 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు మంజూరు చేయడం జరిగిందన్నారు.

# అమెరికా, చైనాలపై ఆధారపడటం మంచిది కాదు

- టెక్నాలజీ, సెమీ కండక్టర్స్, ఏఐల విషయంలో జాగ్రత్త పడాలి
- ఉదయం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు జంక్‌ఫుడ్ ప్రచారాన్ని నిషేధించాలి
- కేంద్రానికి ఆర్థిక సర్వే కీలక సూచన

న్యూఢిల్లీ,జనవరి 29(ఆర్ఎన్ఎ): వస్తువులు, సేవల విషయంలో అమెరికా, చైనాలపై ఆధారపడటం మంచిది కాదని ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. మరీ ముఖ్యంగా టెక్నాలజీ, సెమీ కండక్టర్స్, ఏఐ, ట్రేడ్ కంట్రోల్స్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని.. లేదంటే అమెరికా, చైనా దేశాల మధ్య భారత్ క్రాస్ ఫైర్ అవ్వక తప్పదని తెలిపింది. కేంద్ర బడ్జెట్ 2026 - 27 సిద్ధమవుతోంది. ఫిబ్రవరి 1వ తేదీన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో 'ది ఎకనామిక్ సర్వే 2025 - 26' భారత్‌ను హెచ్చరించింది. అమెరికా, చైనాల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించింది. ఎకనామిక్ సర్వే ప్రకారం.. ప్రపంచ రాజకీయాల్లో చైనా, అమెరికా దేశాల మధ్య గట్టి పోటీ నడుస్తోంది. చైనాను అన్ని రంగాల్లో వెనక్కు తోసేయాలని అమెరికా.. అమెరికాను అన్ని రంగాల్లో వెనక్కు తోసేయాలని చైనా పావులు కదుపుతున్నాయి. అమెరికా ఆధిపత్యం సాగిస్తున్న రంగాలపై చైనా దృష్టి సారించింది. అమెరికా కూడా అదే పని చేస్తోంది. ఒకే విధమైన ఆలోచనలు ఉన్న దేశాలను కలుపుకొని సెక్యూర్ ఏఐ ఎకోసిస్టమ్‌ను తయారు చేయాలని అమెరికా చూస్తోంది.

**ఉదయం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు జంక్‌ఫుడ్ ప్రచారాన్ని నిషేధించాలి..!**

అధిక కొవ్వు, చక్కెర కలిగిన అత్యంత ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాల వినియోగంపై ఆందోళనలు వ్యక్తమవుతోన్న వేళ కేంద్ర ఆర్థిక సర్వే కీలక సూచన చేసింది. ఉదయం 6 గంటల నుంచి అర్ధరాత్రి 11 గంటల వరకు జంక్ ఫుడ్ ప్రకటనలపై నిషేధం విధించే అవకాశాలను పరిశీలించాలని పేర్కొంది. అలాగే చిన్నారులు, పసిపిల్లల పాల ఉత్పత్తులు, పానీయాల మార్కెటింగ్‌పైనా ఆంక్షలు విధించాలని పిలుపునిచ్చింది.2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆర్థిక సర్వేను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంట్ ఉభయసభల్లో ప్రవేశపెట్టారు. ఈ సర్వేలో అత్యంత ప్రాసెస్ చేసిన ఆహార వినియోగాన్ని తగ్గించే అంశాలపై ప్రస్తావించారు.

# మేడారం జాతరలో నిరంతర విద్యుత్

- సరఫరాలో విద్యుత్ శాఖ నిరంతర ఏర్పాట్లు



మేడారం (జనంసాక్షి) : మేడారంలో రౌండ్ ద క్లాక్ విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫరా తీరు తెన్నులను పర్యవేక్షిస్తున్నారని డైరెక్టర్ ఆపరేషన్, ప్రాజెక్ట్స్ టి.మధుసూదన్, మోహన్ రావు తెలిపారు. విద్యుత్ పరంగా మేడారంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సత్వర చర్యలు తీసుకుంటూ మిరుమిట్లు గొలిపేలా వెలుగుల మేడారంగా తీర్చిదిద్దిన ఎన్పీడీసీఎల్ అని అన్నారు. వెలుగుల జిగేల్ మనేలా తీరిచిద్దిన మేడారంకు అధికారులు, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సిబ్బంది నిత్యం 24/7 విధులు నిర్వహిస్తున్నారన్నారు. చీఫ్ ఇంజనీర్లు కె. రాజు చౌహన్, ఆశోక్ పర్యవేక్షణలో నలుగురు సూపరిండెంట్ ఇంజనీర్లు, ఏడుగురు డివిజన్ ఇంజనీర్లు, 30 మంది అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, సబ్ ఇంజనీర్లు 150 నుండి 500 మంది ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ఉద్యోగులు మూడు బ్యాచ్లో 30 మంది చొప్పున విధులు నిర్వహిస్తున్నారనీ చెప్పారు. వీరు తమకు కేటాయించిన ప్రాంతాల్లో లైన్ పెట్రోలింగ్ చేస్తూ లోపాలను గుర్తిస్తూ సరి చేస్తారు. రాత్రి, పగలు లేకుండా అహో రాత్రులు కష్టపడుతూ విధులు నిర్వర్తిస్తూ భక్తులకు విద్యుత్ పరంగా ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నారు . ఎప్పటికప్పుడు లోడ్ మానిటరింగ్ చేస్తూ , విద్యుత్ ప్రమాదాలు జరగకుండా లైన్లకు స్పేసర్ లు పెట్టడం జరిగిందని ,భద్రతకు పెద్దపేట వేశామని చెప్పారు. ట్రాన్స్ఫార్మర్లకు ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేశామని డైరెక్టర్లు టి.మధుసూదన్, వి.మోహన్ రావు తెలియజేశారు. శాశ్వత ప్రాతిపదికన జంపన వాగు ఇరువైపుల 6 టవర్లు ఏర్పాటు చేశామని, నిరంతరం ట్రాన్స్ఫార్మర్ల వద్ద సిబ్బంది లోడ్ తనిఖీ చేస్తూ ఉంటారని ,ఎక్కడ ఎటువంటి సమస్య ఉన్న వెంటనే తెలియజేసేలా రేడియో ఫ్రీక్వెన్సీ ద్వారా వెంటనే సమాచారం కంట్రోల్ రూమ్ కు చేరవేస్తుందని, అక్కడ ఉన్న సిబ్బంది కి తెలియజేసి సమస్య పరిష్కరించడం జరుగుతుందని వివరించారు. ప్రతి ఒక్కరు విద్యుత్ పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని, ఎక్కడ సమస్య దగ్గర లో ఉన్న మా సిబ్బందికి తెలపాలని కోరారు.

# అంతరాయం లేకుండా రాష్ట్రంతో విద్యుత్ సరఫరా

- రాజస్థాన్, గుజరాత్ విధానాలు అధ్యయనం చేయాలి
- పునరుత్పాదక ఇంధన రంగాల పనులు వేగవంతం చేయాలి
- అధికారులతో సమీక్షలో సిఎస్ రామకృష్ణారావు సూచన



హైదరాబాద్, జనవరి 29 (జనంసాక్షి) : రాష్ట్రంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. అలాగే, పునరుత్పాదక ఇంధన రంగంలో చేపడుతున్న కార్యక్రమాలను వేగవంతం చేయాలని, ప్రాజెక్టుల అమలులో నిర్ణీత కాలపరిమితులను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇంధన, వైద్య ఆరోగ్య, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, పరిశ్రమలు, మైన్స్, టిజిఐఐసి, భారత ఫ్యూచర్ సిటీ , ఇరిగేషన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, మూసీ సుందరీకరణ, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ తదితర శాఖల పనితీరుపై విభాగాల వారీగా గురువారం డా.బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, టిజి ట్రాన్స్కో, టిజి జెన్కో, టిజి ఎస్పిడిసిఎల్, టిజి ఎన్పిడిసిఎల్ విభాగాలలో కొనసాగుతున్న ప్రతిపాదిత ప్రాజెక్టుల పురోగతి, అలాగే భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లో విద్యుత్ రంగంలో అమలవుతున్న విధానాన్ని పరిశీలించి మన రాష్ట్రంలో కూడా వివిధ డిస్కంలలో అమలు చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు చేపట్టిన పనుల పురోగతిపై సి.ఎస్ కు వివరించారు. ఇ-గవర్నెన్స్, తదితర అంశాలు, అండర్ గ్రౌండ్ కేబులింగ్, విజన్ 2047 లక్ష్యాలు, గ్రేటర్ హైదరాబాద్ భవిష్యత్ విద్యుత్ అవసరాల మేరకు ప్రతిపాదించిన చంద్రవెల్లి, రాయదుర్గం, షాద్ నగర్, పరిగి లో విద్యుత్ సబ్ స్టేషన్ల పనుల పురోగతి పై సి.ఎస్ సమీక్షించారు. రాష్ట్రంలో వరంగల్, ఆల్వాల్, సనత్ నగర్, ఎల్.బి.నగర్, న్యూ ఉస్మానియా, నిమ్స్ ఆసుపత్రి విస్తరణ పలు ప్రాంతాలలో నిర్మితమవుతున్న ప్రభుత్వ ఆసుపత్రుల భవనాల పురోగతి, ప్రజలకు అందుతున్న వైద్య సేవల నాణ్యత, వైద్య సదుపాయాల లభ్యత, మౌలిక వసతుల అభివృద్ధి, ప్రభుత్వ ఆసుపత్రులలో మందుల సరఫరా, వైద్య శాఖలో నర్సింగ్, వైద్యుల నియమకాలు, ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన ఇహెచ్ఎస్ పథకం, వైద్య పరికరాల సరఫరా తదితర అంశాలపై సి.ఎస్ సమీక్షించారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సి.ఎస్ ఆదేశించారు. ముఖ్యంగా గ్రామీణ, దూర ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు సమర్థవంతంగా అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జి.హెచ్.యం.సి పరిధిలో చేపట్టిన ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణం, ఆల్వాల్, సనత్ నగర్, ఎల్.బి.నగర్, వరంగల్ ఆసుపత్రుల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని సి.ఎస్ అధికారులను ఆదేశించారు. నూతన ఆసుపత్రుల అవసరాలకు మేరకు తగినట్లు అధునాతన వైద్య పరికరాలను సమకూర్చుకోవాలని, ఇందుకు సంబంధించి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అధునాతన పరికరాల ఏర్పాటుకు తగినట్లు గదులు, ల్యాబ్లు, ఇతర నిర్మాణాలు ఉండాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఐటీఈ/సీ శాఖలో ప్రస్తుత కార్యకలాపాలు, కొనసాగుతున్న ప్రాజెక్టులు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలపై అధికారులు సి.ఎస్ కు వివరించారు. ముఖ్యంగా డిజిటల్ గవర్నెన్స్, ఐటీ పెట్టుబడుల ఆకర్షణ, స్టార్టప్ ఎకోసిస్టం అభివృద్ధి, ఈ-గవర్నెన్స్ సేవల విస్తరణ, సైబర్ సెక్యూరిటీ, రాష్ట్రంలో ఉన్న 12,751 గ్రామ పంచాయతీలలో టి ఫైబర్ విస్తరణపై సమీక్ష చేశారు.

భారత ఫ్యూచర్ సిటీ, టిజి ఐఐసి చేపట్టిన పనుల పురోగతి పై సి.ఎస్ సమీక్షించారు. ఇరిగేషన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, మూసీ సుందరీకరణ, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ విభాగాలలో చేపట్టిన ప్రాజెక్టలపై సి.ఎస్ సమీక్షించారు. గత మూడు రోజులుగా ఇప్పటి వరకు 13 విభాగాలను ప్రధాన కార్యదర్శి సమీక్షించారు. రాబోయే రెండు రోజులలో మిగతా విభాగాల సమీక్షకు సిద్ధమవుతున్నారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేశ్ రంజన్, సంజయ్ కుమార్, నవీన్ మిట్టల్, మైన్స్ ముఖ్యకార్యదర్శి శ్రీధర్, ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ రాహుల్ బొజ్జ, హెచ్ యం.డి.ఎ. కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తు, మున్సిపల్ పరిపాలన కార్యదర్శి టి.కె.శ్రీదేవి, టిజి ట్రాన్స్కో సిఎండి కృష్ణ భాస్కర్, టిజి ఎస్పిడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ, ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ కమిషనర్ శశాంక, హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్, ఐటి ప్రత్యేక కార్యదర్శి భవేష్ మిశ్రా, టిజి ఎన్.పి.డి.సి.ఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ ఎండీ ఈవీ నర్సింహారెడ్డి, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ యం.డి. ఆశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మీడియా మాధ్యమాల్లో వచ్చే ఎన్నికల వార్తలపై నిఘా ఉంచాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్
- డీపీఆర్వో కార్యాలయంలో మీడియా సెంటర్ ప్రారంభించిన కలెక్టర్



నిర్మల్ రూరల్, జనవరి 29 (జనంసాక్షి) : మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా మాధ్యమాలలో వచ్చే రాజకీయ వార్తలపై పటిష్ట నిఘా ఉంచాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని డిపిఆర్ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేట్ అండ్ మానిటరింగ్ కమిటీ (మీడియా సెంటర్) ను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్,అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్,డిపిఆర్ఓ విష్ణువర్ధన్ తో కలిసి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. డిపిఆర్ఓ కార్యాలయానికి వచ్చిన కలెక్టర్ కు డిపిఆర్ఓ పూల మొక్కను అందించి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోజువారీగా వార్త పత్రికలు,లోకల్ చానళ్లలో వచ్చే వార్తలను ప్రతిరోజు నిశితంగా గమనిస్తూ ఉండాలని అన్నారు.అనుమానిత పెయిడ్ న్యూస్ వివరాలు నమోదు చేయాలని అన్నారు.అన్ని రకాల రిజిస్టర్లను జాగ్రత్తగా నమోదు చేయాలని పేర్కొన్నారు.వివిధ రకాల సామాజిక మాధ్యమాల్లో వచ్చే వార్తలపై నిఘా ఉంచాలని తెలిపారు.ఈ మీడియా సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్,ఇతర అధికారులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# భారత సైన్యం అత్యున్నత క్రమశిక్షణకు మారుపేరు

- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- ఆర్మీ గ్యారిసన్లో 108 అడుగుల భారీ జాతీయ పతాకావిష్కరణ



హైదరాబాద్, జనవరి 29 (జనంసాక్షి) : భారత సైన్యం అత్యున్నత క్రమశిక్షణకు, నిరంతర అప్రమత్తతకు మారుపేరని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ కొనియాడారు. హైదరాబాద్లోని మెహదీపట్నం ఆర్మీ గ్యారిసన్లో భారత సైన్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 108 అడుగుల ఎత్తైన భారీ జాతీయ పతాకాన్ని గురువారం నాడు గవర్నర్ ఆవిష్కరించారు. 'ఫ్లాగ్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా' సహకారంతో ఏర్పాటు చేసిన ఈ హై-మాస్ట్ జెండాను ఆవిష్కరించిన అనంతరం గవర్నర్ గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. భారత సాయుధ దళాల వృత్తి నైపుణ్యం, నిస్వార్థ సేవలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. మాజీ సైనికులు సేవలను ప్రత్యేకంగా అభినందించారు. దేశభక్తి, క్రమశిక్షణను అలవర్చుకుని నవ భారత నిర్మాణంలో పాలుపంచుకోవాలని ఎన్సీసీ కెడెట్లకు పిలుపునిచ్చారు. ఇంతటి భారీ పతాకాన్ని స్పాన్సర్ చేసిన ఫ్లాగ్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు నవీన్ జిందాల్ను గవర్నర్ అభినందించారు. బైసన్ డివిజన్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మేజర్ జనరల్ రాహుల్ దేవ్ శర్మ మాట్లాడుతూ.. పరిపాలన విభాగం, బైసన్ డివిజన్ మధ్య ఉన్న సమన్వయానికి ఈ భారీ పతాక ఏర్పాటు ఒక నిదర్శనమని అన్నారు. చారిత్రక నేపథ్యం ఉన్న మెహదీపట్నం గ్యారిసన్లో ఈ జెండాను నెలకొల్పడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సి.వి. ఆనంద్, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి, సైబరాబాద్ సి. పి ఎం. రమేష్, ఉన్నత స్థాయి ఆర్మీ అధికారులు, ఎన్సీసీ కెడెట్లు మరియు ఫ్లాగ్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అభివృద్ధి పనులు

- ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయండి
- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

హైదరాబాద్, జనవరి 29 (జనంసాక్షి) : గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పూర్తి అయిన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. స్థానిక కార్పొరేటర్ లు, ప్రజా ప్రతినిధులను ప్రారంభోత్సవ కార్యక్రమాలలో తప్పనిసరిగా భాగస్వామ్యం చేయాలన్నారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలన్నారు. గురువారం నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన 11 వ సాధారణ స్టాండింగ్ కమిటీ సమావేశం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూం లో జరిగింది.

# కెసిఆర్కు నోటీసులపై బిఆర్ఎస్ మండిపాటు

- సిఎం రేవంత్ దిష్టిబొమ్మ దగ్ధం చేసిన మాజీమంత్రి వేముల

నిజామాబాద్, జనవరి 29 (జనంసాక్షి): బీఆర్ఎస్ అధినేత కేసిఆర్కు సిట్ నోటీసు జారీ చేయడంపై మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ప్రభుత్వంపై మండిపడ్డారు. రేవంత్ రెడ్డి చేస్తున్న కుట్రలను ప్రజలు సహించబోరని ఆయన అన్నారు. సిట్ నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ తన స్వగ్రామంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను వేల్పూర్లో దగ్ధం చేశారు. ఉద్యమ నాయకుడిగా, రాష్ట్రాన్ని సాధించి అభివృద్ధి పథంలో నడిపిన నాయకుడిపై ఇలాంటి చర్యలు తీసుకోవడం ప్రజాస్వామ్యానికి తూట్లు పొడవడమేనన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లో తీవ్ర అభద్రతా భావం పెరిగిపోయిందని, తన ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో కప్పిపుచ్చుకునేందు సిట్లు, కమిషన్ల పేరుతో డైవర్షన్ పాలిటిక్స్కు తెరలేపుతున్నారని మండిపడ్డారు.

# మోమో గోదాం ప్రమాదంలో 21కి చేరిన మృతుల సంఖ్య

- మరో 28 మంది ఆచూకీ తెలియకుండా పోవడంతో ఆందోళన

కోల్కతా, జనవరి 29 (జనంసాక్షి) : కోల్కతా దక్షిణ 24 పరగణాల జిల్లాలోని మోమో ఆహార పదార్థాల గోదాంలో సోమవారం అగ్నిప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య 21కి చేరుకుంది. మరో 28 మంది ఆచూకీ తెలియాల్సి ఉంది. దీంతో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. అక్కడి పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, అలాగే రాజకీయ నాయకుల పర్యటన నేపథ్యంలో.. బుధవారం అర్ధరాత్రి నుంచి ఆ ప్రాంతంలో నిషేధాజ్ఞలు విధించామని పోలీసులు తెలిపారు. జనవరి 26(సోమవారం) గణతంత్ర దినోత్సవం వేళ పశ్చిమ బెంగాల్ రాష్ట్ర రాజధాని కోల్కతాలో జరిగిన భారీ అగ్నిప్రమాదం ఘోర విషాదాన్ని మిగిల్చింది. సోమవారం ఉదయం 3 గంటలకు ఆనంద్పూర్ ప్రాంతంలోని రెండు ఆహార గోదాంలలో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న వెంటనే అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది.. మంటలను ఆర్పేందుకు తీవ్రంగా శ్రమించారు. అయితే గోదాం లోపల పొడి ఆహార పదార్థాలతో పాటూ మండే వస్తువులు అధికంగా ఉండడంతో మంటలు వేగంగా వ్యాపించాయి. గంటల తరబడ్డి÷ర్ సిబ్బంది ప్రయత్నం చేసినా మంటలు అదుపులోకి రాలేదు. చాలా సమయం తర్వాత అగ్నిమాపక సిబ్బంది అందులో చిక్కుకున్న వారి కోసం గాలింపులు చేపట్టగా తొలి రోజు 16 మంది మృతదేహాలు లభ్యమయ్యాయి. తాజాగా గురువారం మరో ఐదు మృతదేహాలను గుర్తించారు. దీంతో మృతుల సంఖ్య 21కి చేరింది. మిగతా వారి కోసం గాలింపు చేపడుతున్నారు. అయితే మృతదేహాలను గుర్తించడం కష్టంగా ఉన్నందున.. డీఎన్ఏ ఆధారంగా మృతదేహాల గుర్తింపు చేపడుతున్నామని అధికారులు చెబుతున్నారు. ఇక ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు మోమో కంపెనీ రూ. 10 లక్షల పరిహారం ప్రకటించింది. అంతేకాకుండా వారి కుటుంబాలకు ప్రతి నెలా ఆర్థిక సహాయం, వారి పిల్లల చదువు బాధ్యతలు భరిస్తామని వెల్లడించింది. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం రూ. 10 లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటించింది.

# ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నిర్మల్ రూరల్,జనవరి 29 (జనం సాక్షి) : మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ సిబ్బంది అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. గురువారం ఆమె కలెక్టరేట్లోని కంట్రోల్ రూమ్ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నామినేషన్ కేంద్రాల్లో జరుగుతున్న ప్రక్రియను వెబ్ కాస్టింగ్ ద్వారా ప్రత్యక్షంగా వీక్షించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల నిర్వహణలో ఎదురయ్యే సమస్యలు,ఫిర్యాదుల పరిష్కారం కోసం కలెక్టరేట్లో ప్రత్యేక హెల్ప్లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.ప్రజలు ఎవరైనా 9100577132 నంబర్కు ఫోన్ చేసి తమ ఫిర్యాదులను తెలియజేయవచ్చని సూచించారు.కంట్రోల్ రూమ్కు వచ్చే ప్రతి ఫోన్ కాల్ను సిబ్బంది స్వీకరించాలని ఫిర్యాదుల వివరాలను రిజిస్టర్లో నమోదు చేసి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఎన్నికల విధుల్లో ఎటువంటి అలసత్వం వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఈడీఎం నదీమ్,కంట్రోల్ రూమ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. రోజుల పాటు ప్రతి రోజు సుమారు రెండు వేల మంది భక్తులకు ఉచితంగా అన్నదానం, మంచినీళ్లు పంపిణీ చేశారు. మేడారం జాతర కి వచ్చిన భక్తులు, అక్కడి ప్రజలు వారిని ప్రశంసించారు.



# మేడారం జాతరలో ఉచిత అన్నదానం

వరంగల్ ఎంజీఎం, జనవరి 29(జనంసాక్షి): మేడారం జాతరలో భాగంగా వరంగల్ కి చెందిన తోట రామచంద్రం, బజ్జూరి చంద్రమౌళి వారి కుటుంబీకులు అందరూ కలిసి తమ వంతు బాధ్యతగా ప్రతి సంవత్సరం మేడారం జాతర జరిగే నాలుగు రోజుల పాటు ప్రతి రోజు సుమారు రెండు వేల మంది భక్తులకు ఉచితంగా అన్నదానం, మంచినీళ్లు పంపిణీ చేశారు. మేడారం జాతర కి వచ్చిన భక్తులు, అక్కడి ప్రజలు వారిని ప్రశంసించారు.

# 80 లక్షల మంది దర్శనం

- సమ్మక్క గద్దె సమయానికి కోటికి మించే అవకాశం...
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి




ములుగు బ్యూరో, జనవరి29(జనం సాక్షి): మేడారం సమ్మక్క-సారక్క మహా జాతరలో భక్తుల తాకిడి గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగిందని రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. మేడారంలో మీడియాతో చిట్ చాట్లో మాట్లాడిన మంత్రి మాట్లాడుతూ గురువారం దాదాపు 80 లక్షల మంది భక్తులు దర్శనం చేసుకున్నారని, సమ్మక్క గద్దెపైకి వచ్చే సమయానికి ఈ సంఖ్య కోటికి మించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు.తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్,మహారాష్ట్ర, ఛత్తీస్గఢ్ తదితర పొరుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు మేడారానికి తరలివస్తున్నారని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తోందని మంత్రి స్పష్టం చేశారు. మేడారం జాతర శాశ్వత అభివృద్ధి కోసం ఇప్పటికే 29ఎకరాల భూమిని సేకరించామని, శ్రీమరో 41 ఎకరాల భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోందని మంత్రి తెలిపారు. మొత్తంగా సుమారు 70 ఎకరాల విస్తీర్ణంలో శాశ్వత మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ ప్రాంతంలో శాశ్వతంగా కాటేజీలు, ఫంక్షన్ హాళ్లు, మరిన్ని మరుగుదొడ్లు, స్నానపు గదులు నిర్మించనున్నట్లు వివరించారు. దక్షిణ భారత కుంభమేళాగా పేరొందిన మేడారం జాతర ప్రాధాన్యతను మరింత పెంచేందుకు బాసర నుంచి భద్రాచలం వరకు రూ.2,500 కోట్ల వ్యయంతో టెంపుల్ సర్క్యూట్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మంత్రి తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని ప్రముఖ ఆలయాల అభివృద్ధిలో మేడారం ఆలయాన్ని కూడా భాగంగా చేర్చనున్నట్లు ఆయన ప్రకటించారు. జంపన్న వాగులో ఏడాది పొడవునా నీరు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ఇందుకోసం రామప్ప-లక్నవరం-జంపన్న వాగు వరకు పైప్లైన్ ద్వారా నీటిని తరలించే ప్రాజెక్టును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారని, వాగుపై చెక్డ్యామ్లు నిర్మించి శాశ్వత నీటి నిల్వకు ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు. మేడారం ప్రాంతానికి ఇప్పటికే ఒక సమగ్ర మాస్టర్ ప్లాన్ సిద్ధమైందని, దాని ప్రకారం అంతర్గత రోడ్ల అభివృద్ధి, ఎకో పార్కుల ఏర్పాటు, పర్యాటక సౌకర్యాల విస్తరణ చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు.

సోషల్ మీడియాలో వస్తున్న దుష్ప్రచారాలను నమ్మవద్దని భక్తులకు మంత్రి విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వం భక్తుల సౌకర్యార్థం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ ఈసారి గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ రెండు రోజుల్లోనే 70 నుంచి 80 లక్షల మంది భక్తులు ఇప్పటికే దర్శనం చేసుకున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పంతో, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పర్యవేక్షణలో అత్యంత తక్కువ సమయంలో ఆలయ అభివృద్ధి పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు.గతంలో ఇరుకైన రోడ్ల కారణంగా ఇబ్బందులు ఉండేవని, ఈసారి ఫోర్-లేన్ రోడ్లతో రాకపోకలు చాలా సులభమయ్యాయని తెలిపారు. భవిష్యత్తులో శాశ్వత తాగునీటి వ్యవస్థతో పాటు భారీ సంఖ్యలో శాశ్వత మరుగుదొడ్ల నిర్మాణం అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విస్తృతంగా చెట్ల పెంపకం చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. జాతర విజయవంతానికి సహకరించిన రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, ఎస్పీ, అధికార యంత్రాంగం మరియు మీడియా మిత్రులకు సీతక్క అభినందనలు తెలిపారు. శనివారం సాయంత్రం 4 గంటలకు తల్లులు గద్దెల నుంచి తిరిగి వనప్రవేశం చేయనున్నారని,అప్పటి వరకు భక్తులు ఓపికతో దర్శనాలు చేసుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

### 2018లోనే నిర్ణయించినప్పటికీ

# కొన్ని బలగాలను రిట్రీట్ చేయలేకపోయాం

**ఆపరేషన్ కగార్ పేరుతో మిమ్మల్ని ఎందుకు నిర్మూలించాల్సిన పరిస్థితి ప్రభుత్వానికి ఏర్పడింది ?**

**జవాబు :** కగార్ అనేది ఒక ఆపరేషన్ కాదు. అది ఆపరేషన్ స్థాయిని మించి దేశప్రజలపై సాగుతున్న భారీ యుద్ధం. 2004 సెప్టెంబర్ లో భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఏర్పడ్డప్పటి నుండి సామ్రాజ్య వాదుల దన్నుతో ఈ దేశ పాలకవర్గాలు-వాటికి ప్రతినిధులైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మా పార్టీని, మా పార్టీ నాయకత్వంలో కొనసాగుతున్న విప్లవోద్యమాన్ని నిర్మూలించడానికి సల్వాజుడుం, ఆపరేషన్ గ్రీన్ హంట్, సమాధాన్ పేర్లతో విప్లవ ప్రతిఘాతక (కౌంటర్ రెవెల్యూషనరీ) దాడి పథకాల్ని రూపొందించి, అమలుచేసాయి. మా పార్టీ నాయకత్వంలో ప్రజలు, ప్రజావిముక్తి గెరిల్లా సైన్యం (పీ.ఎల్.జీ.ఏ.) అన్ని రకాల పోరాట రూపాల్ని ఉపయోగించి చేసిన బహుముఖ ప్రతిఘటనతోపాటు దేశంలోని ప్రజాస్వామిక ఉద్యమాల, జాతుల పోరాటాల ప్రతిఘటనతోసల్వాజుడుం తదితర పేర్లతో సాగిన శ్వేత మిలీషియాల దాడి ఓడిపోయింది, ఆపరేషన్ గ్రీన్ హంట్, సమాధాన్ లు విఫలమయ్యాయి. ఈ స్థితిలో 2022 అక్టోబర్ లో బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు ఆర్ఎస్ఎస్-బీజేపీ కేంద్ర ప్రభుత్వం హరియాణాలోని సూరజ్ కుండ్ లో చింతన్ శిబిర్ ను నిర్వహించింది. అందులో, అది, 2047 నాటికి దేశాన్ని 'అభివృద్ధి చెందిన దేశం (డెవలప్డ్ కంట్రీ)' గా మార్చే పేరుతో 'కార్పొరేట్ హిందూ దేశం'గా మార్చడం కోసం అత్యంత అభివృద్ధి నిరోధక బహుముఖ దీర్ఘకాలిక వ్యూహాత్మక పథకాన్ని రూపొందించింది. అదే సూరజ్ కుండ్ వ్యూహాత్మక దాడి పథకం. తాము నిర్మించ తలపెట్టిన 'కార్పొరేట్ హిందూ రాష్ట్ర/దేశం'కు ప్రధాన అడ్డంకిగా ఉన్న మావోయిస్టు పార్టీని, దాని నాయకత్వంలో సాగే విప్లవోద్యమాన్ని నిర్మూలించడం దాని ప్రధాన లక్ష్యం. విప్లవోద్యమంతో పాటు కశ్మీర్, ఈశాన్య భారత జాతుల పోరాటాలను నిర్మూలించడం, ప్రజాస్వామిక పోరాటాలను అణచివేయడం కూడా ఈ దాడి పథకం. సూరజ్ కుండ్ వ్యూహాత్మక దాడి పథకాన్ని అనుసరించి దేశంలోని అటవీ ప్రాంతాలపై ప్రధానంగా కేంద్రీకరిస్తూ ఈ దాడి సాగినప్పటికీ పట్టణాల్లో, మైదాన ప్రాంతాల్లో కూడా కార్పొరేటీకరణను, దానికి దన్నుగా నిలిచే సైనికీకరణను, ఉద్యమ ప్రాంతాల సైనికీకరణను, హిందుత్వను వ్యతిరేకించే లేదా సామ్రాజ్యవాద, దళారీ పెట్టుబడిదారీ (దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ), భూస్వామ్య వర్గాల దోపిడీ, పీడనలను వ్యతిరేకించే వ్యక్తులపై, శక్తులపై పోలీసుల ద్వారా, నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజన్సీ (ఎన్ఐఏ) ద్వారా ఈ దాడి సాగింది. ఈ దాడిని నవంబర్ 2023లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమీక్షించాయి. అప్పటికీ దాదాపు 2 దశాబ్దాలుగా సాగుతూ ఉన్న విప్లవ ప్రతిఘాతక దాడులతో బలహీనపడిన విప్లవోద్యమాన్ని నిర్మూలించడం కోసం 'కగార్' యుద్ధాన్ని (అంతిమ యుద్ధాన్ని) ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆ నిర్ణయాన్ని అనుసరించి 2024 జనవరి నుండి గత 23 నెలలుగా దేశవ్యాప్తంగా కగార్ యుద్ధం సాగుతోంది. ఇందులో ఇప్పటివరకు 800లకు పైబడిన సంఖ్యలో విప్లవకారులను, ప్రజలను హత్య చేసారు. బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టుల లక్ష్యం 2047 నాటికి కార్పొరేట్ హిందూ దేశాన్ని ఏర్పర్చడం కాబట్టి ఆ లక్ష్యసాధనకు ప్రధాన అడ్డంకిగా వున్న మా పార్టీని, మా పార్టీ నాయకత్వంలోని విప్లవోద్యమాన్ని నిర్మూలించడానికి ఆర్ఎస్ఎస్-బీజేపీల నాయకత్వంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ యుద్ధంలో దూకుడుగా వ్యవహరిస్తున్నాయి.

**ఆపరేషన్ కగార్ ఈ స్థాయిలో ఉంటుందని ఊహించారా? అంతిమ యుద్ధం మార్చి 2025 వరకు మావోయిస్టులను భౌతికంగా నిర్మూలిస్తామని కేంద్ర హోంమంత్రి ప్రకటించినా మీరెందుకు ఆత్మరక్షణ చర్యలు తీసుకోలేదు ?**

జవాబు : కగార్ యుద్ధ లక్ష్యం 'కార్పొరేట్ హిందూ దేశం'కు ప్రధాన అడ్డంకిగా ఉన్న మావోయిస్టు పార్టీని, విప్లవోద్యమాన్ని నిర్మూలించడం కాబట్టి ఈ యుద్ధం చాలా తీవ్రంగా ఉంటుందని మా కేంద్రకమిటీ అంచనావేసింది. కగార్ యుద్ధంలో కేంద్రకమిటీ సభ్యులను, రాష్ట్రకమిటీల, జిల్లాకమిటీల, ఏరియా కమిటీల సభ్యులను నిర్మూలించే దాడులు పెరుగుతాయని, స్థానిక నిర్మాణాల నాయకత్వంలో కొంతమందిని నిర్మూలిస్తారని, కొంతమందిని అరెస్టు చేసి, దీర్ఘకాలం జైళ్లల్లో పెడతారని, కొంతమందిని లొంగదీసుకుంటారని మా కేంద్రకమిటీ అంచనా వేసింది. కగార్ యుద్ధాన్ని ఎదుర్కోవడానికి ఫిబ్రవరి 2024లో ఒక సర్క్యులర్ ను జారీ చేసింది. అందులో పార్టీ, పీ.ఎల్.జీ.ఏ. నాయకత్వ శక్తుల రక్షణకు, బలగాల రక్షణకు ప్రాధాన్యతనీయాలని, అందుకోసం బలగాలు చిన్న, పరిమిత ప్రాంతాల్లో చిక్కుకుపోవద్దనీ, విశాల ప్రాంతాలకు విస్తరించి పనిచేయాలని, కార్పెట్ సెక్యూరిటీ ప్రాంతాల్లో (సెక్యూరిటీ గ్రిడ్ ప్రాంతాలు), దానికి బయట దేశవ్యాప్తంగా దేశ, విదేశీ కార్పొరేట్లకు వ్యతిరేకంగా (సామ్రాజ్యవాదానికీ, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానానికీ), భూస్వామ్యానికి వ్యతిరేకంగా వర్గపోరాటాన్ని తీవ్రతరం చేయాలని ఉద్యమ ప్రాంతాల్లో శక్తిమేరకు గెరిల్లాయుద్ధాన్ని విస్తృతం-తీవ్రతరం చేయాలని నిర్ణయించింది. నాయకత్వ రక్షణకు, బలగాల రక్షణకు హామీగా ఉండేది ప్రజాపునాది అనీ, వర్గపోరాట-గెరిల్లాయుద్ధ విస్తృతి-తీవ్రత ద్వారానే ప్రజాపునాది విస్తరించి బలపడుతుందని అందు కోసం దేశవ్యాప్తంగా వర్గపోరాటాన్ని తీవ్రతరం చేస్తూ, పీ.ఎల్.జీ.ఏ. ఉన్నచోట శక్తిమేరకు గెరిల్లాయుద్ధాన్ని కొనసాగించాలని చెప్పింది. కగార్ యుద్ధం దేశవ్యాప్తంగా సాగినా దాని ప్రధాన కేంద్రీకరణ దండకారణ్యం కాబట్టి అక్కడినుండి కొన్ని బలగాలను ఇతర రాష్ట్రాలకు పంపాలని చెప్పింది. పొలిట్ బ్యూరో దేశవ్యాప్త విప్లవోద్యమ స్థితిని సరిగానే అంచనా వేసి, సరైన రాజకీయ, సైనిక ఎత్తుగడల్ని రూపొందించినప్పటికీ వాటిని సరిగా అమలుచేయని ఫలితంగా ఈ భారీ నష్టాలు జరుగుతున్నాయి. నిజానికి 2018లోనే కేంద్రకమిటీ రానున్న రోజుల్లో తీవ్రతరం కానున్న శత్రుదాడిని అంచనా వేసి దండకారణ్యం నుండి కొన్ని బలగాలను ఇతర రాష్ట్రాలకు రిట్రీట్ చేయాలని చెప్పింది. ఆ తీర్మానపు లోతుపాతులు కింది కమిటీలకు అందక, దాన్ని అమలు చేయని ఫలితంగా 2024 నుండి దండకారణ్యంలో తీవ్రమైన నష్టాలు జరుగుతున్నాయి. కాబట్టి ఈ నష్టాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్న కగార్ యుద్ధం ముఖ్యమైన కారణమే అయినప్పటికీ మా పొరపాట్లు కూడా కారణమే.

**కర్రెగుట్టలలో జర్గిన యుద్ధం గురుంచి కండ్లకు కట్టినట్టు వివరించండి ?**

జవాబు : ఈ సంవత్సరం మార్చి నెలలో మా పై కమిటీ కామ్రేడ్స్ కొందరు, మా పార్టీ, పీఎల్జీఏ బలగాలు పెద్దసంఖ్యలో కర్రెగుట్టల్లో మకాం వేసాయని కేంద్రప్రభుత్వ, ఛత్తీస్ గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఇంటలిజెన్స్ ఏజన్సీలకు సమాచారం అందింది. ఈ సమాచారం ఆధారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాదాపు నెలరోజుల పాటు అన్నిరకాల సన్నాహాలు చేసుకుని ఏప్రిల్ నెలలో 10 రోజుల పాటు బీజాపూర్ లో మాపై దాడి చేసే రిహార్సల్స్/డ్రిల్స్ చేసి ఏప్రిల్ 20 నాడు మా బలగాలపై భారీ ఆపరేషన్ ను ప్రారంభించాయి. ఈ ఆపరేషన్ కోసం కేంద్ర పారామిలిటరీ బలగాలను, ఛత్తీస్ గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్ర, ఒడిశా, ఝార్ఖండ్ రాష్ట్రాల నుండి 50 వేలకు పైబడిన పోలీసు, కమాండో బలగాలను మోహరించారు. మా బలగాల కదలికల్ని కనుక్కోవడానికి ప్రతిరోజు ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు చిన్న, పెద్ద డ్రోన్లతో సర్వేలన్స్ (నిఘా)ను కొనసాగించి, ఫోటోలు, వీడియోలు తీసారు. సాటిలైట్లను ఉపయోగించి మా బలగాల ఉనికిని ప్రతిరోజూ కనిపెట్టేవారు. ఏప్రిల్ 22 నుండి మే 10 వరకు ప్రతిరోజూ ఉదయం నుండి సాయంత్రం వరకు 4 సార్లు రెండేసి-మూడేసి హెలికాప్టర్లతో లక్షలాది తూటాలతో మొత్తం కర్రెగుట్ట ప్రాంతంపై ఫైరింగ్ చేసారు. కర్రెగుట్టకు నాలుగువైపులా ఉన్న పోలీసు క్యాంపుల నుండి 81 ఎంఎం మోర్టార్లతో ప్రతిరోజూ వందలాది-వేలాది షెల్స్ వేసి షెల్లింగ్ చేసారు. పోలీసు క్యాంపుల నుండి చేసే షెల్లింగ్ కు అందని ప్రాంతాలపై షెల్లింగ్ చేయడం కోసం తేలికపాటి యుద్ధ ట్యాంకులపై 81 ఎంఎం మోర్టార్లను మౌంటింగ్ (అమర్చి) చేసి షెల్లింగ్ చేసారు. ఈ మొత్తం ఆపరేషన్స్ ను కమాండింగ్ చేయడానికి-సమన్వయించడానికి వెంకటాపూర్ లో ఫీల్డ్ కమాండింగ్ సెంటర్ ను, జిల్లా స్థాయిలో బీజాపూర్ లో, డివిజనల్ స్థాయిలో జగదల్ పుర్ లో కమాండ్-కంట్రోల్ కేంద్రాలను ఏర్పాటు చేసారు. ఢిల్లీలో కేంద్ర హోంశాఖ కార్యాలయంలో కేంద్ర కమాండ్-కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేసారు. ఈ ఆపరేషన్ లో అమెరికా, ఇజ్రాయిల్ సైనిక అధికారులు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

ఈ ఆపరేషన్ ద్వారా మా కేంద్ర, రాష్ట్రకమిటీ సభ్యులను, మా బలగాలను పెద్దఎత్తున నిర్మూలించే లక్ష్యాన్ని కేంద్రప్రభుత్వం తన సాయుధ బలగాను నిర్దేశించింది. అయితే ఆత్మరక్షణలో భాగంగా మేము పెద్దఎత్తున అమర్చిన బూబీట్రాపులు/ఐఈడీలు పేలి శత్రు పక్షానికి తీవ్రమైన నష్టాలు జరిగాయి. ఇందులో 35-40 మంది పారామిలిటరీ, కమాండో బలగాలు నిర్మూలించబడి, 100 మందికి పైబడి గాయపడ్డారు. ఈ నష్టాలతో భీతిల్లిన ప్రభుత్వ సాయుధ బలగాలు ఈ ఆపరేషన్ ను మధ్యలో నిలిపివేసాయి. అయితే మా బలగాల నుండి మూకాల్ అనే వాడు పారిపోయి శత్రువుకు సరెండరయి, మా బలగాలకు చెందిన పేషంట్లు ఉన్న దేరాను చూయించడంతో అక్కడ శత్రు సాయుధ బలగాలు మా 22 మంది కామ్రేడ్స్ ను హత్య చేసాయి. ఇతర చోట్ల జరిగిన దాడుల్లో మావైపు 9 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. ఈ రకంగా మా వైపు 31 మంది కామ్రేడ్స్ అమరులయినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించుకున్నట్టుగా నాయకత్వ కామ్రేడ్స్ ను గానీ, పెద్ద సంఖ్యలో మా బలగాల్ని గానీ నష్టపర్చలేకపోయాయి. ఈ ఆపరేషన్ తన లక్ష్యసాధనలో విఫలమైంది. ఈ ఆపరేషన్ లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సాయుధ బలగాల మొరేల్ చాలా బలహీనంగా ఉండింది. ఇప్పటికీ తమ పక్షానికి జరిగిన నష్టాల్ని అవి బహిరంగంగా ప్రకటించడం లేదు. మా నుండి పారిపోయిన వ్యక్తి అందించిన సమాచారంతో మా కామ్రేడ్స్ ను హత్య చేసి దాన్ని గొప్ప విజయంగా చెప్పుకుంటున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో కర్రెగుట్ట ఆపరేషన్ ను ఆపివేయాలని, కగార్ యుద్ధాన్ని ఆపివేయాలని, మావోయిస్టులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతిచర్చలు చేయాలని ఉద్యమించిన ప్రజలకు, సంఘాలకు, సంస్థలకు, పార్టీలకు మా పార్టీ తరపున విప్లవాభినందనలు తెలియజేస్తున్నాను. ఇలాంటి ఉద్యమాన్ని విస్తృతం-తీవ్రతరం చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచడం ద్వారానే కగార్ యుద్ధాన్ని అడ్డుకోగలుగుతాం.

**కేంద్రకమిటీ సభ్యులు అగ్రనేత మల్లోజుల, ఆశన్నలు ద్రోహులుగా మారారు అంటే అది మీ నిర్మాణ లోపంగా భావించవచ్చా?**

జవాబు : వేణుగోపాల్, ఆశన్న (సతీష్)లే కాదు, వారి తర్వాత కూడా మరికొంతమంది రాష్ట్రకమిటీ సభ్యులు, కేంద్రకమిటీ సభ్యులు దోపిడీ ప్రభుత్వాల ముందు లొంగిపోయారు. గత 25-30 సంత్సరాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మా పార్టీపై, విప్లవోద్యమంపై కొనసాగిస్తున్న దాడుల ఫలితంగా మా పార్టీ, విప్లవోద్యమం నష్టపోతూ వస్తోంది. కగార్ యుద్ధంతో శత్రుదాడిలో మౌలిక మార్పు వచ్చింది. శత్రువు హ్యూమన్ ఇంటలిజెన్స్, టెక్నికల్ ఇంటలిజెన్స్ పై ఆధారపడి వేలాది సాయుధ బలగాలతో చుట్టుముట్టి-మట్టుబెట్టే దాడులు చేస్తూ కగార్ యుద్ధం సాగుతోంది. దీంతో 2024 ప్రారంభం నుండి మా పార్టీ, పీ.ఎల్.జీ.ఏ., స్థానిక ప్రజా నిర్మాణాల కామ్రేడ్స్ చాలామంది అమరులయ్యారు. 'సమాధాన్' దాడి కొనసాగుతున్న 2018లోనే మా కేంద్రకమిటీ నిర్ణయించినట్టుగా దండకారణ్యం నుండి పార్టీ, పీ.ఎల్.జీ.ఏ. బలగాలను ఇతర రాష్ట్రాలకు రిట్రీట్ చేయకపోవడంతో, 2024 ఫిబ్రవరి, ఆగస్టు నెలల్లో కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో రూపొందించిన రాజకీయ, సైనిక ఎత్తుగడలను సరిగా ఆచరించకపోవడంతో మేము భారీగా నష్టపోతూ వచ్చాం. ఈ స్థితిలో పార్టీలో, పీ.ఎల్.జీ.ఏ.లో కింది నుండి పై వరకు అన్నిస్థాయిల్లో ఒక సెక్షన్ లో విప్లవోద్యమ పురోగమనం పట్ల అవిశ్వాసం తలెత్తింది, కొంతమందిలో ప్రాణభీతి తలెత్తింది. వీరిలో కొందరు పార్టీకి చెప్పి సరెండరవుతున్నారు, కొందరు పార్టీకి చెప్పకుండా పారిపోయి సరెండరవుతున్నారు, కొందరు ఆయుధాలతో సరెండరవుతున్నారు, కొందరు ఆయుధాల్ని పార్టీకి అప్పగించి సరెండరవుతున్నారు. ఎవరు ఎలా సరెండరయినా అది వారి రాజకీయ బలహీనతే. పార్టీ ఎవరికి సరెండర్ కావాలని చెప్పదు. ప్రాణభీతి ఉన్నవారిని, అనారోగ్య పీడితులను, వృద్ధులను కాపాడడానికి వేర్వేరు పద్ధతులను పార్టీ సూచిస్తుంది. అయితే ఆయుధాలతో సరెండర్ కావడం అంటే ఆయుధాలు పట్టుకుని పోరాడుతున్న మమ్మల్ని హత్యచేయడానికి శత్రువుకు సహకరించడమని అర్థం. శత్రువుకు సరెండరయి శత్రు సాయుధ బలగాల్లో చేరి మా మీద దాడులకు రావడమంటే మమ్మల్ని హత్య చేయడానికి శత్రువుతో కలిసిపోవడమని అర్థం. శత్రువుకు సరెండరయి పార్టీ, పీ.ఎల్.జీ.ఏ., విప్లవోద్యమ బలాబలాల గురించి శత్రువుకు చెప్పడమంటే అది విప్లవ ద్రోహమే. అప్పటివరకు దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా సాయుధంగా పోరాడాలని ప్రజలకు చెప్పిన తామే శత్రువుకు సరెండర్ కావడమంటే ప్రజలకు ద్రోహం తలపెట్టడమే. శత్రువుకు ఆయుధాలు అప్పగించి సరెండరయిన వారిని, శత్రు సాయుధ బలగాల్లో చేరిన వారిని, సరెండరయి శత్రువు వద్ద ఉంటూ పార్టీని చీలదీసి, విప్లవోద్యమాన్ని బలహీనపర్చడానికి ప్రయత్నాలు చేసే వారిని కఠినంగా శిక్షించాలని మా పార్టీ ప్రజలకు పిలుపునిస్తుంది, ఇపుడు కూడా అలాంటి పిలుపునిస్తున్నాం. రాజకీయంగా బలహీనపడి, త్యాగసంసిద్ధత కోల్పోయి శత్రువుకు సరెండరయినప్పటికీ శత్రువుకు ఆయుధాలు అప్పగించకుండా, శత్రు బలగాల్లో చేరకుండా, పార్టీని, విప్లవోద్యమాన్ని బలహీనపరచడానికి శత్రువుతో కలిసి ప్రయత్నాలు చేయకుండా ఉండే వారిని శిక్షించాలని పార్టీ ప్రజలకు పిలుపు ఇవ్వదు. సాధారణ జీవితం గడుపుతూ ప్రజల పక్షాన నిలబడాలని అలాంటి వారికి పార్టీ సూచిస్తుంది.



**మల్లోజుల, ఆశన్నలు** విప్లవోద్యమ పురోగమనం పట్ల విశ్వాసం కోల్పోయి, ప్రాణభీతికి లోనయి శత్రువుకు సరెండరయ్యారు. అయితే, వాళ్లు సరెండర్ కోసం చెపుతున్న కారణాలు మోసపూరితమయినవి. మా పార్టీ ప్రధాన కార్యదర్శి బతికి ఉన్నపుడు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో శాంతిచర్చ లపై విడుదల చేసిన పత్రికా ప్రకటనలో "ఆయుధాలు వదిలిపెట్టి జనజీవన స్రవంతిలో కలిసే విషయాన్ని మా పార్టీలో ఎవరో ఒకరు నిర్ణయించలేరు. అందుకోసం మేము మా కోర్ మీటింగులో చర్చించుకుంటాం, అందుకోసం నెలరోజుల గడువు కావాలని" పేర్కొన్నాడు. ఆ పత్రికా ప్రకటనను విడుదల చేసిన తర్వాత కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కగార్ యుద్ధాన్ని ఆపకపోవడంతో ఆ ప్రకటనను వెనక్కు తీసుకుని శత్రు సాయుధ బలగాలను ప్రతిఘటించాలని పార్టీకి, పీ.ఎల్.జీ.ఏ.కు ఆయన పిలుపునిచ్చాడు. దీన్ని, మల్లోజుల, ఆశన్నలు వక్రీకరించి మా పార్టీ ప్రధాన కార్యదర్శే ఆయుధాలు వదిలిపెడతామని ప్రకటించాడని అందులో భాగంగానే ఆయుధాలు వదిలి పెడుదామని దండకారణ్యంలోని ఉత్తర్-పశ్చిమ్ సబ్ జోన్ లోని పార్టీ,పీ.ఎల్.జీ.ఏ. బలగాలను మోసగించారు. ఇప్పటికీ అలాగే అబద్ధలాడుతున్నారు. ఇపుడు శత్రు శిబిరంలో ఉంటూ దేశవ్యాప్తంగా పార్టీని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ రకంగా వాళ్లు ఆయుధాలతో సహ లొంగిపోయి విప్లవ ద్రోహులుగా, పార్టీ విచ్ఛిన్నకులుగా, విప్లవ ప్రతిఘాతకులుగా మారారు. అందుకే వారిని పార్టీ నుండి బహిష్కరించాం. సోను, సతీష్ లు దీర్ఘకాల పరిణామ క్రమంలోనే ఈ రకంగా మారిపోయారు. "సోను, సతీష్ ల్లో దశాబ్దకాలం నుండి కొనసాగుతున్న మితవాద భావాలు క్రమంగా మితవాదంగా మారి, కగార్ యుద్ధంతో మితవాద అవకాశవాదంగా మారి ఇపుడు అది విప్లవ ద్రోహంగా, విప్లవ ప్రతిఘాతక స్థాయికి చేరింది. ఈ పరిణామాల్ని సకాలంలో సరిగా అంచనా వేయడంలో మేము విఫలమయ్యాం. ఈ వైఫల్యత ఫలితంగా వీళ్లిద్దరు తమ నాయకత్వ స్థానాలను ఉపయోగించుకుని విప్లవోద్యమానికి తీవ్రమైన నష్టం కలిగించారు" అని మేము అక్టోబర్ 16 నాడు విడుదల చేసిన పత్రికా ప్రకటనలో మా వైఫల్యాన్ని అంగీకరించాం.

సోను, సతీష్ లు తమలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న మితవాదాన్ని అధిగమించని స్థితిలో, వీరి బలహీనతలను అంచనా వేసిన రాజ్యం (స్టేట్) వీరిపై ఆధారపడి పార్టీని లోపలి నుండి దెబ్బతీయాలని కుట్ర పన్నింది. అందులో భాగంగా కేంద్ర ప్రభుత్వ, మహారాష్ట్ర, ఛత్తీస్ గఢ్ రాష్ట్ర ఇంటలిజెన్స్ ఏజన్సీలు వారిని చేరదీసి పార్టీని విచ్ఛిన్నం చేసాయి. పార్టీని సాయుధంగా ఎదుర్కొని సాధించలేనంతటి నష్టాన్ని వీరిద్దరి ద్వారా పార్టీని లోపలి నుండి దెబ్బతీయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఫలమయ్యాయి. అందుకే వాళ్లను పార్టీ విచ్ఛిన్నకులని, కోవర్టులని, విప్లవ ప్రతిఘాతకులని ప్రకటించాం. కోవర్టులు అంటే కేవలం పార్టీ నాయకత్వాన్ని భౌతికంగా నిర్మూలించడానికి సహకరించే వాళ్లే కాదు. శత్రువుతో చేతులు కలిపి పార్టీని లోపలి నుండి దెబ్బతీసే వాళ్లు కూడా కోవర్టులే. ఈ కోవర్టులు, విప్లవ ప్రతిఘాతకులు ఉద్యమ బలాబలాలను, పార్టీ పనిపద్ధతులను, పార్టీ తీర్మానాలను శత్రువుకు చెప్పిన ఫలితంగా కామ్రేడ్స్ కోస, రాజులను హత్యచేయడానికి శత్రువుకు ఉపయోగపడింది.

**తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ, ఆంధ్రప్రదేశ్ కమిటీ, నల్లమల నుంచి ఖాళీ చేసి సేఫ్ జోన్‌గా భావించి దండకారణ్యం వెళ్లారు. అది కూడా సేఫ్ కాదని, మరో కొత్త ప్రాంతాన్ని ఎందుకు ఎంచుకోలేకపోయారు?**

జవాబు: తెలంగాణ నుండి కొంతమంది కార్యకర్తలను దండకారణ్యంలోకి పంపించడం జరిగింది. మరికొంత మంది కార్యకర్తలు తెలంగాణలో ఉంటూ రక్షణ కోసం డీకే భూభాగాన్ని ఉపయోగించుకొని పని చేశారు. ఆంధ్రప్రదేశ్ నుండి కొంతమంది రిట్రీట్ అయి ఏఓబీకి వెళ్ళారు. ఏఓబీ నుండే ఆంధ్ర ఉద్యమాన్ని నడిపించారు. దేశవ్యాప్తంగా ఛత్తీస్ గఢ్, ఒరిస్సా, ఝార్ఖండ్, బిహార్, బెంగాల్, మధ్యప్రదేశ్-మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం, తమిళనాడు-కేరళ-కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో విప్లవోద్యమం విస్తరించింది. 2004 నుండి 2012 వరకు అనేక విజయాలను సాధించింది. నందిగ్రామ్, లాల్ గఢ్, కలింగనగర్, నియంగిరి, నారాయణపట్న, ఒరిస్సా మరియు ఏఓబీ లో బాక్సైట్ వ్యతిరేక ప్రజాందోళన, కాఫీ ప్లాంటేషన్ల ఆక్రమణ వంటి ప్రజా పోరాటాలకు పార్టీ నాయకత్వం వహించింది. అనేక రాష్ట్రాల్లో మిత్రశక్తులతో కలిసి ఐక్యసంఘటన కృషి చేసాం. నేటిస్థితిలో డీకే సురక్షితం కానపుడు మరొక జోన్ ను ఎంచుకోవడం అనేది ప్రధానం కాదు. మారుతున్న సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితులకు అనుగుణంగా తగిన ఎత్తుగడలను, పోరాట నిర్మాణ రూపాలను రూపొందించుకొని అమలు జరపాలి. ఈ క్రమంలోనే ఉద్యమం తిరిగి పురోగమిస్తుంది.

**ఒక్కో ప్రాంతాన్ని మరీ ముఖ్యంగా మైదాన ప్రాంతాల్ని వదిలివేస్తూ, దట్టమైన అటవీ ప్రాంతాన్ని వెతుక్కుంటూ వెళ్తున్న మీరు, నాగరికత విస్తరించిన చోట నిలబడలేకపోవటానికి కారణం ఏమంటారు ?**

జవాబు: పట్టణ, మైదాన ప్రాంతాన్ని వదిలివేస్తూ దట్టమైన అటవీ ప్రాంతాల్ని వెతుక్కుంటూ వెళ్లడం మా పద్ధతి కాదు. దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాలో అటవీ ప్రాంతాల్లో ప్రజాసైన్యాన్ని నిర్మించి, ప్రజాయుద్ధం చేసి స్థావర ప్రాంతాలను ఏర్పాటు చేస్తాం. బలమైన పట్టణోద్యమం, మైదాన ప్రాంత ఉద్యమం లేకుంటే ఆ స్థావర ప్రాంతాలు నిలబడవు. ఈ విషయాన్ని మా 'వ్యూహం-ఎత్తుగడలు' డాక్యుమెంట్ స్పష్టంగా చెపుతుంది. 2007 ఐక్యతా కాంగ్రెస్ లో రూపొందించుకున్న కేంద్ర కర్తవ్య సాధన కోసం మేము అటవీ ప్రాంతాలపై కేంద్రీకరించిన మాట వాస్తవమే. అయితే అదే కాంగ్రెస్ 'పట్టణ పనివిధానం' డాక్యుమెంట్ ను కూడా రూపొందించింది. ఈ డాక్యుమెంట్ ఆధారంగా బలమైన పట్టణోద్యమాన్ని నిర్మించే కృషి చేసే క్రమంలోనే దేశవ్యాప్త పట్టణోద్యమ ఇంచార్జ్ కామ్రేడ్ ఆజాద్ సహ ఎందరో మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. ఉత్తర తెలంగాణలో, ఆంధ్రప్రదేశ్ లో దేశంలోని ఇతర రాష్ట్రాల్లో 2012 వరకు ఎంతో మంది కామ్రేడ్స్ పట్టణ, మైదాన ఉద్యమాల అభివృద్ధికి కృషి చేస్తూ ప్రభుత్వ దాడిలో అమరులయ్యారు, అరెస్టయ్యారు, జైళ్ల పాలయ్యారు. దేశంలో సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల అమలును వెన్నంటి వాటిని వ్యతిరేకించే ప్రజలు సంఘటిత శక్తిగా మారకుండా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి దేశవ్యాప్తంగా బలమైన, విస్తారమైన ఇంటలిజెన్స్ నెట్ వర్క్ ను నిర్మించాయి, దాన్ని నిరంతరం విస్తృతం చేస్తూనే వున్నాయి. ఆధునిక టెక్నాలజీ ఆధారంగా ప్రజలందరి కదలికలపై, నిరంతరం నిఘాను (సర్వేలన్స్)ను కొనసాగిస్తున్నాయి. ఇది విప్లవోద్యమం ఎదుర్కొంటున్న ఒక వ్యూహాత్మక సమస్య. మా రాజకీయ, సైనిక పంథా, పట్టణ పనివిధానం డాక్యుమెంట్ల ఆధారంగా ఈ వ్యూహాత్మక సమస్యను అధిగమించడానికి కృషి చేయాల్సి వుంది. దైనందిన సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్న పట్టణ, మైదాన ప్రాంతాల ప్రజలను విప్లవోద్యమంలో సమీకరించడానికి మా పార్టీ కృషి చేస్తుంది.

**గ్రామాలు తగ్గిపోయి, దేశంలో భూస్వామ్య వ్యవస్థ అంతరించిపోతున్న వేళ, పట్టణీకరణ పెరిగి సమాజం పెట్టుబడిదారీ వ్యవస్థ వైపు వెళుతున్నట్టు మీకు కనపడటం లేదా? ఇంకా అర్ధవలస, అర్ధ భూస్వామ్య వ్యవస్థనే కొనసాగుతుందని మీరు భావిస్తున్నారా ?**

జవాబు : అధికార మార్పిడి జరిగిన 1947 నుండి గడిచిన 77 ఏళ్ల కాలంలో హరిత విప్లవం ప్రభావంతో, 1991 నుండి అమలవుతున్న సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ప్రభావంతో, గత 77 ఏళ్లుగా మరీ ముఖ్యంగా నక్సల్బరీ కాలం నుండి దేశంలో సామ్రాజ్యవాదానికి, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానానికి, భూస్వామ్యానికి వ్యతిరేకంగా కొనసాగుతున్న వర్గపోరాటం ఫలితంగా దేశంలో భూస్వామ్యం/అర్ధభూస్వామ్యం బలహీనపడిందని, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానం వృద్ధి చెందిందని మా పార్టీ అంచనా వేసింది.(దేశ/జాతీయ ప్రయోజనాల కోసం కాకుండా సామ్రాజ్యవాద ప్రయోజనాలకు సేవచేసేది, సామ్రాజ్యవాదం నుండి స్వతంత్రంగా ఉండకుండా దానికి దళారీగా ఉండేది, రాజ్యాధికారాన్ని కలిగినది దళారీ నిరంకుశ బూర్జువా వర్గం/పెట్టుబడిదారీ వర్గం. ఇక్కడ నిరంకుశ అంటే (బ్యూరాక్రటిక్) రాజ్యాధికారం కలిగినది అని అర్థం. ఈ స్వభావాన్ని వ్యక్తీకరించడానికి విప్లవ సాహిత్యంలో కాంప్రడార్ బ్యూరాక్రటిక్ బూర్జువాజీ అని అంటారు. దాన్నే తెలుగులో దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గం లేదా దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానం అంటారు. సామాన్య పాఠకులకు అర్థం కావడం కోసం దళారీ పెట్టుబడిదారీ వర్గం అనీ లేదా బడా కార్పొరేట్లు అని వాడుతాం.) సామ్రాజ్యవాదం ఈ కాలమంతా తన అవసరాలకు అనుగుణంగా అర్ధభూస్వామ్యాన్ని కొన్ని మార్పులకు గురిచేయడం ద్వారా దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానాన్ని వృద్ధి చేసిందని మా పార్టీ అంచనా వేసింది. దాన్ని వెన్నంటి దేశంలో గ్రామీణ జనాభా తగ్గుతూ నగరీకరణ పెరుగుతూ-నగర జనాభా పెరుగుతోంది. ఈ రకంగా గత 77 ఏళ్లల్లో మనదేశ సామాజిక వ్యవస్థలో గణనీయమైన మార్పులు వచ్చినప్పటికీ దేశంలో భూమి సమస్య పరిష్కరించబడలేదు. అంటే భూస్వాముల వద్దనున్న భూమి వ్యవసాయ కూలీలకు, పేద రైతులకు దక్కలేదు. దేశంలో ప్రజాస్వామ్యం స్థాపించబడలేదు అంటే భూస్వాముల అధికారం ధ్వంసం కాలేదు. దేశంలో జాతీయ విముక్తి జరగలేదు అంటే దేశం సామ్రాజ్యవాదం నుండి స్వతంత్రం కాలేదు. అందుకే మన దేశం ఇప్పటికీ అర్ధవలస-అర్ధభూస్వామ్య దేశమే. మన విప్లవ దశ నూతన ప్రజాస్వామిక విప్లవ దశే అని మా కేంద్రకమిటీ స్పష్టం చేసింది. అయితే సామాజిక పరిస్థితుల మార్పుల్లో భాగంగా జనాభా వర్గీకరణలో-వర్గాల పొందికలో మార్పులు వస్తున్నాయి. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకుని మారిన సామాజిక పరిస్థితికి తగ్గ వర్గపోరాట కార్యక్రమాన్ని-ఎత్తుగడలను మా కేంద్రకమిటీ రూపొందించింది. అందులో భాగంగా దేశాన్ని 7 కేటగిరిలుగా విభజించింది. వీటన్నింటిని 'భారతదేశంలో ఉత్పత్తి సంబంధాల్లో మార్పులు-మన రాజకీయ కార్యక్రమం' డాక్యుమెంట్ లో మా కేంద్రకమిటీ వివరంగా పేర్కొంది. ఈ రాజకీయ కార్యక్రమాన్ని ఆచరణలోకి తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తున్నాం.

**మీ పార్టీ చీఫ్ నంబల కేశవరావును కాపాడుకోలేకపోయారు, ఆయన మరణం తరువాత ఏమైనా సమీక్షించుకున్నారా? ఆ ఎన్కౌంటర్ ఎలా జరిగింది ?**

**జవాబు :** విప్లవ ప్రతిఘాతక 'కగార్' యుద్ధపు ప్రారంభం నుండి జరుగుతున్న నష్టాల కొనసాగింపులో భాగమే మా పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బసవరాజు (నంబాళ్ళ కేశవరావు)ను కోల్పోవడం. కగార్ యుద్ధం ప్రారంభమయినపుడే కేంద్రకమిటీ సభ్యులను, రాష్ట్రకమిటీ సభ్యులను నిర్మూలించే పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించాయి. అందులో భాగంగానే జనవరి 19 నాడు ఒడిశా-ఛత్తీస్ గఢ్ రాష్ట్రాల సరిహద్దుల్లోని సోనబేడ గుట్టల్లో భారీ చుట్టివేత దాడిని (ఎన్ సర్కిల్ మెంట్ దాడి) చేసి మా కేంద్రకమిటీ సభ్యుడు కామ్రేడ్ చలపతిని, ఏప్రిల్ 21 నాడు ఝార్ఖండ్ రాష్ట్రంలోని బొకారో జిల్లాలో జరిగిన చుట్టివేత దాడిలో కేంద్రకమిటీ సభ్యుడు వివేక్ ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హత్యచేసాయి. ఈ దాడుల కొనసాగింపులో భాగంగానే కామ్రేడ్ బసవరాజు (బీఆర్) ను హత్యచేసాయి.

దేశవ్యాప్త విప్లవోద్యమానికి మార్గదర్శకత్వాన్ని (గైడెన్స్) అందించడం కోసం, కేంద్రకమిటీని సమన్వయించడం కోసం కామ్రేడ్ బీఆర్ దండకారణ్యంలోని మాడ్ ప్రాంతంలో ఉంటున్నాడని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఓ మేరకు సమాచారం ఉంది. ఆయన రక్షణ కోసం 7వ కంపెనీ ఉందని కూడా శత్రువుకు తెలుసు. అయితే 2025 జనవరి నుండి మే మధ్యకాలంలో మాడ్ డివిజన్ లోని పార్టీ, పీ.ఎల్.జీ.ఏ. యూనిట్ల నుండి రాజకీయంగా బలహీనపడి కొంతమంది శత్రువుకు సరెండరయ్యారు. వారిద్వారా శత్రువుకు మరికొంత సమాచారం అందింది. ఆ సమాచారం ఆధారంగా జనవరి, మార్చి నెలలో కేంద్ర ప్రభుత్వ, ఛత్తీస్ గఢ్ రాష్ట్ర ప్రభుత్వ సాయుధ బలగాలు కామ్రేడ్ బీఆర్ ను టార్గెట్ చేసి భారీ క్యాంపెయిన్లు చేసాయి. ఈ దాడులతో భయాందోళనలకు గురయిన 7వ కంపెనీలోని కంపెనీ పార్టీకమిటీ సభ్యుడు, కొంతమంది ప్లాటూన్ పార్టీ కమిటీ సభ్యులు పారిపోయి శత్రువుకు సరెండర్ అయ్యారు. ఈ సరెండర్లతో కామ్రేడ్ బీఆర్ మకాంల గురించి శత్రువుకు పూర్తిగా స్పష్టమయింది. ఈ ద్రోహులు 7వ కంపెనీ మకాంలను రెక్కీ చేసి శత్రు సాయుధ బలగాలతో కలిసి దాడుల్లో పాల్గొన్నారు. చివరికి మే 17 నుండి 22 వరకు నారాయణ్ పూర్, కొండగావ్, దంతెవాడ, బీజాపూర్ జిల్లాల నుండి వేలాది ప్రభుత్వ సాయుధ బలగాలను మోహరించి చేసిన భారీ చుట్టివేత దాడిలో మే 21 నాడు కామ్రేడ్ బీఆర్ అమరుడయ్యాడు. ఆయనను కాపాడడానికి 7వ కంపెనీ కమాండర్ సహ సభ్యులందరూ ప్రాణాలకు తెగించి, అత్యంత ధైర్యసాహసాలతో శత్రువును ప్రతిఘటించారు. ఆ ప్రతిఘటనలో శత్రు సాయుధ బలగాలకు చెందిన కొందరుకూడా చనిపోయా రు, కొంతమంది గాయపడ్డారు. ప్రధాన కార్యదర్శి బసవరాజును కాపాడుకోవడానికి ఒక పథకాన్ని రూపొందించినప్పటికీ అనేక కారణాల రీత్యా దాన్ని అమలు చేయలేకపోయాం. గత 3 దశాబ్దాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విప్లవోద్య మ నిర్మూలన కోసం చేస్తున్న దాడుల ఫలితంగా ప్రజాపునాది తగ్గడంతో కామ్రేడ్ బీఆర్‌ను కాపాడుకోలేకపోయాం. అందుకే, కగార్ యుద్ధపు ప్రారంభంతో శత్రుదాడిలో వచ్చిన మౌలిక మార్పును గమనంలో ఉంచుకుని మా పార్టీ ప్రధాన కార్యదర్శి రక్షణ గురించిన బహుముఖ ఎత్తుగడలతో కూడిన సమగ్రమైన పథకాన్ని మా పార్టీ పొలిట్ బ్యూరో (పీబీ), కేంద్రకమిటీ రూపొందించలేకపోవడంతో ప్రధాన కార్యదర్శిని కాపాడుకోలేకపోయామని కేంద్రకమిటీ సమీక్షించింది.

**తెలంగాణ రాష్ట్రం ఏర్పాడ్డాక, తిరిగి మీరు తెలంగాణాకు వచ్చి పనిచేస్తారని తెలంగాణ ప్రజలు భావించారు. పుష్కర కాలంలో శవయాత్రలు తప్ప మీరు తిరిగొచ్చి పనిచేసింది లేదు. తిరిగి తెలంగాణలోకి మీరు రాలేకపోవడాన్ని ప్రజలు ఎలా చూడాలి?**

జవాబు:కేవలం తెలంగాణలోనే కాదు, అనేక రాష్ట్రాలలో మా పార్టీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారు. దేశవ్యాప్తంగా గత 50 సంవత్సరాలుగా విప్లవోద్యమం ప్రజలల్లో ఒక నమ్మకాన్ని కలిగించింది. పార్టీ కార్యకర్తలు నిస్వార్ధంగా ప్రజల కోసం ప్రాణత్యాగం చేయడం అనేది ప్రజలకు ప్రేరణను, నమ్మకాన్ని పెంచింది. ఇది భవిష్యత్తులో పార్టీ పునర్నిర్మాణానికీ పునాది లాంటిది. పార్టీ అంటే కేవలం సాయుధ దళాలే కాదు. అనేక రూపాల్లో, వివిధ పద్ధతుల్లో పరిస్థితులను అనుసరించి పార్టీ పని చేయాల్సి ఉంటుంది. ఈ విధంగా చూసినప్పుడు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లలో పార్టీ ఉనికి, పార్టీ రాజకీయాలు అసలు లేవని అనగలమా. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పార్టీ నిర్వహించిన పాత్ర అందరికీ తెలిసిందే.

ఇక మీరు అంటున్న శవయాత్రల గురించి -మానవ సమాజ చరిత్ర ఘర్షణ, పోరాటం నుండి అభివృద్ధి చెందుతూ వస్తుంది. మానవజాతి చరిత్రలోని సుదీర్ఘ పోరాటంలో ఎందరో మహనీయులు తమ జీవితాలను త్యాగం చేశారు. మధ్యయుగాల్లో తాము కనుగొన్న వైజ్ఞానిక సత్యాలను ప్రచారం చేసినందుకు గెలిలియో, కోపర్నికస్ ల మీద ఆనాటి రాజ్యం కన్నెర్రజేసి హత్యలు చేసింది. ఆనాడు వారు చేసిన త్యాగం వలన మానవ సమాజం పురోగమించింది. బ్రిటీష్ వలసవాద వ్యతిరేక పోరాటంలో అమరులైన భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్, బిర్సాముండా, కొమరం భీం, అల్లూరి సీతారామ రాజు వంటి వీరులు ఇప్పటికీ ప్రేరణదాయకంగానే ఉన్నారు. ఆనాడు ఆ అమరవీరులను ఉరి తీసినప్పుడు సమాజం మొత్తం ఒక్కసారిగా ఉవ్వెత్తున లేవలేదు. పోరాటం సమాప్తం అయ్యిందని ఆనాటి పాలక వర్గాలు ఆలోచించారు. నేడు కూడా ఆ అమరవీరులను ప్రేరణగా తీసుకొని పోరాటం కొనసాగించడమే నేడు విప్లవకారుల కర్తవ్యం. ఇది అనాది నుండి కొనసాగుతున్న త్యాగాల, పోరాటాల సాంప్రదాయం. ఈ సందర్భంలో శ్రీశ్రీ మాట చెప్పుకోవడం సబబుగా ఉంటుంది. తెల్లవాడు నిన్ను నాడు భగత్ సింగ్ అన్నాడు. నల్లవాడు నిన్ను నేడు నక్సలైట్ అన్నాడు. ఎల్లవారు నిన్ను రేపు వేగుచుక్క అంటారు. ఈ మొత్తం సన్నివేశాన్ని శవయాత్రలు అని నెగెటివ్ గా వర్ణించడం ఎబ్బెట్టుగా ఉంటుంది. అమరుల శవయాత్రలు కేవలం విప్లవ సాంప్రదాయాల వ్యక్తీకరణ మాత్రమే కాదు. అవి ప్రజల్లో కొనసాగుతున్న విప్లవ రాజకీయాల వ్యక్తీకరణ కూడా. 'అమరుల ఆశయ సాధన కోసం పోరాడుదాం' అని ప్రజలు ఇస్తున్న నినాదాలు ప్రజల విప్లవ సంకల్పానికి నిదర్శనం. ఈ విప్లవ సంకల్పమే రానున్న విప్లవ వెల్లువకు పునాది.

**రాజ్యానికి, మీకు మధ్య యుద్ధం.. ఇది పోలీస్ వర్సెస్ మావోయిస్టులుగా మారింది. దీనిపై మీరేమంటారు ?**

జవాబు:దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రరూపం దాల్చుతున్న నేటి పరిస్థితుల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ చేసిన వారు కూడా కుటుంబ పోషణ కోసం పోలీస్ ఉద్యోగాల్లో చేరుతున్నారు. 'వికసిత్ భారత్' పేరుతో ఫాసిస్టులు ఊదరగొడుతున్న పాలసీల అమలు కోసమే నేడు పోలీసు వ్యవస్థ పని చేస్తోంది. ఈ పరిస్థితుల్లో ప్రజలకు, పోలీసులకు మధ్య శత్రుత్వం అనివార్యంగా పెరుగుతోంది. ప్రజాపక్షం వహించి పోరాడుతున్న మేము అనివార్యంగా రాజ్యంతో పోరాడక తప్పదు. ఇటీవల రాయ్‌పుర్‌లో జరిగిన డీ.జీ.పీ, ఇంటలీజెన్స్ అధికారుల మీటింగ్‌లో వికసిత్ భారత్ కార్యక్రమాన్ని ముందుకు తీసుకుపోవడమే పోలీస్ వ్యవస్థ యొక్క ప్రధాన కార్యక్రమమని మోదీ, అమిత్ షాలు ప్రకటించారు. మావోయిస్టు ఉద్యమ ప్రాంతాల్లో వేలాది మంది ప్రజల అరెస్టులు, చిత్రహింస లు, ఎన్కౌంటర్ హత్యలు, మహిళలపై అత్యాచారాలు, హత్యలు, పోలీస్ వ్యవస్థ ద్వారానే చేయిస్తున్నారు కదా. ఇంకా నర్మదా బచావో ఆందోళన మీద, 2021-22 లో నడిచిన రైతాంగ పోరాటం మీద, మణిపూర్ ఆందోళన, లద్ధాఖ్ ఆందోళనల మీద విపరీతమైన పోలీస్ నిర్బంధాన్ని అమలు జరిపారు/ జరుపుతున్నారు. వికసిత్ భారత్ అంటే కార్పొరేట్ కంపెనీల అభివృద్ధి అని ప్రత్యేకంగా వివరించనక్కర లేకుండానే నేడు మెజార్టీ ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. రాబోయే కాలంలో ప్రజల మీద ఫాసిస్టు దాడి మరింత తీవ్రతరం కాబోతున్నదనే విషయం వారి మాటల్లోనే అర్థమవుతోంది.

దోపిడీ వర్గాల రాజ్యం కేవలం మావోయిస్టుల పైననే యుద్ధం చేయడం లేదు. భారత రాజ్యం సమాజంలోని కార్మికులపైన, రైతాంగం పైన, మధ్యతరగతి పైన, మహిళల పైన, దళితుల పైన, ఆదివాసుల పైన, మతమైనారిటీల పైన, పీడిత జాతుల పైన ఒక రకమైన యుద్ధం చేస్తూనే వుంది. అది రైతాంగపు భూములను లాక్కునే రూపంలో, అటవీ ప్రాంతాలను బడా కార్పొరేట్లకు అప్పగించి ఆదివాసులను అక్కడినుండి తరిమి వేయడం రూపంలో, వక్ఫ్ భూములను కార్పొరేట్లకు అప్పగించే రూపంలో, మతమైనారిటీల ఇళ్లను ధ్వంసం చేసే రూపంలో, ప్రభుత్వరంగ పరిశ్రమలను కార్పొరేటీకరించే రూపంలో రాజ్యం భారత సమాజంపై ఒక రకంగా యుద్ధం చేస్తూనే వుంది. ఈ విషయాన్ని భారత సమాజం అర్థం చేసుకుని సమైక్యంగా, సంఘటితంగా, సాయుధంగా పోరాడాలి. భారతదేశంలోని పీడిత ప్రజలందరిని ఐక్యం చేసి, సంఘటితం చేసి, సాయుధం చేయడానికి మా పార్టీ కృషి చేస్తూ వుంది. దోపిడీ వర్గానికి అనుకూలంగా ఉండే మేధావులు ప్రచారం చేస్తున్నట్టుగా మాది ప్రజల మద్దతు లేని యుద్ధం కాదు, ప్రజల భాగస్వామ్యం లేని యుద్ధం కాదు. ఒకవేళ మాది ప్రజల మద్దతు, ప్రజల భాగస్వామ్యం లేని యుద్ధమే అయితే 50 ఏళ్లుగా ఈ యుద్ధం సాగకపోయేది. ప్రజల భాగస్వామ్యం లేని యుద్ధమయితే విప్లవోద్యమ అణచివేత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారత సైన్యం సహ 8,50,000లకు మించిన సాయుధ బలగాలను మా అణచివేతలో మోహరించాల్సిన అవసరం రాకపోయేది. అందుకే ఇది పోలీసు వర్సెస్ మావోయిస్టుల మధ్య యుద్ధం కాదు. ఇది భారత రాజ్యానికి భారత ప్రజలకు మధ్య జరుగుతున్న యుద్ధం. ఇందులో జయాపజయాలుంటాయి. వాటిని పార్టీ ఎప్పటికపుడు సమీక్షించుకుంటుంది, గుణపాఠాలు తీసుకుంటుంది.

**'జనంసాక్షి' అడిగిన మరికొన్ని ప్రశ్నలకు మావోయిస్టు పార్టీ నుంచి దొరకని సమాధానాలు (రేపటి సంచికలో..)**

# మేడారం జాతర భక్తుల కోసం ఆర్టీసీ మెరుగైన సేవలు

## రవాణా ఏర్పాట్లను స్వయంగా పరిశీలించిన వీసీ అండ్ ఎండీ నాగిరెడ్డి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రెండేళ్లకొకసారి నిర్వహించే అతిపెద్ద జాతర మేడారంకు వెళ్లే భక్తుల కోసం సంస్థ అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నది. మేడారంకు వివిధ ప్రాంతాల నుంచి పోటెత్తె భక్తులను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ ఆయా ప్రాంతాల నుంచి ప్రత్యేక రవాణా ఏర్పాట్లతో సేవల్ని అందిస్తోంది. ఆ మేరకు సంస్థ వైస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి యంత్రాంగం చేపట్టిన రవాణా సౌకర్య సేవల్ని స్వయంగా పరిశీలించారు. ఉప్పల్ నుంచి మేడారం వెళ్లే దారిలో గురువారం కొన్ని ప్రధాన పాయింట్లను పర్యవేక్షించారు. మేడారం మహా జాతరకు వెళ్లే భక్తుల పిల్లల భద్రత కోసం ఉప్పల్ బస్టాప్, హన్మకొండ బస్టాండులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సురక్షిత కేంద్రాలలో పిల్లలకు గుర్తింపు ట్యాగ్లు వేస్తున్న విధానాన్ని పరిశీలించి.. స్వయంగా పిల్లలకు ట్యాగ్లు వేశారు. ఈ సందర్భంగా మేడారం వెళ్లే సమయంలో పిల్లలు తప్పిపోకుండా ఉండేందుకు ఈ సురక్షిత చర్యలు ఎంతగానో ఉపయోగపడగలవన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని ఆర్టీసీ అధికారులను ఆయన ఆదేశించారు. హన్మకొండ బస్టాండులో క్యూలైన్లను పరిశీలించి అక్కడ ప్రయాణికులతో మాట్లాడుతూ రవాణా సేవలను అడిగి తెలుసుకున్నారు. సౌకర్యవంతమైన రవాణా సేవలకై ఆర్టీసీ తీసుకుంటున్న చర్యల పట్ల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. వీసీ అండ్ ఎండీతో పాటు కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సోలమాన్, వరంగల్ రీజినల్ మేనేజర్ విజయ భాను, తదితర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# నూతన ఎలక్ట్రిక్ కార్లను ఆవిష్కరించిన మహేంద్ర




**ఖైరతాబాద్, జనవరి 29 (జనం సాక్షి) :** భారతదేశపు ప్రముఖ ఎస్.యూ.వి తయారీ సంస్థ అయిన మహీంద్రా లిమిటెడ్, ఆటోమోటివ్ మహీం ద్రా ద్వారా నిజామాబాద్ పట్టణంలో తమ సరికొత్త ట్రెండ్సెట్టర్ అయిన ఎక్స్ యువి 7ఎక్స్ఈ, ఇంగ్లో ఆర్కిటెక్చర్పై పూర్తిగా కొత్తగా నిర్మించిన, భారత దేశపు మొట్ట మొదటి ప్రామాణిక ఎలక్ట్రిక్ 7-సీటర్ ఎస్ యువి అయిన ఎక్స్ ఈవి 9 ఎస్లను విడుదల చేసినట్లు మహీంద్రా లిమిటెడ్, ఆటోమోటివ్ బిజినెస్ ప్రెసిడెంట్, మహీంద్రా ఎలక్ట్రిక్ ఆటోమో బైల్ లిమిటెడ్ ఎండీ ఆర్.వేలుసామి గురువారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆటోమో టివ్ మాన్యుఫ్యాక్చరర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజీవ్ సంఘ్వీ తోకలిసి ఆయన మాట్లాడుతూ ఈ ఆవిష్కరణ స్థానిక ఎమ్మెల్యే రేకులపల్లి భూపతి రెడ్డి, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కటిపల్లి సరళ మహేందర్ రెడ్డి, హైకోర్టు న్యాయవాది కె.ఎం.మహేందర్ రెడ్డి ఇతర ప్రముఖుల సమక్షంలో జరిగిందని తెలిపారు.

# ప్రభుత్వ అధికారి సంతకం ఫోర్జరీ

## ఆదర్శ గ్రామం హాజిపల్లిలో వెలుగులోకి ఘటన


**పంచాయతీ కార్యదర్శి సంతకంను (స్టాంప్) ముద్రను ఫోర్జరీ చేసిన ఘనులు**


**అనుమతి లేకుండా ఇంటి నిర్మాణం..**

**ఒకర్నుంచి మరొకరికి రిజిస్ట్రేషన్**

**లోన్ మంజూరు చేసిన బ్యాంకు యాజమాన్యం**





**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** ప్రభుత్వ అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేశారు. ఇంటి లోన్ కోసం ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించారు. అంతేనా.. ఎలాంటి అనుమతులు లేకుండానే ఆ ఇంటిని సబ్ రిజిస్టర్ అధికారి రిజిస్ట్రేషన్ చేస్తే బ్యాంకు యాజమాన్యాలు లోన్ మంజూరు చేశాయి. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా షాద్నగర్ పరిధిలోని హాజిపల్లి గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పంచాయతీ కార్యదర్శి సంతకాన్ని తనకు తెలియకుండానే ఫోర్జరీ చేసి గ్రామ పంచాయతీ కార్యాలయం (స్టాంప్) ముద్రలను వాడుకున్నారు. ఏకంగా ఇల్లును మరొకరికి సబ్ రిజిస్టర్ అధికారి రిజిస్ట్రేషన్ చేస్తే ఓ ప్రైవేట్ బ్యాంకు ఆ ఇంటికి లోన్ మంజూరు చేసింది. దీంతో అస్సలు విషయం తెలుసుకున్న అప్పటి గ్రామ పంచాయతీ కార్యదర్శి బిరం హనుమంత్ రెడ్డి షాద్నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. షాద్నగర్ పట్టణానికి చెందిన మండ్ల సుధాకర్ అనే వ్యక్తి షాద్నగర్ పట్టణం గుండ్లకుంట శివారు హాజిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఓ ఇల్లును కొనుగోలు చేశారు. అద్నాన్సుగా ఐదు లక్షల రూపాయలు ఇంటి ఓనర్ రాసాల కురుమయ్యకు ఇచ్చి అగ్రిమెంట్ చేసుకున్నాడు. ఆ ఇంటికి పూర్తిస్థాయిలో అనుమతులు లేకపోవడంతో లోన్ రాలేదు. దాంతో ఇంటిని క్యాన్సల్ చేసుకున్నాడు. మరో వ్యక్తికి ఇంటి ఓనర్ రాసాల కురుమయ్య అమ్మివేస్తూ గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేశారని హాజిపల్లి అప్పటి గ్రామ పంచాయతీ కార్యదర్శి బిరం హనుమంత్ రెడ్డి చెబుతున్నారు. అప్పుడు కారోబార్గా ఉంటున్న ఇంద్రజా గ్రామ పంచాయతీ కార్యదర్శిగా సంతకాన్ని దిద్ది సబ్ రిజిస్టర్ అధికారులతో ఇల్లు మరొకరికి రిజిస్ట్రేషన్ చేశారు. ప్రైవేట్ బ్యాంకు ద్వారా లోన్ తీసుకొని తనను మోసం చేశారని, ఇందులో మోసపోయిన మండ్ల సుధాకర్ ద్వారా ఈ విషయం తెలిసిందని సదరు కార్యదర్శి తెలిపారు. ఇందులో ప్రమేయం ఉన్న వారందరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని షాద్నగర్ పోలీసులకు అప్పటి గ్రామ పంచాయతీ కార్యదర్శి హనుమంత రెడ్డితో పాటు మండ్ల సుధాకర్ కూడా ఫిర్యాదు చేశారు. ఇదే క్రమంలో హాజిపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న సమయంలో తన సంతకాన్ని కొందరు వ్యక్తులు ఫోర్జరీ చేశారని రాసాల కురుమయ్యతో పాటు మరి కొందరు సృష్టించిన ఇంటికి సంబంధించిన డాక్యుమెంట్స్, ఆస్తి ధృవీకరణ పత్రం, అసెస్మెంట్పై ఎలాంటి సంతకాలు పెట్టలేదని పేర్కొన్నాడు. గ్రామ పంచాయతీ స్టాంప్ (ముద్రలు) ఎవరు వేశారో తనకు తెలియకుండానే వేశారని, వారందరిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని షాద్నగర్ పోలీసులకు హనుమంత్ రెడ్డి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.

# మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్కు బుద్ధిచెప్పాలి

## మాజీ హోం శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



**మొయినాబాద్ (జనంసాక్షి) :** అబద్ధపు హామీలతో మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తమ ఓటు అనే ఆయుధంతో మున్సిపల్ ఎన్నికలలో సరైన గుణపాఠం చెప్పేలా నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించి చెప్పాలని మాజీ హోం శాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం మొయినాబాద్ మున్సిపల్ కేంద్రంలోని స్టార్ కన్వెన్షన్ లో మండల మున్సిపల్ అధ్యక్షుడు దారెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో టీఆర్ఎస్ పార్టీ నాయకుల ముఖ్య సమావేశం తో పాటు అభ్యర్థులతో కలిపి సమావేశాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ హోం మంత్రి సబిత ఇంద్రారెడ్డి తో పాటు మున్సిపల్ ఎన్నికల ఇన్చార్జిలు జై సింహా లు పాల్గొన్నారు ఈ సందర్భంగా సబిత ఇంద్రారెడ్డి ఆమె మాట్లాడుతూ...అభివృద్ధితో పాటు సంక్షేమ ఫలాలను సమపాల్లలో ప్రజలకు అందించిన గొప్ప నాయకుడు కేటీఆర్ అని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేండ్లు గడుస్తున్న ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని విమర్శించారు. అబద్ధాల పునాదులపై అధికారం ఏర్పాటు చేసుకున్న కాంగ్రెస్ పార్టీకి మున్సిపల్ ఎన్నికలలో తగిన బుద్ధిచెప్పాలని సూచించారు. జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆమె తెలిపారు. మున్సిపల్ పరిధిలో ఏ వార్డు కెళ్ళిన ప్రజల అభిమానులు కార్యకర్తలు ఓటర్లు కేసీఆర్ మాట బాట మర్చిపోలేరని గుర్తు చేశారు ఇందుకు నాయకులు కార్యకర్తలు అభ్యర్థులు గెలుపొంది బీఆర్ఎస్ పార్టీ మైనా బాద్ మున్సిపాలిటీలో జండా ఎగరవేయాలని సూచించారు ఇందుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను టీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానం నిర్వహిస్తుందని తెలిపారు అభ్యర్థులు నాయకులు కార్యకర్తలు అందరూ కష్టపడి గత సంవత్సరాల పాటు టీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు రెండేళ్ల పాలన కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది ఏమీ లేదని ప్రజలకు తెలపాలని పేర్కొన్నారు పాత సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ఈ ప్రభుత్వం కొనసాగిస్తుందని ప్రజలకు వివరించాలన్నారు. గెలుపే లక్ష్యంగా ప్రజలు ఎల్లవేళలా బిఆర్ఎస్ పార్టీ వెంటనే ఉన్నారని మనందరం ప్రజలతో మమేకమై గెలుపు కోసం కృషి చేసుకోవాలని పేర్కొన్నారుఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కొంపల్లి అనంతరెడ్డి, అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముదిగొండ రవి యాదవ్ మండల మున్సిపల్ అధ్యక్షుడు దారెడ్డి వెంకటరెడ్డి నాయకులు నరోత్తం రెడ్డి కొత్త నరసింహారెడ్డి కార్యకర్తలుపాల్గొన్నారు.

# నిరుపేద వితంతువులకు భరోసా

## ఎంఆర్ఓకు 15 దరఖాస్తుల అందజేత



**మల్కాజిగిరి జనవరి 29(జనం సాక్షి) :** కుటుంబ యజమానిని కోల్పోయి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నిరుపేద వితంతువులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద మల్కాజిగిరిలో 15 మంది బాధితుల దరఖాస్తులను బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఉపేందర్, నీలం సతీష్ గురువారం మల్కాజిగిరి మండల తహసీల్దార్కు అందజేశారు. ఈ పథకం ద్వారా మంజూరయ్యే రూ. 20,000 ఆర్థిక సాయం బాధిత కుటుంబాలకు తక్షణ ఆసరాగా నిలుస్తుందని అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేయాలని కోరారు. ఈ దరఖాస్తులను త్వరగా పరిశీలించి నిధులు మంజూరు చేయించి నిరుపేదలను ఆదుకోవాలని తహసీల్దార్ను కోరారు.

## కాంగ్రెస్ అభ్యర్థిగా సిబి శ్రీపూజిత నామినేషన్



**మహబూబ్నగర్టౌన్ (జనంసాక్షి) :** మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 40వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థిగా సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు సిబి శ్రీపూజిత గురువారం నామినేషన్ దాఖలు చేశారు. తన తండ్రి జిల్లా కాంగ్రెస్ పార్టీ మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్ తో కలిసి ఆమె కార్పొరేషన్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీతోనే మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రజా పాలనలో అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వినోద్, ప్రవీణ్ కుమార్, శ్యామ్, డానియల్, సురేష్, మోహన్, శోభన్, తేజ, జయ సూర్య, చింటూ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగబద్ధంగా ఫ్రీ అండ్ ఫెయిర్ గా జరగాల్సిన మున్సిపల్ ఎలక్షన్లను, హడావిడిగా,అకస్మికంగా మేడారం మహా జాతర సమయంలో నిర్వహించటం జిని,బహుజన వర్గాల ఆత్మగౌరవాన్ని హానంన చేయటమే అని జీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు దాసు సురేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# ఇంజన్ క్లీన్ యాక్టివ్ టెక్నాలజీని ప్రారంభించిన జియో బీపీ

**ఖైరతాబాద్, జనవరి 29 (జనం సాక్షి) :** జియో బీపీ యొక్క ఇంజన్ క్లీన్ చేసే యాక్టివ్ టెక్నాలజీ పెట్రోలును జియో-బిపి(రిలయెన్స్ ఇండస్ట్రీస్, బిపి వారి జాయింట్ వెంచర్ అయిన రిలయెన్స్ బీపీ మొబిలిటీ లిమిటెడ్(ఆర్బీఎంఎల్)ను గోవాలో 'ఇండియా ఎనర్జీ వీక్-2026' సందర్భంగా కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రి హర్దీప్ సింగ్ చేతుల మీదుగా ప్రారంభించినట్లు జియో-బిపి ఛైర్మన్ సార్థక్ బెహూరియా గురువారం నగరం లో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జియో-బిపి సీఈఓ అక్షయ్ వాధ్వా తోకలిసి ఆయన మాట్లాడుతూ ఇది కీలకమైన ఇంజన్ భాగాల నుండి పేరుకున్న వాటిని తొలగించటం ద్వారా శక్తివంతమైన ఇంజన్ క్లీన్-అప్ పెర్ఫార్మెన్సును అందించే విప్లవాత్మకమైన యాక్టివ్ టెక్నాలజీ అన్నారు. భారతీయ మోటరిస్టుల కోసం ఇంజన్ పెర్ఫార్మెన్సును పునరుద్ధరించేందుకు, నిర్విరామంగా ఇది ఉపయోగపడుతుందని అన్నారు. భారతీయ డ్రైవింగ్ పద్ధతుల ఆధారంగా ప్రతి సంవత్సరం, అదనపు ఖర్చు లేకుండా 100 కిమీల వరకు వెళ్ళగలిగేందుకు సహాయ పడుతుందని తెలిపారు.

# ప్రజలకు ఎప్పటికప్పుడు మున్సిపల్ ఎన్నికల సమాచారం

## మీడియా సెంటర్ను ప్రారంభించిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్



**మహబూబ్ నగర్ బ్యూరో, జనవరి 29 (జనంసాక్షి) :** మహబూబ్నగర్ జిల్లాలో మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకుని మహబూబ్నగర్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్) లోని రూమ్ నెం.120లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎం.సి.ఎం.సి)ను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ గురువారం ప్రారంభించారు. మీడియా కోసం అందుబాటులో ఉన్న సదుపాయాలను, ఎంసిఎంసి విధుల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఎంసిఎంసి సెల్ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, సకాలంలో ప్రచార ప్రకటనలకు సంబంధించిన ఎన్నికల వ్యయం ను లెక్కించాలని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులను గమనిస్తూ ఉండాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి అతిక్రమించిన పోస్టులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడానికి మీడియా సహకారం అందించాలని అదనపు కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో డి.పి.ఆర్.ఓ పి.శ్రీనివాస్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ ఇస్రా నాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి 'అపర్ణ క్యాన్సర్ క్రూసేడర్స్ గోల్ఫ్ ఛాంపియన్షిప్'

## క్యాన్సర్ బాధితుల నిధుల సేకరణ కోసం..

**ఖైరతాబాద్, జనవరి 29 (జనంసాక్షి) :** క్యాన్సర్ రోగుల చికిత్స నిమిత్తం నిధుల సేకరణ లక్ష్యంగా '9వ ద్వైవార్షిక అపర్ణ క్యాన్సర్ క్రూసేడర్స్ గోల్ఫ్ ఛాంపియన్షిప్' ఈనెల 30వ తేదీన గచ్చిబౌలిలోని బౌల్డర్ హిల్స్ గోల్ఫ్ & కంట్రీ క్లబ్లో ప్రారంభం కానుంది. అబోలో క్యాన్సర్ సెంటర్ల సహకారంతో క్యూర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరగనుంది. ఫిబ్రవరి 1వ తేదీ వరకు జరగనున్న ఈ మూడు రోజుల మెగా టోర్నమెంట్లో ప్రపంచవ్యాప్తంగా ఉన్న దాదాపు 450 మందికి పైగా గోల్ఫ్ క్రీడాకారులు తలపడనున్నారు. ఈ టోర్నమెంట్ ద్వారా సేకరించిన నిధులను నిరుపేద క్యాన్సర్ రోగుల చికిత్స కోసం వినియోగించనున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పి విజయ్ ఆనంద్ రెడ్డి మాట్లాడుతూ ఈ మూడు రోజుల అత్యున్నత గోల్ఫ్ క్రీడను చూడబోతున్నామన్నారు. దేశంలోని అత్యంత ప్రతిభావంతులైన ఆటగాళ్లు, ఔత్సాహిక క్రీడాకారులు ఈ పోటీలో తలపడనున్నారని తెలిపారు. ఈ ఛాంపియన్షిప్ కేవలం పోటీ మాత్రమే కాదని, అద్భుతమైన ఫలితాలను కూడా పెరుగాంచిందన్నారు. దీని ద్వారా సేకరించిన నిధులు క్యాన్సర్ అవగాహన కార్యక్రమాలు, స్క్రీనింగ్లు, సామాన్య ప్రజలకు చేరువ కావడానికి సహాయపడుతాయని తెలిపారు. ఇప్పటివరకు జరిగిన ఈవెంట్లతో క్యాన్సర్ సెంటర్ల భాగస్వామ్యంతో క్యూర్ ఫౌండేషన్ ఇప్పటివరకు 1,500 మందికి పైగా క్యాన్సర్ బాధితులకు ఉచితంగా, రాయితీతో కూడిన చికిత్సను అందించిందని వివరించారు. పునరావాసం, పరిశోధన, విద్యా కార్యక్రమాలకు కూడా అండగా ఉన్నామని తెలిపారు. ఒక ఫౌండేషన్గా దట్టు ఒక ప్రాణాన్ని నిలిపి, అర్థవంతమైన మార్పు తెచ్చినప్పుడే దానికి నిజమైన విలువ ఉంటుందని నమ్ముతున్నామన్నారు. ఈ పోటీలు మూడు రోజుల పాటు ఐదు సెషన్లలో నాలుగు రౌండ్లుగా జరుగుతాయి. 'డబుల్ పియోరియా స్టేబుల్ఫోర్డ్' (100 శాతం హ్యాండిక్యాప్) పద్ధతిలో సాగే ఈ టోర్నమెంట్, క్రీడాకారుల మధ్య ఉత్కాహభరితమైన పోటీని, అద్భుతమైన గోల్ఫ్ ఆటను అందించనుంది. 12 హిడెన్ హోల్స్ (ముందు తొమ్మిదిలో ఆరు, వెనుక తొమ్మిదిలో ఆరు) ఆధారంగా హ్యాండిక్యాప్లను లెక్కిస్తారు. చివరి సెషన్ స్కోర్కార్డులు సమర్పించిన తర్వాతే ఈ పియోరియా హోల్స్ను ఎంపిక చేస్తారు. ప్రతి హోల్కు గరిష్ట స్కోరు 'గ్రాస్ డబుల్ బోగీ'గా ఉంటుంది. 24 కంటే ఎక్కువ హ్యాండిక్యాప్ ఉన్న ఆటగాళ్లు 'ట్రిపుల్ బోగీ' తర్వాత బంతిని తీసుకోవచ్చు, అయితే, వారి స్కోరును 'డబుల్ బోగీ'గానే నమోదు చేస్తారు. గడిచిన కొన్నేళ్లుగా, క్యాన్సర్ క్రూసేడర్స్ గోల్ఫ్ ఛాంపియన్షిప్ ఒక శక్తివంతమైన వేదికగా రూపాంతరం చెందింది. ప్రముఖ గోల్ఫ్ క్రీడాకారులు, సెలబ్రిటీ స్పోర్ట్స్ పర్సన్స్, ప్రముఖ వ్యక్తులు, కార్పొరేట్ దిగ్గజాలు, మేధావులను ఇది ఏకం చేస్తోంది. వీరందరూ క్యాన్సర్పై పోరాడటం, భరించగల చికిత్సను నిరుపేద రోగులకు అందించే గొప్ప లక్ష్యం కోసం భాగస్వామ్యం అవుతున్నారు.

# గురు రాఘవేంద్ర వైన్స్లో ఎటువంటి కల్తీ మద్యం లేదు

## ఎక్సైజ్ ఎస్ఐ శిరీష



**నారాయణపేట జిల్లా బ్యూరో, జనవరి29 (జనం సాక్షి) :** కృష్ణా మండలంలోని గురురాఘవేంద్ర వైన్ షాప్ను( నెంబర్ 73) ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. తనిఖీ సందర్భంగా షాప్లో నిల్వ ఉన్న మొత్తం మద్యం స్టాక్ను సవివరంగా పరిశీలించగా, ఎటువంటి కల్తీ మద్యం లేదని నిర్ధారించబడింది. నిన్న కొంతమంది వ్యక్తులు ఒక కార్టన్ బీరు కొనుగోలు చేసి తీసుకెళ్లిన అనంతరం, అందులోని రెండు బీర్ బాటిళ్లలో కల్తీ జరిగిందని ఆరోపిస్తూ ప్రచారం చేసిన సమయంలో వైన్ షాప్ వద్దకు వచ్చారు.ఈ విషయాన్ని గమనించి, ఎస్ఐ శిరీష ఆధ్వర్యంలో సంబంధిత వైన్ షాప్లో ఉన్న మొత్తం స్టాక్పై పూర్తిస్థాయి తనిఖీ నిర్వహించబడింది. నిర్వహించిన తనిఖీలలో ఎక్కడా కల్తీ జరిగినట్లు ఎలాంటి ఆధారాలు లేదా ఆనవాళ్లు లభించలేదు. వైన్ షాప్లలో కల్తీ మద్యం విక్రయానికి అనుమతి లేదు.ఒకవేళ కల్తీ మద్యం విక్రయించినట్లు నిర్ధారణ అయినట్లయితే, సంబంధిత వైన్ షాప్ లైసెన్స్ను రద్దు చేసి, నిబంధనల ప్రకారం కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

# ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

## సేవా స్ఫూర్తితో 'పికిల్ ఇన్ పింక్' పికిల్బాల్ టోర్నమెంట్



**రాజేంద్రనగర్ (జనంసాక్షి) :** గండిపేట వేదికగా జరిగిన 'పికిల్ ఇన్ పింక్' చారిటీ పికిల్బాల్ టోర్నమెంట్ రెండో ఎడిషన్ విజయ వంతంగా ముగిసింది. సికింద్రాబాద్ రౌండ్ టేబుల్ 33 (ఎస్ఆర్టీ 33), సికింద్రాబాద్ లేడీస్ సర్కిల్ 17 (ఎస్ఎల్సీ 17) ఆధ్వర్యంలో ఈ మెగా ఈవెంట్ జరిగింది. బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహన కోసం పింక్ థీమ్తో నిర్వహించిన ఈ పోటీల ద్వారా సేకరించిన నిధులను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించనున్నారు. మూడు వందల మందికి పైగా హాజరైన ఈ వేడుకలో మయాంక్ షెట్టి, రుషిల్ గుప్తా జోడీ విజేతలుగా నిలిచారు. ఆరెట్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. ఈ టోర్నమెంట్లో వివిధ విభాగాల్లో పోటీలు జరిగాయి. హైదరాబాద్లో పికిల్బాల్ వేగంగా ప్రజాదరణ పొందుతున్నదనడానికి ఇది నిదర్శనం. తీవ్ర ఉత్కంఠ సాగిన ఫైనల్ మ్యాచ్లో జతిన్ ఏలూరి, గోపీ నాదిరెడ్డి జోడీని 2--1 తేడాతో మయాంక్ షెట్టి, రుషిల్ గుప్తా జోడీ ఓడించారు. మ్యాచ్ స్కోర్లు 8-11, 11-10, 11-2గా నమోదయ్యాయి. విజేతలకు బొల్లినేని గ్రూప్కు చెందిన మల్లికార్జున్, ఎస్ఆర్టీ 33 ఛైర్మన్ గగన్దీప్ సింగ్ ట్రోఫీ అందజేశారు. 'పికిల్ ఇన్ పింక్ - సీజన్ 2' విజయానికి స్పాన్సర్ల సహకారం కీలకంగా నిలిచింది. ప్రధాన స్పాన్సర్గా యోదా దయాగ్నస్టిక్స్, బొల్లినేని బిల్డర్స్, పైరెట్ సంస్థలు వ్యవహరించాయి. ఈ సందర్భంగా ఎస్ఆర్టీ 33 ప్రతినిధి గగన్దీప్ మార్వా మాట్లాడుతూ పికిల్ ఇన్ పింక్ అనేది క్రీడలు - సేవ కలిసే వేదిక అన్నారు. ఈరోజు ఆడిన ప్రతి ఆట అవసరంలో ఉన్న వారికి మంచి భవిష్యత్తును నిర్మించడంలో భాగం అయ్యాయన్నారు. ఉత్కంఠభరితమైన మ్యాచ్లతో పాటు ఫుడ్ స్టాల్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి

# చాల్కి పాఠశాలను పరిశీలించిన ఎంపీడీఓ

• "జనంసాక్షి" కథనంతో కదిలిన అధికార యంత్రాంగం

• సౌకర్యాలను సమకూర్చాలని అధికారులకు ఆదేశం



**న్యాల్ కల్, జనవరి 29, (జనంసాక్షి) :** నల్ల త్రాచు (కింగ్ కోబ్రా) సర్పం నుండి "ఉపాధ్యాయుడికి త్రుటిలో తప్పిన పెను ప్రమాదం" శీర్షికన బుధవారం ప్రచురించిన.. "జనంసాక్షి" కథనానికి మండల, గ్రామ పంచాయతీ రాజ్ శాఖాధికారులు, స్థానిక సర్పంచ్ జనార్దన్ రెడ్డిలు స్పందించారు. మధ్యాహ్నం స్థానిక ఎంపీడీఓ షగుఫ్తా ఇర్ఫాత్, స్థానిక సర్పంచ్ జనార్దన్ రెడ్డి, పాఠశాల కమిటీ అధ్యక్షురాలు సాబేర బేగం, గ్రామ పంచాయతీ కార్యదర్శి రవికుమార్‌లు మండలంలోని చాల్కి జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలలను పరిశీలించారు. మంగళవారం ఉదయం ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు శంకర్‌కు నల్లత్రాచు సర్పం నుండి త్రుటిలో ప్రాణాపాయం తప్పిన విషయం తెలిసిందే.

**పాఠశాల ఆవరణను పరిశీలించిన ఎంపీడీఓ**

స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి, స్థానిక పంచాయతీ రాజ్ అధికారులు, స్థానిక సర్పంచ్, పాఠశాల అధ్యక్షురాలు, స్థానికులతో కలిసి పాఠశాల, పాఠశాల ఆవరణలోని మరుగుదొడ్లు, త్రాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, మధ్యాహ్న భోజనం, ఉపాధ్యాయుల విధి నిర్వహణ, విద్యార్థునుల హాజరు, విద్యార్థునులకు అందుతున్న బోధన, విద్యుత్ సౌకర్యం, తదితర సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాల ఆవరణలో పారిశుద్ధ్యం మరి దారుణంగా ఉందని, మరుగుదొడ్లు శిథిలమై ఎంత మాత్రం ప్రయోజనం లేకుండా మారాయని, స్థానిక అధికారుల తీరుపై ఒకింత అసహనం వ్యక్తం చేశారు. చెత్తా, చెదారం, మురుగు, అపరిశుభ్రతతో మరి దారుణంగా ఉందన్నారు. పాఠశాలలో కనీస సౌకర్యాల ఏర్పాటు కోసం మంజూరైన నిధులతో చేపట్టిన పనులు, ఖర్చు చేసిన నిధుల వివరాలను వెంటనే సేకరించాలని పంచాయతీ రాజ్ శాఖ ఏఈ మహేష్‌కు ఆదేశించారు. రికార్డును పరిశీలించి మిగిలిన నిధులతో బాల, బాలికలకు అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎంత మాత్రం నాణ్యత లేకుండా పనులను చేపట్టిన సంబంధిత కాంట్రాక్టర్ కు బదులుగా మరో కాంట్రాక్టర్‌తో పనులను పూర్తిచేశాలా వెంటనే చర్యలు తీసుకోవాలని ఏఈని ఆదేశించారు.

**ఎంపీడీఓకు మొరపెట్టుకున్న విద్యార్థునులు.**

తరగతి గదులను ఎంపీడీఓ నేరుగా పరిశీలిస్తున్న క్రమంలో.. ఎంపీడీఓకు పలువురు విద్యార్థునులు పలు సమస్యలపై మొర పెట్టుకున్నారు. మరుగు దొడ్లు లేని కారణంగా ఇబ్బందిగా మారిందని, మధ్యాహ్న భోజనం ఎంత మాత్రం బాగోలేదని, రోజు ఇంటి నుండి తెచ్చుకున్న భోజనంతో తినాల్సి వస్తుందని, మధ్యాహ్న సమయంలో ఇంటికి వెళ్లి తినాల్సి వస్తుందని పలువురు విద్యార్థునులు విన్నవించారు. నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకుంటామని విద్యార్థునులకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, కిషన్ నాయక్. గ్రామస్తులు రాజేష్, చంద్రశేఖర్, రియాజ్, యాదుల్, రాజప్ప, ఖయ్యూం, వ్యాధులు, షఫీ, తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి అమ్మితే కఠిన చర్యలు తప్పవు

• కల్వకుర్తి సీఐ నాగార్జున

• గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్ట్ రిమాండ్

• అభినందించిన నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ



**ఊర్కొండ జనవరి 29 ,(జనంసాక్షి) :** గంజాయి అమ్మిన వాడిన కఠిన చర్యలు తప్పవని గంజాయి విక్రయిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండ్ కు పంపించినట్లు కల్వకుర్తి సీఐ నాగార్జున విలేకరుల సమావేశంలో తెలియ జేశారు.నాగర్ కర్నూల్ జిల్లా ఉరుకొండ మండల పరిధి లోని ఊర్కొండపేట గ్రామ శివారులో సూర్యలత స్పిన్నిం గ్ మిల్ సమీపంలో ఊర్కొండ ఎస్సై కృష్ణ దేవ ఆధ్వర్యం లో పోలీసులు భారీగా గంజాయిని స్వాధీనం చేసుకు న్నారు.జనవరి 27 మంగళవారం రోజు సాయంత్రం 4 గంటల సమయంలో ఊర్కొండపేట గ్రామ శివారులోని జాతీయ రహదారి పక్కన గల సూర్యలత స్పిన్నింగ్ మిల్ సమీపంలోని పొదల్లో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు ఎస్సై కృష్ణదేవ కు సమాచారం అందగా కల్వకుర్తి సి.ఐ నాగార్జున పర్యవేక్షణలో పోలీస్ సిబ్బంది తనిఖీలు చేపట్టగా,పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించిన ఒడిస్సా కి చెందిన లిట్టు మాలిక్, (35)ఒడిస్సా. (గత 12 ఏళ్లుగా మిల్లులో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు).అభిమన్యు మాలిక్ (32) అనే వ్యక్తులను విచారించగా నిందితులు ఇద్దరూ సూర్యలత స్పిన్నింగ్ మిల్లులో ఆపరేటర్లుగా పనిచేస్తున్నామని,ఒడిస్సాలో తక్కువ ధరకు గంజాయి లభిస్తుండటంతోఇక్కడ ఎక్కువ లాభాలకు విక్రయించాలని పథకం వేశారు. ఈ క్రమంలో ఈనెల 23న ఒడిస్సాలోని తెడీ బజార్‌లో 'చాచా' అనే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి,బస్సులో హైదరాబాద్ మీదుగా మిల్లుకు చేరుకున్నారు.స్వాధీనం చేసుకున్న 2.390 కిలోల గంజాయి (మొగ్గలు, పువ్వులతో కూడినది) విలువ సుమారు రూ.58,850/- ఉంటుందని అధికారులు తెలిపారు. వద్ద నుండి రెండు సెల్ ఫోన్లను కూడా స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు రిమాండ్కు తరలించినట్లు తెలిపారు. నేరస్తులను పట్టుకోవడంలో చాకచక్యంగా వివ రించిన ఊర్కొండ ఎస్ఐ పి.కృష్ణదేవ, కానిస్టేబులు హర్ష , వెంకన్నలను నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ అభినందించారు.

# కేసీఆర్‌కు సిట్ నోటీసులు రాజకీయ కక్ష్య సాధింపే

### మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి



**జడ్చర్ల, (జనంసాక్షి):** బీఆర్ఎస్ అధినేత, తెలంగాణతొలి ముఖ్య మంత్రి కల్వకుంట్ల చంద్రశే ఖర్ రావు (కేసీఆర్)కు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు ఇవ్వడాన్ని మాజీ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే రాజకీయ కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. గురువారం మాజీ మంత్రి లక్ష్మారెడ్డి పత్రికా ప్రకటన ద్వారా తెలుపుతూ పాలనా వైఫల్యాలు, కాంగ్రెస్ ప్రభు త్వ హయాంలో జరుగుతున్న వరుస స్కామ్‌ల నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ నోటీసుల డ్రామా ఆడుతున్నారని, రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తున్న బొగ్గు స్కామ్‌పై సమాధానం చెప్ప లేకనే ఇలాంటి కుట్రలకు తెరలేపారని, పదేళ్ల పాటు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిన కేసీఆర్ వెంట యావత్ తెలంగాణ సమాజం ఉందని, ఇలాంటి నోటీసులకు, బెదిరింపులకు బీఆర్ఎస్ నాయకులు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా, కుట్రలు పన్నినా బీఆర్ఎస్ శ్రేణులు భయపడాలని, ఈ పోరాటాన్ని ప్రజా క్షేత్రంలోనే తేల్చుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ సాధించిన నాయకుడిపై బురదజల్లే ప్రయత్నం చేస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు.

# కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు



**నారాయణపేట జిల్లా బ్యూరో జనవరి 29 (జనంసాక్షి):** జిల్లాలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు స్వీకరించేందుకు వీలుగా జిల్లా కలెక్టరేట్ సముదాయం (కలెక్టరేట్)లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్త పట్నాయక్ తెలిపారు. కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 9154283913 కు కాల్ చేసి ఫిర్యాదులు చేయవచ్చని సూచిం చారు.కంట్రోల్ రూమ్‌కు వచ్చే ఫిర్యాదులను వెంటదివెంట పరిశీలిస్తూ, పరిష్కరించేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు.

# విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలను సాధించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ



**గద్వాల నడిగడ్డ,జనవరి 28 (జనంసాక్షి):** విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ అన్నారు. గురువారం జోగులాంబ గద్వాల జిల్లా పరిధిలోని ఎస్సీ,ఎస్టీ,బీసీ వసతి గృహాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా ప్రత్యేక ప్రేరణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా అయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈసారి జిల్లాలో పదవ తరగతి విద్యార్థులు 100% ఫలితాలు సాధించే దిశగా నిష్ణాతులైన ఉపాధ్యాయులచే ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను తమ సొంత పిల్లలా భావించి ఇంగ్లీష్,హిందీ,గణితం, సైన్స్ సబ్జెక్టులలో ఎక్కువ మార్కులు ఎలా సాధించాలి అనే అంశాలను వివరంగా తెలియ పరచాలన్నారు. జిల్లాలోని 10వ తరగతి చదువుతున్న సుమారు 500 మంది విద్యార్థులు ఈ ప్రేరణ తరగతుల్లో పాల్గొనడం జరుగుతుందని,విద్యార్థులందరు ఈ ప్రేరణ తరగతులను సద్వినియోగం చేసుకొని వంద శాంతం ఫలితాలను సాధించాల న్నారు.ఉత్తమ ఫలితాలు సాధించే విద్యార్థులకు ప్రోత్సాహకంగా మొదటి బహుమతి: రూ. 5,016/-

రెండవ బహుమతి: రూ. 3,016/-

మూడవ బహుమతి: రూ. 2,016/-

ఈ బహుమతులను స్వయంగా విద్యార్థులకు అందజేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి నుషిత,డి ఈ ఓ విజయలక్ష్మి,డిబిసిడిఓ అక్బర్ పాషా, సమావేశ నిర్వహణ అధికారి రవీంద్ర ధీర,అలాగే ఉపాధ్యాయులు జయపాల్ రెడ్డి, సుమలత,కృష్ణకుమార్, సుభానీ, జిల్లా వసతి గృహ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి





• పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలన

• విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం

**రాయికోడు, జనవరి 29,(జనంసాక్షి)** విద్యార్థిని విద్యార్థులకు మేను ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి అంజయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం సుధాకర్ రెడ్డిలు సూచించారు. గురువారం మండల పరిధి లోని అల్లాపూర్ చౌరస్తాలో గల ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలను తాసిల్దార్ ఆశాజ్యోతి, ఎంపి డీవో ఎంఎ షరీఫ్‌లతో కలిసి పరిశీలించారు. పాఠశా లలో వడ్డిస్తున్న అన్నం సాంబారు,స్టోర్ రూమ్‌లోని నిత్యవసర సరుకులను పరిశీలించారు అనంతరం విద్యార్థిని విద్యార్థుల థో కలిసి భోజనం నిర్వహిం చా రు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ సహకారంతో గురుకుల పాఠశాలకు కోట్ల రూపాయలతో విద్యార్థులకు అన్ని వసతులు ఏర్పాటు చేసి నట్లు చెప్పారు.ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచు కోవల ని కోరారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# సమ్మక్క- సారక్క అమ్మవార్ల దయతో పాడిపంటలు సమృద్ధిగా పండాలి



మాజీమంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు



**నంగునూరు జనవరి 29( జనంసాక్షి):** సమ్మక్క సారక్క అమ్మవార్ల దయతో పాడిపంటలు సమృద్ధిగా పండాలని ప్రజలందరూ ఆయు ఆరోగ్యాలతో ఉండాలని మాజీమంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. గురువారం రోజు నంగునూరు మండలం లో నీ అక్కెనపల్లి గ్రామంలో జరుగుతున్న సమ్మక్క -సారక్క అమ్మవార్ల జాతరలో పాల్గొని అమ్మవార్లు దర్శించుకునే ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. అనంతరం మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎరువు బస్తాల కోసం రైతులు0ఇబ్బంది పడతా ఉన్నారు .కెసిఆర్ పాలన స్వర్ణ యుగం లాంటిది అని అన్నారు.కెసిఆర్ నాట్లకు రైతుబంధు వేస్తే రేవంత్ రెడ్డి ఓట్ల కోట్లకు రైతుబంధు ఇస్తున్నాడు. రైతులకు విద్యుత్ సరఫరా 24 గంటలు ఇవ్వడం లేదు 12 గంటలు మాత్రమే ఇస్తా ఉన్నారు. తెలంగాణ తెచ్చినోడు తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికి ఆదర్శంగా నిలిపిన నాయకుడు కేసీఆర్ అలాంటి కేసిఆర్ కు నోటీసులు ఇవ్వడం అంటే సూర్యుని మీద ఉమ్మినట్టే , రేవంత్ రెడ్డి ఎన్ని నోటీసులు ఇచ్చిన ఇంకా గట్టిగా బరాబర్ కొట్లాడుతాం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జాపా శ్రీకాంత్ రెడ్డి, బద్దిపడగ కిష్టారెడ్డి, స్థానిక సర్పంచ్ రేణుక-రమేష్, వివిధ గ్రామాల సర్పంచులు , టిఆర్ఎస్ కార్యకర్తలు, సమ్మ క్క ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు మహిళలకు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ లబ్దికోసమే కెసిఆర్ కి సిట్ నోటీసులు

• కేసులకు భయపడం బరిగీసి బారాబర్ కోట్లాడుతాం

• మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**వనపర్తి బ్యూరో జనవరి 29 (జనంసాక్షి) :** మున్సిపల్ ఎన్నికల్లో, కాంగ్రెస్ పార్టీ లబ్దికోసం కె.సి.ఆర్ కి సిట్ నోటీసులు ఇచ్చారని తెలంగాణ వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని ఆయన నివాస గృహంలో గురువారం నాడు శాసన మ ండలి మాజీ చైర్మన్ సామి గౌడ్ తో పాటు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ వ్యతిరేకతను కప్పిపుచ్చుకోవడానికే డైవర్షన్ పాలిటిక్స్ ఆడుతున్నారని, ఎవరెస్టు శిఖరం అంత ఎత్తు ఎదిగిన కెసిఆర్ ను బలహీన పరచాలనుకోవడం రేవంత్ రెడ్డి మూర్ఖత్వానికి నిదర్శనం అన్నారు. మీరు పెట్టే కేసులకు భయపడబోమని ఎదురండి పోరాడి తీరుతామన్నారు.నేడు రాష్ట్రాన్ని పాలిస్తున్న, కాంగ్రెస్ నాయకులు, వై.ఎస్.ఆర్, చంద్రబాబు నాయుడు వంటి వారికంటే బలవంతులు కారన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధనను చంద్రబాబు, వై.ఎస్. ఆర్‌లు, అణచాలని,ఆపాలని,నిరోధించాలని, ఎన్ని కుట్రలు పన్నినా, మనో నిబ్బరంతో ఎదుర్కొని రాష్టాన్ని సాధిం చిన కె.సి.ఆర్‌కి ,ఈ విచారణలు, కేసులు వెంట్రుకతో సమానమని అన్నారు. ప్రభుత్వం చేసే చిలిపి,చిల్లర చేష్టలతో వారి మీద ప్రజలు అసహ్యం,ఏహ్యాభావం ఏర్పడుతుందని స్పష్టం చేశారు.మున్సిపల్ ఎన్నికల్లో బరిగీసి బారాబర్ కోట్లాడుతామని, బి.ఆర్.ఎస్ జండా ఎగరవేస్తామని నిరంజన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

**పట్టణ అభివృద్ధి నిరంజన్ రెడ్డికి ముందు నిరంజన్ రెడ్డి తర్వాత చూడాలి: మాజీ చైర్మన్ స్వామి గౌడ్**

ఈ సందర్భంగా వనపర్తి మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ స్వామి గౌడ్ మాట్లాడుతూ నిజమైన ప్రజా సేవకులను,పార్టీ విదేయులను,వడపోసి ప్రకటించామని, ప్రజలు మద్దతు ఇచ్చి గెలిపించి, నిరంజన్ రెడ్డి కి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.పాలన చేతకాక, ఇచ్చిన హామీలు అమలు చేయలేక ఫోన్ ట్యాపింగ్ డ్రామా ఆడుతున్నారని, గూఢ చార వ్యవస్థ ఈ నాటిది కాదని, కేవలం డైవర్షన్ పాలిటిక్స్ కోసం ,టి.వి.సీరియల్ నడుపుతున్నారని, కె.సి.ఆర్ కి నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండించారు. మహిళలకు ఇస్తామన్న 2500 ఆసరా పింఛన్లు 4000, తులం బంగా రం, నిరుద్యోగులకు 2లక్షల ఉద్యోగాలు ,విద్యార్థులకు విద్యా బరోసా, విద్యార్థినులకు స్కూటీలు, ధాన్యానికి బోనస్, గ్యాస్ సబ్సిడీ రైతులకు, రైతు భరోసా రైతు, రుణ మాఫీ, రైతు బీమా,సకాలములో రైతులకు, యూరియా అందించి ఓట్లు అడగాలని కాంగ్రెస్ పార్టీనీ డిమాండ్ చేశారు.అనంతరం వనపర్తి మున్సిపల్ ఎన్నికల్లో, బి.ఆర్.ఎస్ పార్టీ తరపున పోటీచేబోతున్న 29మందితో కూడిన మొదటి జాబితాను విడుదల చేశారు.సుపరిపాలన కోసం బి.ఆర్.ఎస్ పార్టీని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.పట్టణ అభివృద్ధి కోసం,ప్రజా ప్రయోజనాల కోసం సి.పి.ఎం .పార్టీతో పొత్తులో బాగంగా సి.పి.యం పార్టీకి 18,21వార్డుల కేటాయించడం జరిగిందన్నారు. నంది మల్ల.అశోక్ జిల్లా బి.ఆర్.ఎస్ మీడియా కన్వీనర్ నంది మల్ల అశోక్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధిలో మిత్ర పక్షా ల, సహకారం అవసరమని, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ,సి.పి.ఎం పార్టీకి స్నేహహస్తం అందించారని కోరారు. పొత్తులో బాగంగా రెండు సీట్లలో (18,21) పుట్ట. ఆంజనేయులు,మదన్ పోటీచేస్తారని అశోక్ తెలిపారు.ఈ సమావేశములో జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, మాజీ మున్సిపల్ చైర్మన్లు బి.లక్ష్మయ్య, పలుస రమేష్ గౌడ్, గంధం. బాలపీరు,గులాం ఖాదర్ ఖాన్,బొబ్బిలి.ప్రేమ్ కుమార్, వెంకట్ సాగర్,జోహెబ్ హుస్సేన్, చిట్యాల. రాము, నీలస్వామి,జానంపేట.శ్రీనివాసులు, ఉన్నారు.



# కొట్టం ఇండస్ట్రీస్ పై కేసు నమోదు

**వనపర్తి బ్యూరో జనవరి 29 (జనంసాక్షి):** కొత్తకోట మండలంలోని సంకిరెడ్డిపల్లి శివారులోని కొట్టం ఇండస్ట్రీస్ రైస్ మిల్లు యజమానిపై కేసు నమోదు చేశామని కొత్తకోట ఎస్సై ఆనంద్ తెలిపారు. 2022, నుంచి 2025 వరకు వివిధ సీజన్లలో ప్రభు త్వం ఆ మిల్లుకు 8,618.460 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయి ంచింది. ఈ దాన్యంలో 3,824.530 మెట్రిక్ టన్నులు పక్కదారి పట్టినట్లు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు తనిఖీల్లో గుర్తించారు. వాటి విలువ రూ. 13.14 కోట్లు ఉంటుందని గుర్తిం చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పౌరసరపరాల సంస్థ అధికారి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు మిల్లు యజమాని వీణపై మంగళవారం రాత్రి కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

# పెబ్బేర్ పుర ఎన్నికల్లో 33 నామినేషన్లు దాఖలు

**పెబ్బేరు జనవరి 29 (జనంసాక్షి):** పెబ్బేరు పుర ఎన్నికల్లో గురువారం 33 నామినేషన్లు దాఖలు అయ్యాయని ఎన్నికల అధికారులు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నుండి 11 బి ఆర్ ఎస్ 7 బి ఎస్ పి 9 బిజెపి 1 ఇండిపెండెంట్ 2 చొప్పున 33 నామినేషన్లు దాఖలు అయ్యాయని వివరించారు. శుక్రవారం చివరి రోజు కావడంతో భారీగా నామినేషన్లు వచ్చే అవకాశం ఉందని స్పష్టం చేశారు..

# మున్సిపల్ ఎన్నికల నామినేషన్‌కు కట్టుదిట్టమైన భద్రతా

### జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



**మక్తల్, (జనంసాక్షి) :** మక్తల్ మున్సిపాలిటీలలో నామినేషన్‌కు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. మక్తల్ 16 మున్సిపాలిటీ వార్డులకు సంబంధించి జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో భాగంగా గురువారం రెండవ రోజు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మక్తల్ మున్సిఫల్ నామినేషన్ కేంద్రాన్ని సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన భద్రతా, బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలు పూర్తిగా శాంతియుత, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించడమే పోలీస్ శాఖ ముఖ్య లక్ష్యం అని తెలిపారు. ఎన్నికల సమయంలో అక్రమంగా డబ్బు, మద్యం, ఇతర విలువైన వస్తువులు రవాణా, సరఫరా చేయరాదని, ఒకవేళ చేస్తే వాటిని ఎన్నికల నిబంధనల మేరకు సీజ్ చేయడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. ఎన్నికలలో పాల్గొనే వివిధ రాజకీయ పార్టీల నాయకులు ర్యాలీలకు , వాహనాల మైక్ పర్మిషన్లు డిఎస్పి ద్వారా ముందస్తు పర్మిషన్ తీసుకోవాలని తెలిపారు. నామినేషన్ కేంద్రాల వద్ద సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ (144సిఆర్‌పిసి)అమలులో ఉన్నదని, అలాగే నామినేషన్ కేంద్రానికి 200 మీటర్ల దూరంలో వాహనాలు ఉండాలని, 100 మీటర్ల పరిధిలో ప్రజలు గుంపులు గుంపులుగా ఉండరాదు అని స్పష్టం చేశారు. నామినేషన్ కేంద్రాల్లో ప్రవేశించే వ్యక్తుల సంఖ్య ఎన్నికల నిబంధనల ప్రకారం ఒక అభ్యర్థికి ఒకరు లేదా ఇద్దరు మాత్రమే ఉండాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రజలు, ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు తప్పనిసరిగా పాటించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. ఈ పరిశీలనలో స్థానిక అధికారులు మక్తల్ సీఐ రామ్ లాల్, ఎస్సై నరేష్, ఎస్ఐ లు భాగ్య లక్ష్మి రెడ్డి, నవీద్, మున్సిపల్ కమిషనర్ శ్రీరాములు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నేటి నుండి న్యాల్‌కల్ ఉర్స్ ఉత్సవాలు

### వారం రోజుల పాటు జరిగే జాతరోత్సవాలకు ముస్తాబైన దర్గా



**న్యాల్‌కల్, (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలోనే దర్గా ఉత్సవాలకు పెట్టిందే పేరు న్యాల్ కల్ దర్గా జాతర ఉత్సవాలు. వారం రోజుల పాటు జరిగే జాతరకు తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన భక్తులు కుల, మతాల కతీతంగా వేలాదిగ తరలివచ్చి దర్గాను దర్శించుకుని ముక్కులు తీర్చుకుంటారు. మూడున్నర శతాబ్దాలకు పైగా అత్యంత ఘనంగా కొనసాగే దర్గా ఉత్సవాలు ఈ నెల 30 న ప్రారంభమై ఫిబ్రవరి 06 వరకు వారం రోజుల పాటు కొనసాగనున్నాయి. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు యూనిస్ ఖాన్, భక్త మండలి ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా జరగనున్నాయి.

**395వ పీర్ గైబ్ సాహెబ్ ధర్మోత్సవాలు**

395 ధర్గొత్సవాల్లో భాగంగా జనవరి 30, శుక్రవారం నుండి ఫిబ్రవరి 6 వరకు వారం రోజుల పాటు జాతర ఉత్సవాలు జరగను న్నాయి. జనవరి 30న శుక్రవారం రాత్రి కీర్తిశేషులు ఉస్మాన్ పాటిల్ స్వగృహం నుండి గంధం ఊరేగిం పు. 31న కూరగాయల సంత, జహీరాబాద్, ఆందోల్ నియోజక వర్గా ల్లోని వివిధ మండలాలకు చెందిన భక్తుల గంధం ఊరేగింపు. ఫిబ్రవరి 1,2న రెండు రోజులపాటు వేలాది సంఖ్యలో పశువుల సంత. సోమవారం న్యాల్ కల్ లో ఖురేష్ గంధం, రాత్రి ఖవ్వాలి కార్యక్రమం. 3న మంగళవారం ఉదయం అంత రాష్ట్ర కుస్తీ పోటీలు, విజేతలుగా నిలిచిన పలువు రు మల్లయోధులకు నగదు, వెండిని అందజేయనున్నారు. ఫిబ్రవరి 4 బుధవారం కూరగాయల సంత, 5న రాత్రి ఆధ్యాత్మిక కార్యక్రమాలు, 6న భక్తులకు తీర్థ ప్రసాదములు అందజేత, తదితర కార్యక్రమాలు జరగనున్నాయి. దర్గా ఉత్సవాల్లో ఎలాంటి పవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక పోలీసులు, ఉత్సవ కమిటీ భక్తమ ండలి ఏర్పాట్లను సిద్ధం చేశారు.



# పోలీసు స్టేషన్ కు వచ్చే వారితో దూరుసు వద్దు

### జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్




**శివ్వంపేట జనవరి 29 (జనంసాక్షి):** పోలీస్ స్టేషన్ కు వచ్చే వారి పట్ల పోలీస్ సిబ్బంది దూరుసు వ్యవహరించవద్దని జిల్లా అదనపు ఎస్పీ మహేం దర్ స్పష్టం చేశారు. గురువారం శివ్వంపేట పోలీస్ స్టేషన్‌ను జిల్లా అడిషనల్ ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో ఆయన వివిధ కేసులకు సంబంధించి సీజ్ చేసిన వాహనాలు, వాటి నమోదు, భద్రతను ఆయన పరిశీలించారు. పోలీస్ రికార్డుల నిర్వహణ, కేసుల పురోగతి, విధుల నిర్వహణలో పోలీస్ సిబ్బంది పనితీరుపై ఆయన సమీక్ష నిర్వహించారు. స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరితో ప్రేమపూర్వకం గా వ్యవహరించాలని, ఫిర్యాదుల పరిష్కారంలో మరింత వేగం పెంచాలని, గ్రామాలలో రాత్రివేళల్లో పెట్రోలింగ్ చేపట్టాలని ఆయన ఆదేశించారు. భద్రత లో నిర్లక్ష్యం తగదని, ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సాయిలు, హెడ్ కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్ మహేందర్, గట్టయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## అడబిడ్డలు అన్నిరంగాల్లో ముందుండాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ బ్యూరో, జనవరి29 (జనంసాక్షి) :** ఆడబిడ్డలు ఆత్మవిశ్వాసంతో ఆకాశమే హద్దుగా ఎదగాలి అని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా కలెక్టరేట్‌లో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బాలికలు చదువు, ఆటలు, సాంస్కృతిక రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్నారని కొనియాడుతూ, లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. జిల్లాలోని కేజీబీవీలు, వసతి గృహాల్లో విద్యార్థినులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ బాలికలకు చిన్నతనం నుంచే ప్రోత్సాహం అవసరమని అన్నారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. అనంతరం మహిళల సౌకర్యార్థం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన 'బేబీ ఫీడింగ్ రూమ్'ను కలెక్టర్ ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వీట్ హోంలో అపరిశుభ్రతపై మున్సిపల్ అధికారుల కొరడా



**నిర్మల్ బ్యూరో, జనవరి29 (జనంసాక్షి) :** నిర్మల్ పట్టణంలోని ఢిల్లీవాలా స్వీటు హోం లో విక్రయిస్తున్న తినే పదార్థంలో కీటకం ఉందని వినియోగదారుల నుంచి ఫిర్యాదు అందిన నేపథ్యంలో మున్సిపల్ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో ఆహార పదార్థాల నిల్వ, తయారీ విధానాల్లో అపరిశుభ్రత, శానిటేషన్ ప్రమాణాలు పాటించకపోవడం గుర్తించడంతో సంబంధిత స్వీటు హోం యాజమాన్యంపై రూ.5,000 జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు. అలాగే భవిష్యత్తులో పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో శానిటరీ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణంలోని హోటళ్లు, స్వీటు హోంలు, ఆహార విక్రయ కేంద్రాలపై క్రమం తప్పకుండా తనిఖీలు కొనసాగిస్తామని అధికారులు స్పష్టం చేశారు.

## నియమ నిబంధనలు పాటించాలి

- హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్..
- పరకాల పురపాలక సంస్థలో నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్



**హనుమకొండ ప్రతినిధి జనవరి 29 (జనం సాక్షి) :** నామినేషన్ల స్వీకరణ సందర్భంగా ఎన్నికల సంఘం నియమ నిబంధనలను పాటించాలని హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా పరకాల పురపాలక సంస్థలో 22 వార్డులకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పురపాలక సంస్థ కార్యాలయంలో కొనసాగుతుండగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పరిశీలించారు. 11 వార్డులకు ఒకటి చొప్పున మొత్తం 22 వార్డులకు గాను నామినేషన్ల స్వీకరణకు రెండు కౌంటర్లను ఏర్పాటు చేసి అభ్యర్థుల నుండి నామినేషన్లను స్వీకరిస్తుండగా వాటి వివరాలను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పురపాలక కమిషనర్ అంజయ్య, ఇతర అధికారులను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్లు, ఎన్నికల ప్రక్రియకు సంబంధించి సందేహాల నివృత్తి, సహాయం కోసం హెల్ప్ డెస్క్ ఏర్పాటుచేసి రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను అందుబాటులో ఉంచినట్లు కలెక్టర్ కు పురపాలక కమిషనర్ వివరించారు. రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, పోలింగ్ మెటీరియల్, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు, ఈ ప్రక్రియకు సంబంధించిన వివరాలను కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణకు ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నామినేషన్లు, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన సందేహాల నివృత్తికి హెల్ప్ డెస్క్ ల ద్వారా సహకారం అందించాలని అన్నారు. నామినేషన్ల అనంతరం అభ్యర్థులకు గుర్తులు కేటాయింపులో జాగ్రత్త వహించాలని సూచించారు. అధికారులు, రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు కలెక్టర్ పలు సలహాలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పరకాల ఆర్డీవో డాక్టర్ కన్నం నారాయణ, తహసిల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో గోడిశాల రవీందర్ గౌడ్ టిపిఎస్ ఖురేషి, టీపిఓ సందీప్ రెడ్డి, ఏఈ రంజిత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్థంభాల తరలింపు పనులు చేపట్టండి



**వరంగల్ ఎంజీఎం, జనవరి 29(జనంసాక్షి):** విద్యుత్ స్థంభాల తరలింపు పనులు చేపట్టాలని నగర మేయర్ గుండు సుధారాణి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం భద్రకాళి బండ్ పై కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి ప్రత్యక్షం గా పరిశీలించి వేగవంతం గా పూర్తి చేయుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భం గా మేయర్ మాట్లాడుతూ భద్రకాళి బండ్ పై మిగిలి పోయిన సివిల్ పనులతో పాటు, ఎలక్ట్రికల్ పనులను వేగవంతం గా పూర్తి చేయాలని అధికారులకు సూచించి, ర్యాంపు పనులను పార్కింగ్ పనులను మేయర్ కమిషనర్ లు పరిశీలించిన అనంతరం రోడ్డు వైపు ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించేలా ఎన్ పి డి ఎల్ వారితో సమన్వయం చేసుకొని తొలగింపు చేపట్టాలని మేయర్ ఎలక్ట్రికల్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో ఎస్ ఈ సత్యనారాయణ, ఈ ఈ మాధవి లత, డి ఈ రాగి శ్రీకాంత్, ఏ ఈ నరేష్, ఎన్ పి డి సి ఎల్ ఏఈ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# జనసంద్రంగా మారిన మేడారం

- వన దేవతలపై అత్యంత భక్తి, విశ్వాసమే జాతరకు బలం
- తల్లుల దీవెనల కోసం తండోప తండాలుగా రాక
- క్యూ లైన్ లలో బారులు తీరిన భక్తులు
- సమ్మక్క సారలమ్మ దేవతలను దర్శించుకుంటున్న భక్తులు
- మేడారం అభివృద్ధిని చూసి ఆనందం
- భక్తుల భద్రత కోసం భారీ పోలీసు బందోబస్తు



**వరంగల్ బ్యూరో (మేడారం), జనవరి 29 ( జనం సాక్షి) :** భారతదేశంలో కుంభమేళా తరువాత అత్యంత ప్రజాదరణ పొందిన గిరిజన జాతరగా గుర్తింపు పొందిన మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర ఈసారి అపూర్వమైన జనసంద్రాన్ని తలపిస్తోంది. దేశం నలుమూలల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు మేడారానికి తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుంటూ భక్తి పారవశ్యంలో మునిగిపోతున్నారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా గుర్తింపు పొందిన ఈ మహా ఉత్సవం గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రాత్మక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తోంది. మేడారం జాతర అనగానే అది కేవలం ఒక పూజా కార్యక్రమం మాత్రమే కాదు. అది ఆదివాసీ గిరిజన సమాజపు జీవన విధానం, వారి పోరాట చరిత్ర, ప్రకృతితో మమేకమైన సంస్కృతి, వీరవనితల త్యాగ గాథలకు ప్రతిరూపం. సమ్మక్క-సారలమ్మలు గిరిజనులకు ఆరాధ్య దైవాలే కాకుండా, అన్యాయానికి ఎదిరించి పోరాడిన ధైర్యానికి, ఆత్మగౌరవానికి, స్వాతంత్ర్య చైతన్యానికి ప్రతీకలుగా నిలిచారు. అలాంటి అమ్మవార్ల దర్శనం కోసం భక్తులు వందలాది కిలోమీటర్లు ప్రయాణించి, కుటుంబ సమేతంగా మేడారానికి చేరుకుంటున్నారు. ఈసారి జాతరలో భక్తుల సంఖ్య గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు, మహిళలు, పురుషులు అన్న తేడా లేకుండా ప్రతి ఒక్కరూ అమ్మవారి దర్శనం కోసం ఓర్పుతో వస్తున్నారు. భక్తుల నమ్మకం, విశ్వాసం, త్యాగభావమే ఈ జాతరకు ప్రధాన బలంగా మారింది. అడవులు, కొండలు, లోయలు అన్నీ భక్తుల గుడారాలతో నిండిపోయి మేడారం ప్రాంతమంతా ఒక భక్తి క్షేత్రంగా మారింది. గురువారం రాత్రి సమ్మక్క చిలుకలగుట్ట నుంచి గద్దెపైకి రావడం తో జాతర వాతావరణం మరింత ఉత్కంఠభరితంగా మారింది. ఇసుక వేస్తే రాలనంతగా జనంతో నిండిపోయిన ఈ ప్రాంతం ఒక విశాలమైన భక్తి సముద్రంలా దర్శనమిస్తోంది. ఎక్కడ చూసినా "జయ జయ సమ్మక్క-సారలమ్మ" నామస్మరణతో మేడారం అడవులు మారుమోగుతున్నాయి. జంపన్న వాగు నుంచి సుమారు 10 కిలోమీటర్ల పరిధిలో భక్తులు గుడారాలు వేసుకొని రాత్రింబవళు అక్కడే తిష్టవేసి అమ్మవారి దర్శనం కోసం నిరీక్షిస్తున్నారు. వర్షం, ఎండ, చలి అన్న తేడా లేకుండా భక్తులు భక్తిశ్రద్ధలతో అక్కడే ఉండి అమ్మవారి కృప కోసం ప్రార్థనలు చేస్తున్నారు. ఇప్పటికే దర్శనం చేసుకున్న భక్తులు తిరుగు ప్రయాణం కడుతుండగా, కొత్తగా వచ్చే భక్తులతో జాతర ప్రాంగణం నిరంతరం కదలికలో కొనసాగుతోంది. ఈ దృశ్యం మేడారం జాతర వైభవాన్ని మరింత ఉజ్వలంగా ప్రతిబింబిస్తోంది. ఈ నెల 31 వరకు కొనసాగనున్న ఈ మహా జాతరను ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన మహోత్సవంగా అధికారులు పేర్కొంటున్నారు. గిరిజన వీరవనితలైన సమ్మక్క-సారలమ్మల జాతర కావడంతో దీనికి ప్రత్యేకమైన చారిత్రాత్మక, సామాజిక, సాంస్కృతిక ప్రాధాన్యత ఉంది. ఇది తరతరాలుగా కొనసాగుతున్న గిరిజనుల ఆత్మగౌరవానికి, ఐక్యతకు, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోంది. ఆధునిక కాలంలోనూ ఈ జాతరకు లక్షలాది మంది భక్తులు తరలిరావడం ఈ సంప్రదాయం యొక్క బలాన్ని చాటుతోంది. ఇప్పటికే పలువురు ప్రముఖులు, వీఐపీలు అమ్మవార్లను దర్శించుకున్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్కలు మేడారంలోనే మకాం వేసి జాతర ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. వారు వివిధ శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తూ అధికారులకు సూచనలు ఇస్తున్నారు. ప్రభుత్వం అన్ని శాఖలను సమన్వయం చేస్తూ ఈ మహా జాతరకు విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. వైద్య సేవలు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, విద్యుత్ సౌకర్యాలు, రవాణా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, పోలీసు భద్రత వంటి అంశాల్లో ప్రత్యేక దృష్టి సారించారు. జాతర ప్రాంగణం అంతటా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అత్యవసర చికిత్సలు అందుబాటులో ఉంచారు. అంబులెన్సులు, డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది 24 గంటలు సేవలందిస్తున్నారు. తాగునీటి కొరత తలెత్తకుండా వాటర్ ట్యాంకర్లు, తాగునీటి పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పారిశుద్ధ్య సిబ్బంది పగలు రాత్రి తేడా లేకుండా పనిచేస్తూ పరిశుభ్రతను కాపాడుతున్నారు. భక్తుల సహకారం కూడా ఈ మహా జాతర విజయానికి కీలకంగా మారిందని పేర్కొన్నారు. క్రమశిక్షణతో, ఓర్పుతో దర్శనం చేసుకుంటున్న భక్తులను అధికారులు ప్రశంసించారు. సమ్మక్క-సారలమ్మ మహా జాతర భక్తి, విశ్వాసం, సంస్కృతి, చరిత్ర అన్నింటినీ ఏకతాటిపైకి తెచ్చే మహా ఉత్సవం. ఇది కేవలం ఒక మతపరమైన కార్యక్రమం మాత్రమే కాకుండా గిరిజన సమాజపు సామూహిక గుర్తింపుకు, వారి చరిత్రకు, వారి పోరాట స్ఫూర్తికి ప్రతీకగా నిలుస్తోంది. లక్షలాది భక్తుల నమ్మకం, త్యాగం, ఓర్పుతో మేడారం మరోసారి దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపును సాధిస్తోంది. గిరిజన సంస్కృతికి గర్వకారణంగా నిలుస్తున్న ఈ మహా జాతర జనసముద్రంగా మారి చరిత్ర సృష్టిస్తోంది అని చెప్పవచ్చు. ఈసారి ప్రభుత్వం 250 కోట్లకు పైగా అభివృద్ధి పనులు మేడారంలో చేయడంతో జాతరకు వచ్చిన భక్తులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## ఏరులై పారుతున్న మద్యం

- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- మహారాష్ట్రకు అక్రమ రవాణా



**చింతలమానేపల్లి జనవరి 29 (జనం సాక్షి) :** మండలంలో అక్రమ మద్యం తరలింపు వ్యవహారం రోజురోజుకూ తీవ్రరూపం దాలుస్తోంది. మండలంలోని రవీంద్రనగర్ శ్రీనివాస మద్యం దుకాణం నుంచి మిట్ట మధ్యాహ్నం పూటనే ప్యాసింజర్ ఆటోలో మద్యం అక్రమంగా తరలిస్తూ, మండల కేంద్రం నుంచి గూడెం ప్రధాన రహదారి మీదుగా బహిరంగంగానే రవాణా కొనసాగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రధాన రహదారులపై ఇలాంటి అక్రమ రవాణా నిర్బంధం లేకుండా సాగుతుండటంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇప్పటికే గూడెం మద్యం దుకాణం సీజ్ చేసి ఉన్నప్పటికీ, అదే అవకాశంగా మలుచుకున్న అక్రమ మద్యం మాఫియా గూడెం ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకొని తమ దందాను విస్తరిస్తోంది. గూడెం నుంచి మద్యం నిల్వలను మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలకు తరలించి అక్కడ అధిక ధరలకు అమ్ముతూ భారీగా అక్రమ లాభాలు గడిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్యాసింజర్ ఆటోలు వంటి సాధారణ వాహనాలను వినియోగించడం ద్వారా అధికారుల దృష్టిని మళ్లించి నిర్బంధం తప్పించుకుంటున్నారని చెబుతున్నారు. అక్రమ మద్యం రవాణా పగటి పూటనే సాగుతున్నా, ఎక్సైజ్ శాఖ సిబ్బంది పర్యవేక్షణ పూర్తిగా కనిపించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. చెక్‌పోస్టులు, నిఘా వ్యవస్థలు ఉన్నాయా? అన్న ప్రశ్నలు ప్రజల్లో వెల్లువెత్తుతున్నాయి. ఈ అక్రమ దందా వెనుక ఎవరైనా అధికారుల మౌన సహకారం ఉందా అనే సందేహాలు కూడా తలెత్తుతున్నాయి. ఈ అక్రమ మద్యం కారణంగా మండలంలోని యువత వ్యసనాలకు బానిసలవుతుండగా, గ్రామీణ శాంతిభద్రతలకు ముప్పు ఏర్పడుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి భారీగా ఆదాయ నష్టం కలుగుతుండటంతో పాటు, సమాజ భవిష్యత్తుపై కూడా ప్రతికూల ప్రభావం పడుతోందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, అక్రమ మద్యం తరలింపు నెట్‌వర్క్‌ను గుర్తించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. గూడెం-మహారాష్ట్ర సరిహద్దు మార్గాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, పగటి పూట జరుగుతున్న ఈ అక్రమ దందాకు శాశ్వతంగా అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

## మున్సిపల్ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహిస్తాం

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ రూరల్, జనవరి 29 (జనంసాక్షి) :** మున్సిపల్ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై గురువారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు,సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలను నిష్పక్షపాతంగా పారదర్శకంగా పూర్తి చేస్తామని వెల్లడించారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎన్నికల గూర్చి అవసరమైన సమాచారం ఎప్పటిక ప్పుడు అందిస్తూ ఉంటామని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణపై వారికి ఏమైనా సందేహాలు ఉన్నాయేమో అని అడిగారు. ఎటువంటి సందేహాలు ఉన్న తమను సంప్రదించవచ్చునని తెలిపారు. ఎన్నికల ప్రక్రియను మొత్తం సజావుగా పూర్తి చేసేందుకు అన్ని రాజకీయ పార్టీల సహకారం అవసరమని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు శ్రావణ్ రెడ్డి, మజార్, ఇంతియాజ్,సిరికొండ రమేష్, గంద్రత్ రమేష్,హైదర్,నరేష్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## కొనలేం... తినలేం..!

- వామ్మో...మేడారంలో ఏవి కొనాలన్నా రూ. 500 లకు పై మాటే...

**మంగపేట/మేడారం జనవరి 29(జనంసాక్షి) :** ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరైన తెలంగాణ కుంభమేళ మేడారం సమ్మక్క సారలమ్మల జాతర. ఈ జాతరలో భక్తులు ఏది కొనాలన్నా ధరలు బగ్గుమంటున్నాయి. ఈ కోవలోనే సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే పుచ్చకాయ ధరలను చూస్తే కొనలేం...తినలేం అనే విధంగా మారింది. జాతర లో ఒక్క పుచ్చకాయను కొనాలంటే వాటి ధర రూ.500 ల పై మాటే... జాతర లో వాటిని చూడగానే వామ్మో.. పుచ్చకాయా అంటూ భక్తులు జంకుతున్నారు.

## మేడారం జాతర సందర్భంగా నేడు విద్యాసంస్థలకు సెలవు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి



**వరంగల్ ప్రతి నిధి, జనవరి 29 (జనం సాక్షి):** మేడారం మహాజాతర సందర్భంగా ఈ నెల 30వ తేదీ (శుక్రవారం) జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రభుత్వేతర విద్యా సంస్థలకు స్థానిక సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రకటనలో తెలిపారు. ఈ స్థానిక సెలవుకు బదులుగా ఫిబ్రవరి 14వ తేదీ (రెండో శనివారం)ను పనిదినంగా పరిగణించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు, విద్యా సంస్థల యాజమాన్యాలు ఈ విషయాన్ని గమనించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

## వాహనదారులపై కేసులు

**మహబూబాబాద్ బ్యూరో, జనవరి 29(జనం సాక్షి):** రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని మహబూబాబాద్ పట్టణంలో హెల్మెట్ లేని వాహనదారులపై 15 కేసులు మరియు సరైన పత్రాలు లేని పాఠశాల పిల్లల ఆటోల పై 4 కేసులు నమోదు చేసి సీజ్ చేసారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సాయి చరణ్, ట్రాఫిక్ ఎస్సై అరుణ్ కుమార్ మాట్లాడుతూ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు ఈ నెల 1 నుండి 31 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ప్రతీ ఒక్కరు బాధ్యతయూతంగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రవాణా సంస్థ సిబ్బంది వెంకట్ రెడ్డి, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# నేటి సాయంత్రం 5 గంటల వరకే నామినేషన్ల స్వీకరణ

- 31న నామినేషన్ల పరిశీలన, అభ్యర్థుల జాబితా ప్రకటన
- రిటర్నింగ్ అధికారులు నామినేషన్ల స్వీకరణలో అప్రమత్తంగా వ్యవహరించాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, జనవరి 29 (జనంసాక్షి) :** మున్సిపల్ కార్పొరేషన్ మున్సిపాలిటీలకు నేటి సాయంత్రం ఐదు గంటల లోపు నామినేషన్ స్వీకరించడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. గురువారం నాడు మంచిర్యాల జిల్లా నస్పూర్ లోని కలెక్టర్ కార్యాలయంలో సమావేశ మందిరంలో నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి.అన్వేష్, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్ లతో కలిసి సందర్శించి నామినేషన్ల ప్రక్రియ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ... నామినేషన్ల ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని, రిటర్నింగ్ అధికారులు నామినేషన్ల స్వీకరణలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లకు సంబంధించి అభ్యర్థుల నుండి నామినేషన్లు స్వీకరించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. అభ్యర్థుల నామినేషన్ పత్రాలను ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి నిర్ణీత సమయంలోగా స్వీకరించాలని, 30వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా నామినేషన్ స్వీకరణ కేంద్రంలో ఉన్న వారి నుండి నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని, సమయం ముగిసిన తర్వాత వచ్చిన వారిని అనుమతించడం జరగదని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ కొరకు టేబుళ్లు ఏర్పాటు చేయడం జరిగిందని, నామినేషన్ దరఖాస్తులు నింపడం, జతపరచవలసిన పత్రాలు, ఇతర వివరాల కొరకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. నామినేషన్ దరఖాస్తులు పూర్తి చేసిన అభ్యర్థులు హెల్ప్ డెస్క్ వద్ద పరిశీలించుకుని సరైన నామినేషన్లు దాఖలు చేయాలని తెలిపారు. 31వ తేదీన నామినేషన్లు పరిశీలించి అర్హత గల అభ్యర్థుల జాబితా ప్రకటన, ఫిబ్రవరి 1వ తేదీన నామినేషన్లపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణ, 2వ తేదీన అభ్యంతరాలు, ఫిర్యాదుల పరిష్కారం, 3వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా ప్రకటన జరుగుతుందని తెలిపారు. ఫిబ్రవరి 11వ తేదీన పోలింగ్, 12వ తేదీన రీపోలింగ్ (ఏమైనా ఉన్నట్లయితే), 13వ ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి గెలుపొందిన అభ్యర్థుల ప్రకటన జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ నం.08736-250501 ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికల సంబంధించిన సమాచారం, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన పై ఫిర్యాదుల కొరకు సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ సమరం... త్రిముఖ పోరులో గెలుపెవరిది ?

- అధికార పార్టీకి ప్రతిష్టాత్మకంగా మారిన పుర పోరు
- సర్వేల ఆధారంగానే టికెట్లు.. రెబల్స్ భయంతో... బుజ్జగింపులు
- పట్టు కోసం కాంగ్రెస్ బీ.ఆర్.ఎస్, బీజేపీ వ్యూహాలు
- కొనసాగుతున్న నామినేషన్ల పర్వం.. ఆశావహుల ఉత్కంఠ




**చండూరు జనవరి 29 (జనంసాక్షి):** రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ దృష్టిని ఆకర్షించిన మునుగోడు నియోజకవర్గ పరిధిలోని 'చండూరు' మున్సిపాలిటీలో ఎన్నికల వేడి తారస్థాయికి చేరింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, పార్టీ గుర్తులపై జరుగుతున్న మొట్టమొదటి స్థానిక సంస్థల ఎన్నికలు ఇవే కావడంతో... ఈ పోరును ప్రధాన రాజకీయ పక్షాలు 'డూ ఆర్ డై' అన్నట్లుగా... భావిస్తున్నాయి.సాధారణంగా రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే స్థానిక సంస్థల్లో ఆ పార్టీ హవానే నడుస్తుందనేది ఒక సెంటిమెంట్. అయితే, చండూరులో పరిస్థితి భిన్నంగా ఉంటుంది.అందుకే అత్యంత ఆసక్తికరంగా మారింది. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం కావడంతో, తమ పాలనపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని నిరూపించుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ పై ఉంది. అందుకే ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది.గతంలో చండూరు మున్సిపాలిటీలో హస్తం జెండా (కాంగ్రెస్) ఎగిరింది. అధికారం కోల్పోయినప్పటికీ, తమ పట్టు ఇంకా సడలలేదని నిరూపించుకోవడానికి బీఆర్ఎస్ ఈ ఎన్నికలను వేదికగా మలుచుకుంటోంది.కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలోనూ బలపడాలని చూస్తోంది. మునుగోడు ఉపఎన్నికల సమయంలో పెరిగిన ఓటు బ్యాంకును ఈ మున్సిపల్ ఎన్నికల్లో సీట్లుగా మార్చుకోవాలని వ్యూహాలు రచిస్తోంది.బుజ్జగింపుల పర్వం అధికార పార్టీ కావడంతో కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశిస్తున్న వారి సంఖ్య భారీగా ఉంది. ఒక్కో వార్డు నుంచి ఇద్దరు, ముగ్గురు అభ్యర్థులు పోటీ పడుతున్నారు.వార్డుల వారీగా వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తూ... పార్టీ అధిష్టానం ప్రత్యేక సర్వేలు చేయించింది. ఎవరికైతే గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉంటాయో, వారికే టికెట్ ఇస్తామని తేల్చి చెప్పింది.టికెట్ దక్కని వారు అసంతృప్తితో రెబల్ అభ్యర్థులుగా బరిలోకి దిగితే మొదటికే మోసం వస్తుందని గ్రహించిన నాయకత్వం, ఇప్పటి నుంచే అసంతృప్తులను బుజ్జగించే పనిలో నిమగ్నమైంది. ఎన్నికల నోటిఫికేషన్‌కు కొద్ది రోజుల ముందు నుంచే స్థానిక ఎమ్మెల్యే, ముఖ్య నాయకులు చండూరులో సుడిగాలి పర్యటనలు చేశారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడం, కుల సంఘాల భవనాలకు ప్రొసీడింగ్ కాపీలు అందజేయడం, ప్రజలకు హామీలు ఇవ్వడం ద్వారా ఓటర్లతో మమేకమ య్యారు.మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు కోసం బీజేపీ సీనియర్ నాయకులను ఇన్‌చార్జిలుగా నియమించింది.ఆశావహులు, ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించింది. అయితే, ఈ కీలక సమావేశానికి కొందరు ముఖ్య నేతలు గైర్హాజరు కావడం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అయినప్పటికీ ఎన్నికల ఇన్‌చార్జ్ ఆశావహులతో విడివిడిగా చర్చలు జరిపారు.గతంలో గెలిచిన సిట్టింగ్ కౌన్సిలర్లతో పాటు, కొత్త ముఖాలకు కూడా అవకాశం ఇవ్వాలని బీఆర్ఎస్ యోచిస్తోంది. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమైంది.బుధవారం నుంచి నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుంది. కానీ,గురువారం వరకు ఏ పార్టీ కూడా తమ అభ్యర్థుల జాబితాను అధికారికంగా ప్రకటించలేదు.రిజర్వేషన్లు ఖరారైనప్పటికీ... నామినేషన్ల పర్వం కొనసాగుతున్నపటికీ.. అభ్యర్థుల ఎంపికపై పార్టీలు ఇంకా కసరత్తు చేస్తూనే ఉన్నాయి.మున్సిపల్ చైర్మన్ గిరిని ఆశిస్తున్న ముఖ్య నేతలు, ద్వితీయ శ్రేణి నాయకులు తమకే టికెట్ దక్కాలని అధిష్టానం వద్ద పడిగాపులు కాస్తున్నారు. విజయావకాశాలు ఉంటేనే టికెట్లు దక్కే పరిస్థితి ఉండటంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. రాజకీయ చైతన్యం కలిగిన చండూరు ఓటర్లు ఎవరి వైపు మొగ్గు చూపుతారన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. "అధికార పార్టీకే పట్టం" అనే సంప్రదాయం కొనసాగుతుందా...? లేక ప్రతిపక్షాలు అధికార పార్టీకి షాక్ ఇస్తాయా...? అన్నది ఫలితాలు వస్తే కానీ తెలియదు. మొత్తానికి చండూరు మున్సిపల్ ఎన్నికలు మాత్రం నువ్వా...నేనా... అన్నట్లు రసవత్తరంగా సాగడం ఖాయంగా కనిపిస్తోంది.

# పకడ్బందీ ఏర్పాట్లతో మున్సిపాలిటీల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ

- జిల్లాలో ప్రశాంతమైన వాతావరణంలో నామినేషన్ల ఘట్టం
- ఎన్నికల విధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం రూరల్, జనవరి 29 (జనంసాక్షి):** ఎన్నికల నియమ, నిబంధనల ప్రకారం అప్రమత్తంగా ఉంటూ విధులు సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో గురువారం ఖమ్మం రూరల్ మండల ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఏదులాపురం మున్సిపాలిటీ వార్డుల నామినేషన్ స్వీకరణ కేంద్రాలను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తనిఖీ చేశారు. అభ్యర్థులు సమర్పించిన నామినేషన్ పత్రాలను పరిశీలించారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చిన అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, హెల్ప్ డెస్క్‌లో అన్నిరకాల ఫామ్స్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికల నియమ, నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ నామినేషన్ల ప్రక్రియ సజావుగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.... ఎన్నికల నిర్వహణలో నామినేషన్లు కీలక ఘట్టమని, నామినేషన్ పత్రాలలో ప్రతి అంశాలు సరిగా ఉన్నాయో, లేవో జాగ్రత్తగా నిబంధనల ప్రకారం చూడాలని తెలిపారు. జిల్లాలోని ఏదులాపురం, వైరా, కల్లూరు, మధిర, సత్తుపల్లి ఐదు మున్సిపాలిటీ లలో నామినేషన్లు దాఖలు ప్రక్రియ సజావుగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ కు విధిగా కొత్త బ్యాంక్ ఖాతా తీసుకునే విధంగా వారికి తెలియజేయాలని సూచించారు. వార్డు సభ్యుడు పోటీ కోసం అదే వార్డు సభ్యుడు ప్రపోజర్ గా ఉండాలని అన్నారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అప్పీళ్ళ పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటీ చేసే అభ్యర్థుల ప్రకటన పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల్లో పోటీచేయు అభ్యర్థులకు సంబంధించిన కరపత్రాలు, గోడ పత్రాలు, ప్రచార వాహనాల అనుమతులను తీసుకోవాలంటే సంబంధిత అధికారులను సంప్రదించాలని తెలిపారు. వార్డు సభ్యుల నామినేషన్ దాఖలును రోజుగా నమోదు చేయాలని అన్నారు. అభ్యర్థుల యొక్క అన్ని వివరాలు నామినేషన్ పత్రాలలో నమోదు చేసేందుకు అవగాహనకు హెల్ప్ డెస్క్‌లో నివృత్తి చేసుకోవచ్చని, ప్రతి చిన్న అంశాన్ని, అనుమానాలకు తావులేకుండా పూర్తి స్థాయిలో తెలుసుకోవాలని వివరించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి లోబడి మున్సిపల్ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా పగడ్బం ఎన్నికలు నిర్వహించుటకు అధికారులు సమన్వయంతో క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఖమ్మం రూరల్ మండల తహసీల్దారు రాం ప్రసాద్, ఏదులాపురం మున్సిపల్ కమీషనర్ మున్వర్ అలీ, ఎంపిడీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సొంత గూటికి చేరిన మాజీ కౌన్సిలర్

**కాంగ్రెస్‌కి ఎదురుదెబ్బ.. బీఆర్ఎస్ లోకి చేరిన అన్నేపాక శ్రీనివాస్**



**హాలియా, జనవరి 29 (జనంసాక్షి):** హాలియా పట్టణం 6వ వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్ అన్నేపాక శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి భారత రాష్ట్ర సమితిలో చేరారు. నాగార్జునసాగర్ నియోజకవర్గ ఇంచార్జి, మాజీ శాసనసభ్యుడు నోముల భగత్ కుమార్ సమక్షంలో గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ కోటి రెడ్డి, మున్సిపాలిటీ ఎన్నికల సమన్వయకర్త తిప్పన విజయ సింహ రెడ్డి, రాష్ట్ర మాజీ ఆప్కాబ్ చైర్మన్ యడవల్లి విజేందర్ రెడ్డి, రాష్ట్ర నాయకుడు సాధం సంపత్ కుమార్ పాల్గొన్నారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలనను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు సూచించారు. రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో పార్టీ విజయానికి సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# బీఆర్ఎస్ హయాంలోనే మున్సిపాలిటీల అభివృద్ధి : నోముల భగత్



**హాలియా, జనవరి 29 (జనంసాక్షి):** నందికొండ, హాలియా మున్సిపాలిటీల్లో కేసీఆర్ హయాంలోనే అభివృద్ధి జరిగిందని నాగార్జున సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. గురువారం నాడు మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో నందికొండ, హాలియా మున్సిపాలిటీల పరిధిలో టీఆర్ఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీల్లో వార్డు వారీగా ఇన్‌చార్జీలను నియమించారు.ఈ సమావేశంలో మాట్లాడిన నోముల భగత్, కాంగ్రెస్ పార్టీ మాయమాటలతో అధికారంలోకి వచ్చిందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఇప్పటివరకు అమలు చేయలేదని విమర్శించారు. మహిళలకు నెలకు రెండువేల ఐదువందల రూపాయలు, వృద్ధులకు నాలుగు వేల రూపాయల పెన్షన్, రైతుబంధు, రైతు బీమా వంటి హామీలను ఎందుకు అమలు చేయలేదని కాంగ్రెస్ నాయకులను ప్రజలు నిలదీయాలని అన్నారు.రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో అభ్యర్థి ఎవరిదైనా కారు గుర్తుకు ఓటు వేసి నందికొండ, హాలియా మున్సిపాలిటీలను కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, సంపత్, టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్, సీపీఎం పొత్తులో పోటీ చేసే అభ్యర్థులను ఆశీర్వదించండి

**మాజీ ఎంపీ నామ**

**వైరా , (జనంసాక్షి) :** ఖమ్మం పార్లమెంట్ నియోజక వర్గంలోని వైరా పట్టణ మున్సిపాలిటీ ఎన్నికల నామినేషన్ల కార్యక్రమంలో ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్, వైరా మున్సిపాలిటీ ఎన్నికల ఇంచార్జి, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌తో కలిసి బీఆర్ఎస్ అభ్యర్థుల నామినేషన్ల కార్యక్రమంలో గురువారం నాడు బీఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ శాసనసభ్యులు బానోత్ చంద్రావతి, సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఎం పార్టీ డివిజన్ సెక్రటరీ వీరభద్రం, నియోజకవర్గ నాయకురాలు బానోత్ మంజుల, బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు, వైరా రూరల్, వైరా జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యులు షేక్ లాల్ మొహమ్మద్ పట్టణ మహిళా అధ్యక్షురాలు బానోత్ సక్కుబాయి, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలను సవ్యంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు

**కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి) :** జిల్లాలో మున్సిపల్ ఎన్నికలను సవ్యంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు.మున్సిపల్ ఎన్నికలపై గురువారం కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 28 నుండి నామినేషన్లను స్వీకరించడం జరుగుతుం దన్నారు.మున్సిపల్ కార్యాలయాల్లో నామినేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశామని,నేటి వరకు నామినేషన్లను స్వీకరించడం జరుగుతుందని తెలిపారు.31న నామినేషన్ల పరిశీలన, ఫిబ్రవరి 3న నామినేషన్ల ఉపసంహరణ, ఫిబ్రవరి 11న పోలింగ్, ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు ఉంటుందని వెల్లడించారు. పార్టీల ఆధారంగా నిర్వహించే ఈ ఎన్నికలలో అభ్యర్థులు పాటించాల్సిన ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఎన్నికల ఖర్చుకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో వివరించడం జరిగిందని పేర్కొన్నారు.రాజకీయ పార్టీలు, పోటీలో ఉన్న అభ్యర్థులు పాటించాల్సిన నియమ నిబంధనలపై వారికి వివరించినట్లు తెలిపారు.బ్యాలెట్ ద్వారా ఓటింగ్ నిర్వహించే మున్సిపల్ ఎన్నికలలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నోడల్ టీములను ఏర్పాటు చేయడమే కాకుండా, ఎఫ్ఎస్టి, ఎస్ఎస్టి ఏర్పాటు చేశామని తెలిపారు.ఈ బృందాలు అన్నిటికి శిక్షణ ఇచ్చామని వెల్లడించారు.జిల్లాలో 226586 మంది ఓటర్లు మున్సిపల్ ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు హుజూర్ నగర్, కోదాడ, నేరేడుచర్ల, సూర్యాపేట, తిరుమలగిరి మున్సిపాలిటీలలో 141 వార్డులలో 372 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.పోలింగ్ కేంద్రాలలో అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఆర్ఓ,ఏఆర్ఓలకు శిక్షణ ఇవ్వడం జరిగిందని ,అలాగే ఎన్నికల సామాగ్రి పంపిణీకి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, సూర్యాపేటలోని శ్రీవెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.పెయిడ్ న్యూస్,ప్రకటనలు, సోషల్ మీడియా న్యూస్ తదితర న్యూస్ పై జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు ముందస్తు అనుమతులు తీసుకోవాలని కోరారు .అడిషనల్ కలెక్టర్ కె.సీతారామరావు ఎన్నికల షెడ్యూల్, నామినేషన్ల సందర్భంగా పాటించాల్సిన నియమ, నిబంధనలు తదితర వివరాలను వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సంబంధాల అధికారి యు.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# రైతులకు భూతగాదాలు లేని మెదక్ జిల్లాగా తీర్చి దిద్దాలి

- పక్కగా భూమి యొక్క నక్ష,మ్యాప్,హద్దుల నిర్ణయం
- పటిష్టంగా భూ రికార్డులు
- భూమి ఆక్రమణలకు తావు లేకుండా భూ భారతి భూ రీసర్వే కార్యక్రమం
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ జిల్లా బ్యూరో, (జనంసాక్షి):** జిల్లాను భూ తగాదాలు లేనీ జిల్లాగా తీర్చిదిదలని, ప్రతి భూ కమతానికి సరైన నక్షను,మ్యాప్ ను, హద్దులను నిర్ణయించి, పటిష్టమైన భూ రికార్డులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. భూ భారతి చట్టం భూముల రీసర్వే కార్యక్రమం కోసం మెదక్ మండలంలోని పైలెట్ గ్రామపంచాయతీ అయిన పాషాపూర్ లో బుధవారం గ్రామసభ నిర్వహించారు.భూ భారతి చట్టం భూముల రీసర్వే కోసం నిర్వహించిన గ్రామ సభలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్,అదనపు కలెక్టర్ నగేష్, తహసిల్దార్ లక్ష్మణ్ బాబు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ..భూ భారతి చట్టం ద్వారా అన్ని భూ సమస్యల పరిష్కారం అవుతుం దని తెలిపారు.పాషాపూర్ గ్రామంలో భూ భారతి చట్టం భూముల రీసర్వే కార్యక్రమం నిర్వహించుకో వడనికి గ్రామ సభ ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. భూ భారతి భూముల రీసర్వే కార్యక్రమం ముఖ్య ఉద్దేశం రైతులకు పక్కగా భూ హద్దులు, భూమి యొక్క నక్ష, మ్యాప్ లను నిర్ణయించి, పటిష్టమైన భూ రికార్డులను తయారు చేయడమే అని అన్నారు. ప్రతి కమతానికి రీసర్వే చేసి రైతులకు భూ తగాదాలు లేకుండా చూడడమే దీని ముఖ్య ఉద్దేశం అని అన్నారు. డిజిటల్ సర్వే తో హద్దుల నిర్ణయించి ,అక్షాంశ రేఖాంశాలతో సర్వే చేయడం జరుగుతుందన్నారు. ఈ సర్వే తో భూ హద్దులు చెరిగి పోకుండా ఉంటాయని, భూమి ఆక్రమణలకు గురి కాకుండా ఉం టుంద న్నారు. ఈ రీసర్వే అనంతరం రైతులు భూమిని ఎక్కడకు వెళ్లిన లేదా విదేశాల్లో సైతం తన భూమిని పరిశీలించుకోవచ్చని తెలిపారు.తర్వాత రోజుల్లో ఈ గ్రామాన్ని నమూనాగా తీసుకొని జిల్లాలోని మరో 23 గ్రామాల్లో భూ భారతి భుముల రీసర్వే చేసి సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న భూములాన్ని రీసర్వే చేసి భూమి సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్... ప్రజలు, అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# కుక్కలను చంపడం చట్టరీత్యా నేరం

- కుక్కల నివారణకు స్టెరిలైజేషనే ఉత్తమ మార్గం
- పశువైద్యాధికారి, డాక్టర్ నరేష్



**తుంగతుర్తి జనవరి 29 (జనంసాక్షి):** వీధి కుక్కలను చంపడం చట్టరీత్యా నేరమని వాటి సంఖ్యను తగ్గించడానికి నివారణకు స్టెరిలైజేషన్ ఉత్తమ మార్గమని పశువైద్యాధికారి డాక్టర్ నరేష్ అన్నారు, గురువారం మండల పరిధిలోని వెలుగుపల్లి మరియు వెంపటి గ్రామాలలో కుక్కల సామూహిక హత్య నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుక్కలను చంపడం ఐపిసి 428/429 ప్రకారం శిక్షర్హం అని అన్నారు, వీధి కుక్కల సంఖ్యను తగ్గించడానికి స్టెరిలైజేషన్ (నిస్సంతా నీకరణ ) ఉత్తమమైన మార్గం కావున గ్రామపంచాయతీలు, ఎన్జీవోలు దాతల సహకారంతో గ్రామాలలో నిస్సంతానీకరణ చేయాలని ముందుకు వస్తే మా పశువైద్య శాఖ తరుపున చేస్తామని చెప్పారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి కుక్కలకు పిచ్చి లేవకుండా రేబిస్ టీకాలు వేయించుకోవాలి అన్నారు,వీధి కు క్కలలో గజ్జి నివారణకు ఐవర్ మెక్టిన్ అనే టాబ్లెట్ వాడడం వలన నివారిం చవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగుపల్లి గ్రామ సర్పంచ్ సోలి పురం అశ్విని కన్నా రెడ్డి, ఉప సర్పంచ్ పసునూరి సాయికుమార్, గ్రామ పం చాయతీ సెక్రెటరీ, సిబ్బంది, పాటు ఎల్ఎస్ ఏ రాజశేఖర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వీరేంద్ర చౌదరికి 'రవీంద్రనాథ్ ఠాగూర్ నేషనల్ డైరెక్టర్స్ అవార్డు-2026



**ఖమ్మం, (జనంసాక్షి) :** విద్యారంగంలో విశేష సేవలందిస్తున్న త్రివేణి టాలెంట్ స్కూల్స్ డైరెక్టర్ డాక్టర్ జి.వీరేంద్ర చౌదరికి ప్రతిష్టాత్మకమైన 'రవీంద్రనాథ్ ఠాగూర్ నేషనల్ డైరెక్టర్స్ అవార్డు--2026' లభించింది. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ధృవీకరించిన ఈయూ మీడియా ఆధ్వర్యంలో బెంగళూరులో నిర్వహించిన 'ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ కాంక్లేవ్' కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ఆయనకు అధికారికంగా ప్రదానం చేశారు. విద్యాబోధనలో వినూత్న పద్ధతుల ను ప్రవేశపెట్టి, విద్యార్థుల సమగ్ర వికాసమే లక్ష్యంగా త్రివేణి విద్యా సంస్థలు చేస్తున్న నిరంతర కృషిని గుర్తిస్తూ ఈ అవార్డును అందజేశారు. త్రివేణి టాలెం ట్ స్కూల్స్ ద్వారా ఐఐటి, నీట్ ఫౌండేషన్ కోర్సులలో నాణ్యమైన విద్యను అందిస్తూ వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాదిని వేస్తున్నా రు. ఈ సందర్భంగా డాక్టర్ జి. వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ....విద్యార్థులను కేవలం విద్యలోనే కాకుండా, క్రమశిక్షణ, విలువలు, నైపుణ్యాలతో కూడిన ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే త్రివేణి విద్యాసంస్థల లక్ష్యం అని తెలిపారు. ఈ గౌరవం లభించడంపై త్రివేణి టాలెంట్ స్కూల్స్ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ డైరెక్టర్ డాక్టర్ జి. వీరేంద్ర చౌదరికి అభి నందనలు తెలిపారు.

# యూరియా యాప్ వినియోగంపై రైతులకు అవగాహన



**ఖమ్మం రూరల్,జనవరి 29 (జనంసాక్షి):** రైతుల సౌక ర్యార్థం ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'యూరియా యాప్' పని తీరుపై మండల వ్యవసాయ అధికారి ఉమా నగేశ్ ఖమ్మం రూరల్ మండలంలో ఏం వి పాలెం గ్రామంలో రైతులకు క్షేత్రస్థా యిలో అవగాహన కల్పించారు. నేటి నుంచి యూరియా యాప్ పూర్తి స్థాయిలో రైతులకు అందుబాటులో ఉంటుందని తెలియజేసినారు. ఈ సందర్భంగా ఆయన యాప్ వినియోగించే విధానాన్ని రైతులకు వివరించారు.

**యాప్ పనితీరు – ముఖ్య అంశాలు:**

**సులభతర లాగిన్:**
రైతు తన ఫోన్ నెంబర్‌ను యాప్‌లో నమోదు చేయగానే వచ్చే ఓటీపీ ద్వారా లాగిన్ అవ్వవచ్చు. లాగిన్ అయిన వెంటనే రైతుకు సంబంధించిన పూర్తి వివరాలు అందులో కనిపిస్తాయి.

**పంట ధ్రువీకరణ:**
రైతులు తాము సాగు చేస్తున్న పంట వివరాలను యాప్‌లో ధ్రువీకరించాల్సి ఉంటుంది.

**యూరియా కోటా:**
పంట రకాన్ని బట్టి రైతుకు విడతల వారిగా యూరియా బస్తాలు వివరాలను యాప్ స్వయంచాలకంగా లెక్కిస్తుంది.

**స్లాట్ బుకింగ్:**
రైతులకు అందుబాటులో ఉన్న ఎరువుల డీలర్ షాపుల జాబితా యాప్‌లో కనిపిస్తుంది. రైతులు తమకు నచ్చిన షాపును ఎంచుకుని, బుక్ చేసుకోవచ్చు. కౌలు రైతులు కూడా పట్టదారులతో ధృవీకరణ చేసుకున్న పిదప యూరియా బస్తాలను స్లాట్ బుక్ చేసుకోవచ్చని తెలియజేసినారు. యూరియా లభ్యత మేరకు సమీప కొనుగోలు కేంద్రాల ద్వారా ,రైతులు తమ ఆధార్ కాపీతో పాటు బుకింగ్ చూపించడం ద్వారా పొందవచ్చని తెలియ జేసినారు.

**అధికారుల సూచన:**
ఈ యాప్ ఎంతో సులభంగా ఉంటుందని, రైతులు క్యూ లైన్లలో వేచి ఉండాల్సిన అవసరం లేకుండా తమకు కావలసిన యూరియాను బుక్ చేసుకుని సులువుగా పొందవచ్చని ఉమా నాగేశ్ తెలిపారు. ఎరువుల పంపిణీలో పారదర్శకత పెంచడానికి ఈ యాప్ దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. కాగా రైతులు 235 యూరియా బస్తాలు మొబైల్ యాప్ ద్వారా బుక్ చేసుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు వంశీ, ఆదర్శ్, నజ్మా కౌసర్, కావ్య, హిమబిందు , సొసైటీ బాధ్యులు అశోక్, నాగరాజు ,స్థానిక రైతులు పాల్గొన్నారు.

## గుర్రంపోడులో భారీ అగ్నిప్రమాదం

# ఎస్.ఎల్.ఎన్ ట్రేడర్స్ పూర్తిగా దగ్ధం

- ఘటనా స్థలంలో అధికారుల పంచనామా
- బాధితుడికి ప్రభుత్వ సాయం అందేలా చూస్తామని హామీ



**గుర్రంపోడు, జనవరి 29, (జనంసాక్షి):** నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండల కేంద్రంలో బుధవారం రాత్రి భారీ అగ్నిప్రమాదం సంభవించింది. దేవరకొండ ప్రధాన రహదారిపై ఉన్న వద్దిరెడ్డి వెంకటరెడ్డికి చెందిన వ్యాపార సముదాయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి ఆస్తి నష్టం వాటిల్లింది.బుధవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో దుకాణంలో మంటలు అంటుకున్నా యి. ఈ ప్రమాదంలో షాపులో ఉన్న ఫర్నిచర్, ఏసీలు, ఫ్రిజ్‌లు, ఫ్యాన్లు , ఇంట్లోని సామాగ్రి పూర్తిగా దెబ్బతిన్నాయి.

సుమారు మూడు లక్షల రూపాయల మేర ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు .ప్రమాద తెలుసు కు న్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నజీర్, పంచాయతీ అధికారి పురుషోత్తం గురువారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకున్నారు. దగ్ధమైన సామాగ్రిని పరి శీలించి, జరిగిన నష్టంపై పంచ నామా నిర్వ హి ంచారు. ప్రభుత్వ పరంగా బాధితుడికి సహాయం అందేలా చూస్తామని అధికారులు పేర్కొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలి

**కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నంద్ లాల్ పవార్**



**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):** మున్సిపల్ ఎన్నికలలో భాగంగా పోలింగ్‌ను సజావుగా నిర్వహించే బాధ్యత ప్రిసైడింగ్ అధికారులపై ఉందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో మున్సిపల్ ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులకు ఉద్దేశిం చి ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరై మాట్లాడుతూ జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలను విజయవంతం చేసినట్లుగానే, మున్సిపల్ ఎన్నికలను అదే స్ఫూర్తితో విజయవంతం చేయాలని కోరారు.ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలన్నారు. బ్యాలెట్ బాక్స్‌ల ప్రారంభం, పిఓ డైరీ తదితర అన్ని అంశాలపట్ల పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కడ తప్పులకు ఆస్కారం ఇవ్వవద్దని తెలిపారు.పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు ఓడి సౌకర్యం కల్పిస్తామని వెల్లడించారు.అదనపు కలెక్టర్ కె.సీతారామ రావు మాట్లాడారు.ఈ సమావేశంలో ట్రైనింగ్ నోడల్ అధికారి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ రెడ్డి, డిటిఓ, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.




# ఛార్జింగ్ కష్టాలకు చెక్..

### 10,001 ఎంఏహెచ్ బిగ్ బ్యాటరీ, క్రేజీ ధరతో రియల్‌మి కొత్త ఫోన్

**న్యూఢిల్లీ:**మొబైల్ ఫోన్ ఛార్జింగ్ కష్టాలకు చెక్ పెట్టేలా రియల్‌మి సరికొత్త స్మార్ట్‌ఫో న్‌ను భారతీయ మార్కెట్‌లోకి విడుదల చేసింది. గత కొంతకాలంగా మొబైల్ కంపెనీలు బిగ్ బ్యాటరీ ఫోన్లను అందుబాటులోకి తీసుకొస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడు వాటన్నింటినీ వెనక్కి నెట్టేలా తొలిసారి 10,001 ఎంఏహెచ్ బ్యాటరీ సామర్థ్యంతో రియల్‌మి పీ4 పవర్ మోడల్‌ను విడుదల చేసింది. దీని ధర, ప్రత్యేకతలు ఏంటి?రియల్‌మి పీ4 పవర్ 6.8 అంగుళాల ఫుల్ హెచ్‌డీ+ అమోలెడ్ 4డీ కర్వ్ డిస్‌ప్లేతో రానుంది. 144హెర్ట్జ్ రిఫ్రెష్ రేటు, 6500 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్, హెచ్‌డీఆర్ సపోర్ట్ ఉంటాయి. పెర్ఫామెన్స్ విషయానికొస్తే ఇందులో 2.6 గిగాహెడ్జ్ ఆక్టాకోర్ మీడియాటెక్ డైమెన్సిటీ 7400 అల్ట్రా ప్రాసెసర్ అమర్చారు. ఐపీ 68, ఐపీ 69, ఐపీ 66 రేటింగ్‌తో డస్ట్, వాటర్ రెసిస్టెన్స్ ఉంది. ఈ ఫోన్‌లో వెనుకవైపు డ్యుయల్ కెమెరా సెటప్ ఇచ్చారు. 50 ఎంపీ (సోనీ ఐఎంఎక్స్ 882 సెన్సర్) మెయిన్ కెమెరాతో వస్తున్న ఈ మొబైల్ ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్‌ను సపోర్ట్ చేస్తుంది. రెండోది 8 ఎంపీ అల్ట్రా వైడ్ యాంగిల్ కెమెరా. ముందువైపు 16 ఎంపీ కెమెరా ఇచ్చారు. మెయిన్ కెమెరాతో 4కె, 30ఎఫ్‌పీఎస్‌లో వీడియోలను రికార్డు చేయొచ్చు. ఫ్రంట్ కెమెరా 1080పీ వరకే సపోర్ట్ చేస్తుంది. ఏఐ ఫీచర్‌తో రానున్న ఈ కెమెరాలు ఫొటోలకు అదనపు హంగులు ఇస్తాయి. ఇక ఈ ఫోన్‌లో ప్రధాన హైలైట్ బ్యాటరీ. ఇప్పటివరకూ ఇండియన్ మార్కెట్‌లో ఇంత పెద్ద బ్యాటరీతో ఏ మొబైలూ రాలేదు. 10,001 ఎంఏహెచ్ టైటాన్ బ్యాటరీని రియల్‌మి ఇందులో అమర్చింది. నెక్స్ట్ జనరేషన్ సిలికాన్ కార్బన్ ఆండో టెక్, డ్యుయల్ లేయర్ కోటింగ్ ప్రాసెస్, సి-ప్యాక్ ప్రొటెక్షన్ బోర్డ్ వంటి కీ ఫీచర్లు జోడించి భద్రత ప్రమాణాలున్న బ్యాటరీని తీసుకొచ్చింది. వీటి వల్ల ప్రస్తుత మొబైల్ ఫోన్ బ్యాటరీలతో పోలిస్తే, 30 శాతం అదనపు జీవితకాలం రావడంతో పాటు, ఎలాంటి ఇబ్బందుల లేకుండా పవర్ డెలివరీ అవుతుంది. 8 ఏళ్ల పాటు పనిచేసేలా బ్యాటరీని తీర్చిదిద్దినట్లు రియల్‌మి చెబుతోంది. నాలుగేళ్ల పాటు హెల్దీ బ్యాటరీ వారెంటీని అందిస్తోంది. ఒకవేళ ఈ సమయంలో 80 శాతం కన్నా తక్కువ సామర్థ్యానికి బ్యాటరీ పడిపోతే, ఉచితంగా రీప్లేస్ చేయనున్నట్లు హామీ ఇచ్చింది. (ఫస్ట్ సేల్‌లో కొన్నవారికి మాత్రమే ఈ అవకాశం) బాక్స్‌లో 80వా సూపర్ వూక్ ఛార్జర్‌ను ఇస్తున్నారు. 36 నిమిషాల్లో 50 శాతం మొబైల్ ఛార్జ్ అవుతుంది.






# బంగారు కొండ

## ప్రపంచవ్యాప్తంగా 5000 టన్నుల పసిడికి గిరాకీ..!

**న్యూఢిల్లీ:**గతేడాది ప్రపంచవ్యాప్తంగా బంగారం డిమాండ్ ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరుకుంది. ప్రపంచ స్వర్ణమండలి నివేదిక ప్రకారం.. 2025లో మొత్తం బంగారం డిమాండ్ తొలిసారి ఐదు వేల టన్నులు దాటింది. 2024లో ఇది 4,961.9 టన్నులుగా ఉండగా.. 2025లో 5,002 టన్నులకు పెరిగింది. పెట్టుబడులకు సురక్షిత మార్గంగా భావించడం వంటివి డిమాండ్ పెరుగుదలకు కారణమైనట్లు తెలుస్తోంది. పెట్టుబడుల రూపేణా పసిడి డిమాండ్ 2024లో 1,185.4 టన్నులుగా ఉండగా.. గత ఏడాది 2,175.3 టన్నులకు పెరిగింది. సెంట్రల్ బ్యాంకులు 2025లో 863 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేశాయి. నేషనల్ బ్యాంక్ ఆఫ్ పోలాండ్ అత్యధికంగా 102 టన్నులు కొనుగోలు చేసింది. రికార్డు స్థాయి ధరల నేపథ్యంలో గత ఏడాది ప్రపంచవ్యాప్తంగా ఆభరణాల డిమాండ్ మందగించింది. 2024తో పోలిస్తే 18 శాతం తగ్గింది. కానీ, విలువపరంగా 18 శాతం పెరిగి 172 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఈ ఏడాది సైతం ఆర్థిక, భౌగోళిక రాజకీయ అస్థిరతలు తగ్గుముఖం పట్టే సూచనలు కనిపించకపోవడంతో.. బంగారానికి డిమాండ్ కొనసాగే అవకాశం ఉందని డబ్ల్యూజీసీ సీనియర్ మార్కెట్స్ అనలిస్ట్ లూయిస్ స్ట్రీట్ తెలిపారు. 2026 మొదటి నెలలోనే బంగారం ధర ఔన్సుకు 5,000 డాలర్ల మార్కును దాటిందని, సురక్షిత పెట్టుబడిగా బంగారం పాత్రను ఇది చాటిచెబుతోందన్నారు.

భారత్‌లో తగ్గిన డిమాండ్..

భారత్‌లో మాత్రం గత ఏడాది పుత్తడికి డిమాండ్ తగ్గడం గమనార్హం. 2024లో ఇది మొత్తం 802.8 టన్నులుగా ఉండగా.. 2025లో 11 శాతం తగ్గిపోయి 710.9 టన్నులకు పడిపోయింది. రికార్డు స్థాయిలో ధరలు, మారుతున్న వినియోగదారుల కొనుగోలు విధానాలు దీనికి దారితీసినట్లు డబ్ల్యూజీసీ తన నివేదికలో తెలిపింది. అయితే, భారీగా పెరిగిన ధరల కారణంగా 2024లో బంగారం విక్రయాల విలువ రూ.5,75,930 కోట్ల నుంచి 30 శాతం పెరిగి 2025లో రూ.7,51,490 కోట్లకు చేరుకుంది. 2026లో దేశంలో బంగారం డిమాండ్ 600- 700 టన్నులుగా ఉంటుందని డబ్ల్యూజీసీ అంచనా వేసింది. కొండెక్కిన వెండి.. కిలో ధర రూ.4 లక్షలు దాటి పరుగులు

స్వర్ణాభరణాల విషయంలోనూ గత ఏడాది దేశంలో డిమాండ్ తగ్గింది. 2024లో 563.4 టన్నులతో పోలిస్తే 24 శాతం తగ్గి 430.5 టన్నులకు చేరింది. అయితే, విలువ విషయంలో 2024లో నమోదైన రూ.4,04,510 కోట్లతో పోలిస్తే 12 శాతం పెరిగి రూ.4,54,390 కోట్లకు చేరుకుంది. డబ్ల్యూజీసీ గణాంకాల ప్రకారం.. 2024లో ఆర్బీఐ వద్ద 73 టన్నుల బంగారం నిల్వలు ఉండగా.. గత ఏడాది అదనంగా 4 టన్నులు కొనుగోలు చేసింది.

## కొండెక్కిన వెండి..

### కిలో ధర రూ.4 లక్షలు దాటి పరుగులు

దేశీయ మార్కెట్లో బంగారం, వెండి ధరలు అందనంత వేగంగా పరుగులు పెడుతున్నాయి. ఓవైపు బంగారం ధర రూ.2లక్షల దిశగా దూసుకెళ్తుండగా.. వెండి ధర ఫ్యూచర్స్ మార్కెట్‌లో ఏకంగా రూ.4 లక్షలు దాటి ఆల్‌టైం గరిష్ఠానికి చేరింది. హైదరాబాద్ మార్కెట్‌లో ఉదయం 10 గంటల సమయంలో 24 క్యారెట్ల మేలిమి బంగారం 10 గ్రాముల ధర రూ. 1,85,000 దాటింది. అటు వెండి ధర రూ.4,00,000 పలికింది. బుధవారం రాత్రి హైదరాబాద్ విపణిలో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్ల) బంగారం ధర రూ.1,73,300గా ఉంది. కొన్ని గంటల్లోనే రూ.12 వేలు పెరగడం గమనార్హం. కిలో వెండి ధర రూ.3,79,700 వద్ద ముగియగా.. నేడు ఏకంగా రూ.21 వేలకు పైగా పెరిగింది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజ్‌లో మార్చి డెలివరీ కాంట్రాక్టుకు ఫ్యూచర్స్‌లో వెండి ధర గురువారం ఒక్కరోజే రూ.22,090 పెరిగి రూ.4,07,456 వద్ద సరికొత్త జీవనకాల గరిష్ఠాన్ని తాకింది. అటు ఫిబ్రవరి డెలివరీ కాంట్రాక్టుకు

## గిగ్ వర్కర్ల సంపాదన రూ.15వేల కన్నా తక్కువే!

**న్యూఢిల్లీ:**దేశంలో దాదాపు 40శాతం మంది గిగ్ వర్కర్లు నెలకు రూ.15వేల కన్నా తక్కువే సంపాదిస్తున్నారని ఆర్థిక సర్వే పేర్కొంది. ఈ వ్యవస్థలో గణనీయమైన, విధానపరమైన మార్పులు అవసరమని తెలిపింది. వారికి న్యాయమైన వేతనాలు అందించేందుకు వీలుగా వేచి ఉండే సమయానికి పరిహారంతో పాటు గంటకు లేదా ప్రతి పనికి కనీస ఆదాయం అందించాలని సూచించింది. నిబంధనల మార్పులే లక్ష్యంగా గిగ్-ఎకానమీ విధానం ఉండాలని పేర్కొంది. గిగ్ ఎకానమీ వేగంగా విస్తరిస్తున్నప్పటికీ.. ఆదాయంలో అస్థిరత ఓ కీలక సమస్యగా మిగిలిపోయిందని, ఇది రుణాలు పొందడంలో అడ్డంకులు సృష్టిస్తోందని ఆర్థిక సర్వే పేర్కొంది. దీంతో గిగ్ వర్కర్లు ఆర్థికంగా వెనకబడి ఉన్నారని, రుణాలు పొందే అవకాశాలు తక్కువగా ఉండటం వారిలో ఆందోళనలు పెంచుతోందని అభిప్రాయపడింది. గిగ్ వర్కర్లలో దాదాపు 40శాతం మంది నెలకు రూ.15వేల కన్నా తక్కువే సంపాదిస్తున్నారని ఆర్థిక సర్వే అంచనా వేసింది. పరిమితమైన నైపుణ్యాలు, ఏఐ, మెషిన్ లెర్నింగ్ వంటి సాంకేతిక పురోగతి కారణంగా ఉద్యోగం కోల్పోయే నష్టాలు ఎక్కువయ్యాయని పేర్కొంది. 2008 కంటే దారుణ పరిస్థితులు: ఏఐపై ఆర్థిక సర్వేలో హెచ్చరికలు



### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.15 | ₹ 5.17 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,63,950 | ₹ 1,78,850 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 4,25,000

## 3,300 కొత్త విమానాలు అవసరం

- ఎస్‌జే 100 విమానాల తయారీ
- హెచ్‌ఏఎల్ సేవలకూ ప్రాధాన్యం

హైదరాబాద్: ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న విమానయాన విపణిగా భారత్ రికార్డు సృష్టిస్తోంది. పెరుగుతున్న ప్రయాణికుల రద్దీ, ఆర్థిక వృద్ధి నేపథ్యంలో 2044 నాటికి భారత్, దక్షిణాసియా దేశాలకు కలిపి సుమారు 3,300 కొత్త విమానాలు అవసరం అవుతాయని అమెరికా విమాన తయారీ సంస్థ బోయింగ్ అంచనా వేసింది. ఇందులో 90% భారత్‌కేనని పేర్కొంది. ఇందువల్ల రాకపోకలు 4 రెట్లు పెరుగుతాయంది. భారత్‌కు కొత్తగా 2,875 నారో బాడీ, 39 వైడ్ బాడీ విమానాలు అవసరమంది. హైదరాబాద్ వేదికగా జరుగుతున్న వింగ్స్ ఇండియా 2026లో బుధవారం బోయింగ్ 'కమర్షియల్ మార్కెట్ ఔట్‌లుక్' నివేదికను విడుదల చేసింది. వచ్చే 20 ఏళ్లలో భారత విమాన ప్రయాణికుల రద్దీ ఏటా 7 శాతానికి పైగా పెరుగుతుంది. ఇందుకోసం దాదాపు 1,41,000 మంది కొత్త నిపుణులు అవసరం అవుతారు. కొత్తగా 45,000 మంది పైలట్లు, 45,000 మంది టెక్నీషియన్లు, 51,000 మంది క్యాబిన్ క్రూ సిబ్బందికి అవకాశాలుంటాయని బోయింగ్ పేర్కొంది. అభివృద్ధి చెందిన దేశాల్లో పాత విమానాల స్థానంలో కొత్తవి వస్తుంటే, భారత్‌లో మాత్రం.. కొత్తగా సమకూర్చుకుంటున్న విమానాల సంఖ్య పెరుగుతోందని బోయింగ్ కమర్షియల్ మార్కెటింగ్ మేనేజింగ్ డైరెక్టర్ అశ్విన్ నాయుడు తెలిపారు. బాలికలకు విమానయాన రంగంపై ఆసక్తిని పెంచేందుకు 'బోయింగ్ సుకన్య' కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. విమానయాన సేవలకు సంబంధించి, నిర్వహణ, మరమ్మతు, డిజిటల్ సేవలు, శిక్షణ కోసం రాబోయే కాలంలో రూ.16 లక్షల కోట్ల (195 బి.డాలర్లు) పెట్టుబడులు అవసరమని బోయింగ్ పేర్కొంది. సరకు రవాణా విమానాల సంఖ్య వచ్చే 20 ఏళ్లలో 5 రెట్లు పెరుగుతుందని అంచనా వేసింది.

# అజిత్ పవార్ విమానంలో 'గగన్' లేదా?

### దర్యాప్తులో అనుమానాలు..!

**ముంబై:**మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాదానికి సంబంధించి కొత్త విషయాలు బయటికొస్తున్నాయి. అజిత్ ప్రయాణించిన విమానంలో శాటిలైట్ ఆధారిత భద్రతా వ్యవస్థ 'గగన్' లేకపోవచ్చని ప్రాథమిక దర్యాప్తులో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ప్రమాదానికి ఇది కూడా ఓ కారణమై ఉండొచ్చని దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. విమానాల్లో ఈ భద్రతా వ్యవస్థను తప్పనిసరిగా అమర్చాలన్న నిబంధనలు అమల్లోకి రావడానికి కేవలం 28 రోజుల ముందు అజిత్ ప్రయాణించిన విమానం రిజిస్టర్ అయినట్లు తెలుస్తోంది. దీంతో 'గగన్' గైడెన్స్ సిస్టమ్ అందులో ఉండకపోవచ్చని సమాచారం.

**ఏంటీ 'గగన్' వ్యవస్థ..?**

సాధారణంగా ప్రధాన విమానాశ్రయాల్లో ఇన్‌స్ట్రుమెంట్ ల్యాండింగ్ సిస్టమ్ (ఐఎల్ఎస్) సాయంతో విమానాలు ల్యాండ్ అవుతాయి. ఇది భూ ఆధారిత టెక్నాలజీ. విజిబులిటీ తక్కువగా ఉన్న పరిస్థితుల్లో పైలట్‌కు ల్యాండింగ్ విషయంలో కచ్చితమైన మార్గదర్శకత్వాన్ని అందిస్తుంది. ఈ సాంకేతికతను 'ఇన్‌విజిబుల్ గ్లైడ్ పాత్'గా పేర్కొంటారు. వర్షం లేదా పొగమంచు కమ్మేసినప్పుడు పైలట్లు సజావుగా రన్‌వేపై దిగడానికి ఇది దోహదపడుతుంది. అయితే, చాలా ఖర్చుతో కూడుకున్న సాంకేతికత. బారామతి వంటి చిన్న ప్రాంతీయ విమానాశ్రయాల్లో ఈ సదుపాయం అందుబాటులో లేదు. ఈ నేపథ్యంలో చిన్న ఎయిర్‌పోర్టుల కోసం కేంద్రం స్వదేశీ పరిజ్ఞానంతో శాటిలైట్ ఆధారిత 'గగన్ (జీపీఎస్ ఎయిడెడ్ జియో



అగుమెంటెడ్ నావిగేషన్' వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. గ్రౌండ్ పరికరాలతో అవసరం లేకుండా ఈ గగన్ వ్యవస్థ శాటిలైట్ సమాచారాన్ని ఆధారంగా చేసుకుని పైలట్లకు ల్యాండింగ్ సమయంలో మార్గనిర్దేశనం చేస్తుంది. 2021 జూన్ 30న ఈ 'గగన్' వ్యవస్థను కేంద్రం అమల్లోకి తెచ్చింది. కొత్తగా రిజిస్టర్ అయ్యే అన్ని విమానాల్లో దీన్ని తప్పనిసరిగా ఏర్పాటుచేయాలని స్పష్టం చేసింది. అయితే, అజిత్ ప్రయాణించిన లీర్‌జెట్45 విమానం.. ఈ ఆదేశాలు అమల్లోకి వచ్చిన సరిగ్గా 28 రోజుల ముందు అంటే 2021 జూన్ 2న భారత్‌లో రిజిస్టర్ అయ్యింది. అందువల్ల గగన్ వ్యవస్థను ఈ విమానంలో ఏర్పాటుచేయడం చట్టపరంగా తప్పనిసరేం కాదు. దీంతో అజిత్ ప్రయాణించిన విమానంలో ఈ సిస్టమ్ లేకపోయి ఉండొచ్చని దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. అందువల్ల తక్కువ విజిబులిటీ సమయంలో పైలట్లు రన్‌వేను సరిగ్గా గుర్తించలేకపోయి ఉండొచ్చని భావిస్తున్నారు.

**బారామతిలో పరిస్థితి ఏంటీ?**

బారామతి విమానాశ్రయం అనియంత్రిత ఎయిర్‌ఫీల్డ్. అంటే ఇక్కడ ప్రతి దశలో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ వ్యవస్థ పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండదు. ఇక్కడ ట్రాఫిక్‌కు సంబంధించిన సమాచారం స్థానిక విమాన శిక్షణసంస్థల నుంచి తెలుసుకోవాల్సి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఐఎల్ఎస్ లేదా శాటిలైట్ ఆధారిత వ్యవస్థ అందుబాటులో లేకపోతే.. పైలట్లు సంప్రదాయ 'స్టెప్-డౌన్' ప్రక్రియను అనుసరిస్తారు. స్థిరమైన గ్లైడ్ పాత్ కాకుండా.. దశలవారీగా కిందకు వస్తుంది. పైలట్లు రన్‌వేను పూర్తిగా, స్పష్టంగా చూసిన తర్వాతే విమానాన్ని ల్యాండ్ చేస్తారు. అనుకూల వాతావరణ పరిస్థితుల్లో ఇది సాధారణమే కానీ.. పొగమంచు వంటి సందర్భాల్లో ఇక్కడ ల్యాండింగ్ చాలా సవాల్‌తో కూడుకున్న పని అని విమానయాన రంగ విశ్లేషకులు చెబుతున్నారు. ఒక్క చిన్న పొరపాటు జరిగినా భారీ నష్టం వాటిల్లుతుందని తెలిపారు.





## ముగిసిన జేఈఈ మెయిన్

- ప్రొవిజినల్ ఆన్సర్ కీ, ఫలితాలు ఎప్పుడంటే?
- జేఈఈ మెయిన్ సెషన్-1 పరీక్షలు విజయవంతంగా ముగిశాయి.

**న్యూఢిల్లీ:**జేఈఈ మెయిన్ సెషన్-1 పరీక్షలు విజయవంతంగా ముగిశాయి. జనవరి 21న ప్రారంభమైన ఈ పరీక్షలు గురువారం మధ్యాహ్నంతో పూర్తయ్యాయి. జనవరి 21, 22, 23, 24, 28 తేదీల్లో జేఈఈ మెయిన్ పేపర్-1(బీఈ/బీటెక్) పరీక్ష జరగ్గా.. 29న పేపర్ 2ఎ (బీఆర్క్), పేపర్ 2బి (బి.ప్లానింగ్) పరీక్షలను ఎన్‌టీఏ నిర్వహించిన విషయం తెలిసిందే. నిర్ణీత తేదీల్లో రోజూ రెండు షిఫ్టుల్లో జరిగిన ఈ పరీక్షకు దేశ వ్యాప్తంగా మొత్తంగా దాదాపు 13.5 లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరైనట్లు సమాచారం.జేఈఈ మెయిన్ ప్రొవిజినల్ ఆన్సర్ కీ ఎప్పుడు విడుదల చేస్తారనే విషయంపై ఇప్పటివరకు అధికారిక సమాచారం ఏదీ లేనప్పటికీ గత ట్రెండ్స్‌ని బట్టి చూస్తే.. ఫిబ్రవరి మొదటి వారంలో అందుబాటులోకి తీసుకొచ్చే అవకాశం కనబడుతోంది. గత మూడేళ్ల ట్రెండ్స్‌ని పరిశీలిస్తే.. పరీక్షలు పూర్తయిన ఐదు రోజుల వ్యవధిలోనే ప్రొవిజినల్ ఆన్సర్ కీ విడుదల చేశారు. దీన్నిబట్టి ఈసారి కూడా అదే తరహాలో జేఈఈ మెయిన్ ప్రాథమిక కీ విడుదల చేసి విద్యార్థుల నుంచి అభ్యంతరాలు స్వీకరించే అవకాశం ఉంది. పరీక్షల షెడ్యూల్‌లో పేర్కొన్న ప్రకారం ఫిబ్రవరి 12 నాటికి జేఈఈ మెయిన్ ఫలితాలను విడుదల చేసే అవకాశం ఉంది.

## యూజీసీ 'సమానత్వ' నిబంధనపై సుప్రీంకోర్టు స్టే

**న్యూఢిల్లీ:**కుల వివక్షను రూపుమాపి.. ఉన్నత విద్యాసంస్థల్లో సమానత్వాన్ని పెంపొందించేందుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ తీసుకొచ్చిన కొత్త నిబంధనలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఈ నిబంధనలను సవాల్ చేస్తూ దాఖలైన పిల్‌పై గురువారం విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం.. కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ మార్గదర్శకాలు అస్పష్టంగా ఉన్నాయని, వీటిని దుర్వినియోగం చేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేసింది. ఈ సందర్భంగా కేంద్రం, యూజీసీకి సుప్రీం ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. తదుపరి నోటీసులు ఇచ్చేంతవరకు నిబంధనలపై స్టే అమల్లో ఉంటుందని స్పష్టం చేసింది."స్వాతంత్ర్యం వచ్చిన ఇన్ని దశాబ్దాల తర్వాత.. కులవివక్ష లేని సమాజం కోసం మనం ఏం సాధించాం ? ఈవిషయంలో మనం మళ్లీ సమాజాన్ని వెనక్కి తీసుకెళ్తున్నామా? అనే భావన కలుగుతోంది. దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాలు ఇలా దేశంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు తమ సంప్రదాయాలకు అనుగుణంగానే వ్యవహరిస్తారు. అలాంటివారిని ర్యాగింగ్ పేరుతో కొందరు అవహేళన చేస్తుండటం అత్యంత బాధాకరం. వాటిని అరికట్టేందుకు ప్రత్యేక హాస్టళ్లు ఉండాలని మాట్లాడుతున్నారు. కానీ, ప్రస్తుతం సమాజంలో కులాంతర వివాహాలే జరుగుతున్నాయి. హాస్టళ్లలోనూ అందరూ కలిసే ఉంటున్నారు. అలాగే, ఐక్య భారత విధానం మన విద్యాసంస్థల్లో స్పష్టంగా ప్రతిబింబించాలి. విద్యా సంస్థల్లో స్వేచ్ఛాయుత, సమానత్వ, సమ్మిళిత వాతావరణాన్ని మేం కోరుకుంటున్నాం" అని విచారణ సందర్భంగా సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది.

**ఆధార్‌ను తిరస్కరించడం సరికాదు**

ప్రతి ఉన్నత విద్యాసంస్థలోనూ 'సమానత్వ(ఈక్విటీ) కమిటీ'ల ఏర్పాటును యూజీసీ ఇటీవల తప్పనిసరి చేసింది. ఆయా కమిటీల్లో ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళలకు ప్రాతినిధ్యం కల్పించాలని స్పష్టంచేసింది.

## యాదగిరిగుట్టలో బంగారం, వెండి డాలర్లు మాయం!

యాదగిరిగుట్ట: ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్టలో బంగారం, వెండి డాలర్లు మాయమవడం కలకలం రేపుతోంది. శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రచార విభాగంలో దాదాపు రూ.10లక్షలు విలువైన డాలర్లు అదృశ్యమయ్యాయి. గతేడాదే ఇవి మాయమవగా.. ఇటీవల జరిగిన ఆడిట్‌తో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో ఆలయ అధికారుల పనితీరుపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై దర్యాప్తు కొనసాగుతోంది. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.



# 2008 కంటే దారుణ పరిస్థితులు

### ఏఐపై ఆర్థిక సర్వేలో హెచ్చరికలు

**న్యూఢిల్లీ:**సాంకేతిక రంగంలో కృత్రిమమేధ సంచలనాలు సృష్టిస్తోంది. దానిలో భారీ మార్పులు చోటు చేసుకుంటే.. 2008 ఆర్థిక సంక్షోభం కంటే దారుణ మైన పరిస్థితులు ఎదురుకావొచ్చని ఆర్థికసర్వే పేర్కొంది. భారత ఐటీ ఆధారి త వైట్ కాలర్ ఉద్యోగాలకు ప్రత్యక్ష ముప్పు ఉంటుందని హెచ్చరించింది. ఈ పరిస్థితులు ఎదురయ్యే అవకాశాలు 10 శాతం నుంచి 20 శాతం మేరే ఉండొచ్చని.. అయితే, దాని తాలూకూ ప్రభావం మాత్రం తీవ్ర స్థాయిలో ఉంటుందని వెల్లడించింది. "భారత్‌లో ఐటీరంగం వైట్‌కాలర్ ఉద్యోగాల్లో కీలకమైంది. ఏఐ ప్రవేశంతో ఈ రంగంపై తీవ్ర ప్రభావాలు ఉండొచ్చు. అయితే రాత్రికి రాత్రే ఈ ఉద్యోగాలు పోవు. కానీ ఉపాధి అవకాశాలు తగ్గుముఖం పట్టాయి. కొన్ని విభాగాల్లో ఉద్యోగాలను ఏఐ భర్తీ చేస్తోంది" అని సర్వే పేర్కొంది. విదేశీ సంస్థలకు భారత్ నుంచి తక్కువ వేతనంతో ఐటీ సేవలు అందుతున్నాయి. ఇప్పుడు అవే ప్రమాదంలో పడ్డాయి. ఆ పనులను ఏఐ వేగంగా, తక్కువ ఖర్చుతో చేస్తుండటం దెబ్బతీస్తోంది. ఇలాంటి పరిస్థితి నుంచి బయటపడేందుకు, ఉద్యోగాలను రక్షించుకునేలా మార్గనిర్దేశం చేసేందుకు ఏఐ ఎకనామిక్ కౌన్సిల్ ఉండాలని సర్వే ప్రతిపాదించింది. "అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయ పోటీ పెరిగింది. ఐరోపాలో భద్రతాపరమైన పరిస్థితులు సంక్లిష్టంగా మారాయి. వాణిజ్య విధానాల విషయంలో రాజకీయ స్వలాభాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు" అని సర్వే హెచ్చరించింది.



సాంకేతికతపై అధిక పెట్టుబడుల కారణంగా పొంచి ఉన్న ఆర్థికపరమైన ముప్పును ప్రస్తావించింది. మరోపక్క బంగారం ధరలు 2025లో ఒక ఔన్సుకు 2,607 డాలర్ల నుంచి 4,315 డాలర్లకు పెరగడం.. డాలర్ బలహీనతను వెల్లడిచేస్తోంది. 2026లోనూ ఈ ధరల పెరుగుదల కొనసాగుతుంది. ఇవన్నీ మదుపర్లలో ఆందోళనను వెల్లడిచేస్తోందని పేర్కొంది. ఇక, ఏఐ వల్ల ఉత్పాదకత అమాంతం పెరిగిపోతుందనే ఆశతో పలు సంస్థలు భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. ఈ రంగంలో ఏదైనా దిద్దుబాటు చోటుచేసుకుంటే.. భారత్ వంటి మార్కెట్లలోకి వచ్చే పెట్టుబడులపై ప్రభావం పడొచ్చని తెలిపింది. ఈ పరిణామాలన్నింటితో భారత్‌కు ముప్పు ఉన్నప్పటికీ.. ఆర్థిక మూలాలు, విస్తృతమైన దేశీయ మార్కెట్, భారీగా ఉన్న విదేశీ మారక నిల్వలు బఫర్‌గా ఉండొచ్చనే అభిప్రాయాన్ని సర్వే వ్యక్తంచేసింది. పొంచి ఉన్న ప్రమాదాలను ఎదుర్కొనేలా దీర్ఘకాలిక వ్యూహాలతో ముందుకు వెళ్లాలని సూచించింది.

# ఎన్నికల వేళ నాయకుల జంపు జిలానీలు





- టికెట్‌పై హామీ లేక పోవడమే కారణమా..
- ప్రధాన పార్టీలకు రెబల్ బెడద తప్పదా..?

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జనవరి 29 (జనంసాక్షి) :** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ సందడి నెలకొంది. అయితే పోటీలో ఉండాలని భావిస్తున్న ఆశావహులకు టికెట్ పై హామీ లభించక పోవడంతో ఇతర పార్టీల్లోకి వెళ్లడం, స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉండేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో ప్రధాన పార్టీలకు రెబల్ బెడద అనివార్యంగా మారనుంది. మున్సిపల్ ఎన్నికలు ప్రక్రియలో భాగంగా వార్డుల రిజర్వేషన్లు ఖరారు అయిన వెంటనే ఆయా పార్టీల నాయకులు తమకు అనుకూలంగా ఉన్న వాటిలో ప్రచారాలను ముమ్మరం చేశారు. ఓటర్లను ప్రసన్నం చేసేందుకు అన్ని విధాలుగా ప్రయత్నాలు ప్రారంభించారు. ఇక నోటిఫికేషన్ విలుబడిన వెంటనే నామినేషన్లను దాఖలు చేస్తున్నారు. అయితే ఆయా పార్టీల పెద్దలు ఆశావాహులకు టికెట్ పై ఇలాంటి హామీలు ఇవ్వకపోవడంతో పలువురు పార్టీలు మారేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. పార్టీలకు రాజీనామాలు చేయడంతో పాటు ఇతర పార్టీలోకి వెళ్లడం, స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి ఉండేందుకు సిద్ధమయ్యారు. ఆయా పార్టీల పెద్దలు మాత్రం విజయ అవకాశాలు ఎవరికి ఉన్నాయి, క్షేత్రస్థాయిలో పరిస్థితి ఏంటి అనీ సర్వే చేస్తూ ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో పలు పార్టీల నాయకులు ఒక పార్టీ నుండి మరో పార్టీలోకి జంపు జిలాని అవుతున్నారు. కాగా నాయకులు తమ ప్రభావం, ఉనికి కోల్పోకుండా ఉండెందుకు మున్సిపల్ ఎన్నికలలో పోటీ చేసేందుకు తహతహ లాడుతున్నారు. కుమ్మరి శిరీష శ్రీనివాస్ బిఆరెఎస్ పార్టీకి గురువారం రాజీనామా చేసినట్లు తెలిపారు.

శిరీష గత మున్సిపల్ ఎన్నికలలో బిఆరెఎస్ పార్టీ నుండి 19 వార్డు కౌన్సిలర్‌గా గెలుపొందారు. మరోసారి ఆమె19 వార్డ్ నుండి బరిలో వుండే క్రమంలో ఆ టికెట్ ఇతరులకు కేటాయించగా ఆమె బిఆరెఎస్ కు రాజీనామా చేసి ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఎన్నికలలో పోటీ చేస్తున్నారు. మరో బిఆర్ఎస్ నాయకుడు ఆర్ఎంపి డాక్టర్ నరేష్ పార్టీకి రాజీనామా చేయగా, మరో బిఆరెఎస్ నాయకుడు పల్లెపు లక్ష్మణ్ బిఆరెఎస్ పార్టీకి రాజీనామా చేసి వారు బిజెపిలో చేరారు. ఎన్నికల నామినేషన్ల గడువు నేటితో ముగుస్తున్న క్రమంలో ఆయా పార్టీల నాయకులు టికెట్లు ఆశిస్తున్న క్రమంలో వారికి టికెట్లు కేటాయించక పోవడంతో నాయకులు ఏ పార్టీ నుండి ఏ పార్టీలోకి మారుతున్నారో తెలియని పరిస్థితి ఆయా పార్టీల శ్రేణులలో నెలకొంది.





# లక్ష్మీ దేవుపల్లి రిజర్వాయర్ లేనట్టేనా!

## ఉత్తుత్తి హామీలతో ఓట్లు దండుకున్నారు

- కేసీఆర్ నుంచి రేవంత్ వరకు మోసం
- గిరిజన తాండాల్లో వలసలు.. ఆకలి శవాలు
- రిజర్వాయర్ నిర్మాణమే పరిష్కారం

**జిల్లేడ్ చౌదరిగూడ, జనవరి 29 (జనంసాక్షి) :** లక్ష్మీ దేవుపల్లి రిజర్వాయర్ నిర్మాణాన్ని నాయకులు పూర్తిగా పక్కన పెట్టారని, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కుర్చీ వేసుకుని రిజర్వాయర్ నిర్మిస్తామని ప్రలోభాలు పలికి ప్రజలను నమ్మించి ఓట్లు దండుకున్నారని పాలమూరు అధ్యయన వేదిక, విద్యావంతులు, ప్రజా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అధికారంలోకి వచ్చాక దాని గురించి ఉసెతకుండా పరిపాలన జరిపారని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రిజర్వాయర్‌ను తెరపైకి తేవడం లేదని విమర్శిస్తున్నాయి. మంగళవారం పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని చింతకుంట తాండాలో ప్రజా సంఘాల బృందం పర్యటించి స్థానికులతో ముఖాముఖి నిర్వహించింది. గిరిజన జీవనంపై ఆరా తీసిన బృందం తాండా వాసులు ముంబై, పూనా బతుకుతెరువు కోసం వలస పోయి అక్కడే చనిపోయి శవాలుగా వస్తున్నారని నిర్ధారించింది. నీటి సమస్య, జలాలు అడుగంటడం, బోర్లు వేసినా నీరు రాకపోవడంతో భూమి దున్నుకుని పంటలు పండించలేకపోతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. లక్ష్మీ దేవునిపల్లి రిజర్వాయర్ నిర్మిస్తే కృష్ణా నది నుంచి పుష్కలంగా నీరు తీసుకొచ్చి సాగునీరు అందించవచ్చని పేర్కొన్నారు.

నాడు పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డి, బట్టి విక్రమార్క, గద్దర్ ఇదే స్థలానికి వచ్చి పాలమూరు అధ్యయన వేదిక రాఘవచారి సమర్పించిన నివేదికపై కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రిజర్వాయర్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇప్పుడు అధికారంలో ఉండి కూడా ఏమీ చేయడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ గిరిజనులు వలసలు పోకుండా ఆపాలంటే వెంటనే లక్ష్మీ దేవుపల్లి రిజర్వాయర్ నిర్మించి నీటి వసతి కల్పించాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగమైన ఈ రిజర్వాయర్ ద్వారా రైతులకు సాగునీరు అందించవచ్చని, నిర్మాణం చేపట్టకపోతే భారీ ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

పాలమూరు అధ్యయన వేదిక రాఘవచారి మాట్లాడుతూ ఒక్క తాండాలో 80–90 కుటుంబాలు ఉంటే 60–70 కుటుంబాలు వలసలు పోయి శవాలుగా వస్తున్నారని, ఇది ప్రభుత్వాలు చేస్తున్న అన్యాయమని మండిపడ్డారు. నీటి మడుగులు అంతరించిపోతున్నాయని, వెంటనే రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలని, లేకపోతే భారీ ఉద్యమాలకు ఊపిరి పోస్తామని హెచ్చరించారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఇరిగేషన్ అధికారులతో కలిసి రిజర్వాయర్ స్థలాన్ని పరిశీలించి చిత్రపటాలు చూశారు. ఆగమేఘాల మీద వచ్చి ప్రజల్లో ఆశలు కల్పించి చివరకు రిజర్వాయర్ నిర్మాణాన్ని ఎత్తేశారని ప్రజలు ఆరోపిస్తున్నారు.



నాడు లక్ష్మీదేవిపల్లి రిజర్వేయర్ స్థల పరిశీలన చేసిన ఎమ్మెల్యే శంకర్. రామ్మోహన్ రెడ్డి. ఇరిగేషన్ అధికారులు.

### లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మించాలి

**బిసి సేన జిల్లా ప్రధాన కార్యదర్శి జయ**

లక్ష్మి దేవుని పల్లి రిజర్వాయర్ నిర్మించి రైతంగానికి సాగునీరు అందించాలని పేర్కొన్నారు అదేవిదంగా రేపు విచేయుచున్నా ఉపా ముఖ్యమంత్రి బట్టివిక్రమార్క కు వినతి పత్రం ఇవ్వనున్నట్లు లేఖ విడుదల చేశారు. రిజర్వాయర్ లేనందుకు ఆ ప్రాంతమంతా నీరు లేఖ రైతాంగం పంటలు పండించుకోలేక వలసలు పోతున్నారని సీఎం దృష్టికి తీసుకుపోనున్నారు. తక్షణ మే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల్లో భాగంగా ఉన్నటువంటి లక్ష్మి దేవునిపల్లి రిజర్వేర్‌ని నిర్మించేటట్లు చర్యలు చేపట్టాలని బట్టి విక్రమార్కతో తెలపనున్నారు.



# మన్నించండయ్యా.. మహనీయులు!!





- రెండేళ్లుగా స్టోర్ రూమ్‌లోనే చిత్ర పటాలు
- జాతీయ నేతల చిత్రపటాలకు అవమానం..!

**చిగురుమామిడి జనవరి29 (జనంసాక్షి):** మహనీయులారా.. మన్నించండయ్యా..అనేలా పరిస్థితి మారింది..గత రెండేళ్లుగా గునుకులపల్లే గ్రామపంచాయతీ స్టోర్ రూమ్ లోనే మహనీయుల చిత్ర పటాలు మూలుగుతున్నాయి. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం గునుకులపల్లె నూతన గ్రామపంచాయతీ ప్రారంభోత్సవంలో మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా లక్ష్మీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 30మహనీయుల చిత్ర పటాలను చైర్మెన్,సీనియర్ జర్నలిస్టు గాదె రఘునాథ్ రెడ్డి గ్రామపంచాయతీకి అందజేశారు. అయితే రెండేళ్లుగా ఆ చిత్రపటాలను గ్రామ పంచాయతీ గోడలపై అమర్చకుండా నాటి నుంచి నేటి వరకు స్టోర్ రూమ్ లోనే నిర్లక్ష్యంగా ఓ మూలన ఉంచడం గమనార్హం. ఇది మహనీయులను అవమానపరచడమే అవుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఇటీవల గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఎగరవేసే సమయంలో కూడా మహనీయుల చిత్రపటాలను బయటకు తీయకపోవడం కొసమెరుపు.. ఇదిలా ఉండగా.. మహనీయుల చిత్రపటాలను మంత్రిచే అందించిన లక్ష్మీ చారిటబుల్ ట్రస్టు చైర్మెన్ గాదె రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో గతములో కుర్చీలు,టేబుల్ తో కూడిన ఫర్నీచర్ ను సైతం పంపిణీ చేయగా,వాటిని మాత్రం ఉపయోగిస్తున్నారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన జాతీయ నాయకుల చిత్రపటాలను విస్మరించడంపై గ్రామ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇది యాదృచ్ఛికంగా జరుగుతుందా..లేదా పనిగట్టుకొని కావాలనే చేస్తున్నారా.. అనే అనుమానాలను ట్రస్టు ప్రతినిధులు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మహనీయులను గౌరవించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వాటిపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుకున్నారు.



## యదేచ్ఛగా అక్రమ ఇసుక రవాణా తవ్వకాలు

**గంభీరావుపేట జనవరి 29 (జనం సాక్షి):** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని గురువారం రోజున ఉదయం ఎనిమిది గంటలకే మానేరు వాగు నుంచి కొందరు దుండగులు ప్రతిరోజు ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా యథేచ్ఛగా సాగుతున్నాయి. ఆ విషయం బహిరంగ రహస్యం. అయితే సంబంధిత అధికారులకు మాత్రం కనిపించడం లేదు. అక్రమార్కులపై అధికారులు చర్యలు చేపట్టకపోవడం అందుకు నిదర్శనం. ఈ క్రమంలో ఒకరిని చూచి మరొకరు ఇసుక దందాను కాసులు సంపాదించే వనరుగా అడుగులు వేస్తున్నారు. దీంతో సహజ వనరుల దోపిడీని అరికట్టేందుకు ఏ అధికారులు ముందుకు రావాలో అర్థం కావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మానేరు వాగు నుంచి ఉదయం 8 గంటలకి వాగులో నుంచి అక్రమ ఇసుక రవాణాకు కొందరు దుండగులు పాల్పడుతున్నారు. సామాన్యుని దగ్గర నుంచి అధిక రేట్లు దోచేస్తున్నారు. అధికారులు పలువురిని పట్టుకొని కేసులు నమోదు చేసిన కానీ, వారి దండ మాత్రం మానడం లేదు, ఇప్పటికైనా అధికారులు ఏం చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

## డి-46 కెనాల్‌లో చిన్నారి మృతదేహం

**ఎడపల్లి, జనవరి 29 (జనంసాక్షి) :** ఎడపల్లి మండలం ఏఆర్పి క్యాంపు గ్రామం పెద్దమ్మ గుడి వద్ద డి–46 కెనాల్ లో 8 ఏళ్ల చిన్నారి మృతదేహం కొట్టుకు వచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. ఏఆర్పి క్యాంపు గ్రామం వద్ద యువకులు క్రికెట్ ఆడుతుండగా 8 ఏళ్ల చిన్నారి మృతదేహంను గుర్తించిన గ్రామస్తులు ఎడపల్లి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు ఎడపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



## అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థులకు సిల్వర్ జోన్ ఒలింపియాడ్‌లో బంగారు పతకాల జల్లు



- ఇంగ్లీష్ భాష పట్టు అవసరం : డాక్టర్ వి. నరేందర్ రెడ్డి
- విజేతలకు పుష్పగుచ్ఛాల సన్మానం

**కరీంనగర్, జనవరి 29 జనంసాక్షి :** ఇంగ్లీష్ భాషలో పట్టు సాధిస్తే అనేక ఉపాధి అవకాశాలు, సమాజంలో తగిన గుర్తింపు లభిస్తాయని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అన్నారు. కొట్టపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో సిల్వర్ జోన్ ఫౌండేషన్ నిర్వహించిన అంతర్జాతీయ ఇంగ్లీష్ ఒలింపియాడ్‌లో బంగారు పతకాలు గెలుచుకున్న విద్యార్థులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇంగ్లీష్ భాషలో పట్టు ఉంటే విషయాలను విశ్లేషణాత్మకంగా తెలుసుకోవచ్చని, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఈ భాషతో ఏ దేశంలోనైనా ఉపాధితో స్థిరపడవచ్చని డాక్టర్ నరేందర్ రెడ్డి తెలిపారు. ఇటీవల సిల్వర్ జోన్ అంతర్జాతీయ ఇంగ్లీష్ ఒలింపియాడ్‌లో పాఠశాలకు చెందిన వి. వేదవిహార్ (4వ తరగతి), కె. సుకృత (5వ తరగతి), బి. తన్మయి (7వ తరగతి), టి. అమితా విక్రం (9వ తరగతి) తదితర విద్యార్థులు బంగారు పతకాలు సాధించడం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. విజేతలందరికీ పుష్పగుచ్ఛాలు అందజే స్తూ రానున్న రోజుల్లో మరిన్ని అద్భుత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సజావుగా సాగుతున్న నామినేషన్ల ప్రక్రియ

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- కార్పొరేషన్ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్



**గోదావరిఖని, జనంసాక్షి :** పురపాలక ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ జిల్లాలో సజావుగా కొనసాగుతు ందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.

గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రామగుండంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముబారక్ నగర్, సప్తగిరి కాలనీలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ తో కలిసి ఆకస్మికం గా తనిఖీ చేసి మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు.

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న 60 డివిజన్ లకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ కోసం రామగుండంలో 8 కేంద్రాలను ఏర్పాటు చేశామని, పురపాలక ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సజావుగా జరుగుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. జనవరి 30 వరకు నామినేషన్లను స్వీకరిస్తామని, జనవరి 31న నామినేషన్ల పరిశీలన పూర్తి చేసి సరిగ్గా నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామని తెలిపారు. నామినేషన్ తిరస్కరించిన అభ్యర్థులు ఫిబ్రవరి 1న సాయంత్రం 5 గంటల వరకు అప్పిల్ చేసుకునే అవకాశం ఉందని, సదరు అప్పీల్స్ ను ఫిబ్రవరి 2న పరిష్కరిస్తామని, ఫిబ్రవరి 3 మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉంటుందని, ఫిబ్రవరి 3 సాయంత్రం పోటీ చేసే అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


### తహసీల్దార్ కార్యాలయం రికార్డులు ఆకస్మిక తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్

**జిల్లేడు చౌదరిగూడ, జనవరి 30:** జిల్లేడు చౌదరిగూడ తహసీల్దార్ కార్యాలయంలో గురువారం సాయంత్రం 7 గంటల సమయంలో అడిషనల్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన తహసీల్దార్ జగదీశ్వర్‌కు, సిబ్బందికి కీలక సూచనలు చేశారు. ప్రభుత్వ భూములను తప్పనిసరిగా తనిఖీ చేయాలని, నక్ష బాట లేకపోతే రైతులకు విడిపించాలని ఆదేశించారు. జీపీఓలు ఈ అంశాలపై ఎక్కువ అవగాహన కలిగి ఉండాలని, సర్వేయర్ అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రభుత్వ భూములు మొత్తం ఎంత ఉందో రికార్డుల్లో స్పష్టంగా పేర్కొనాలని, భూమి విరాసతులు భర్త లేకుంటే భార్యకు లేదా కుటుంబ సభ్యులకు ఇవ్వడంలో క్షుణ్ణంగా పరిశీలన చేయాలని ఆదేశించారు. రైతులకు ఎక్కడా అన్యాయం జరగకూడదని హెచ్చరించారు. రికార్డ్ గది పరిశీలించి అప్లికేషన్లు చూడాలని జూనియర్ అసిస్టెంట్ అధికారులకు సూచించారు.

# రెండో రోజు బారీగా నామినేషన్ల దాఖలు

**మద్దతు దారులతో పోటాపోటీ ర్యాలీలు.. బరిలో జనసేన అభ్యర్థులు**

**నేడు చివరి రోజు నామినేషన్లు పెరిగే అవకాశం**



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జనవరి 29 (జనంసాక్షి) :** మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా వేములవాడ మున్సిపాలిటీలో రెండో రోజు భారీ సంఖ్యలో అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. మొదటిరోజు నామినేషన్లకు అంతగా ఆసక్తి చూపని అభ్యర్థులు రెండవ రోజు ముహూర్తం చూసుకోని తమ మద్దతుదారులతో పోటాపోటీ ర్యాలీలు నిర్వహించి తమ బల ప్రదర్శన నిరూపించుకుంటూ నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ వేయడానికి వచ్చిన అభ్యర్థులతో పాటు వారి వెంట వచ్చిన మద్దతు దారులతో మున్సిపల్ కార్యాలయ ఆవరణ, సమీప ప్రాంతాలు రద్దీగా మారీ కోలాహలం నెలకొంది. నామినేషన్ల దాఖలకు శుక్రవారం చివరి రోజు కావడంతో నామినేషన్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. మొదటి రోజు కాంగ్రెస్ నుండి 8, బీఆర్ ఎస్ నుండి 5, బీజేపీ నుండి 3 నామినేషన్లు దాఖలు కాగా 2 వ రోజు మొత్తం 90 నామినేషన్లు వచ్చాయి. వీటిలో పార్టీల వారీగా కాంగ్రెస్ 28, బిఆర్ఎస్ 21, బిజెపి 24, జనసేన 05, సిపిఐ 02, బీఎస్పీ ఒకటి, ఇండిపెండెంట్ అభ్యర్థులు 09 మంది నామినేషన్లు దాఖలు చేశారు. వేములవాడ మున్సిపల్ ఎన్నికల బరిలో తొలిసారిగా జనసేన పార్టీ నుండి అభ్యర్థులు నామినేషన్లు వేశారు. నేడు నామినేషన్లకు చివరి రోజు కావడంతో మరికొంతమంది వేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తుంది.

# నిబంధనల ప్రకారం నామినేషన్ ప్రక్రియ

- అభ్యర్థుల సందేహాలు హెల్ప్‌డెస్క్‌లో నివృత్తి చేయాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి
- కరీంనగర్ నామినేషన్ కేంద్రాల పరిశీలన



**కరీంనగర్ జిల్లా బ్యూరో, జనవరి 29 (జనంసాక్షి) :** ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు తూచా తప్పకుండా పాటిస్తూ నామినేషన్ ప్రక్రియ పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఎన్నికల అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయితో కలిసి పరిశీలించారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలలో సదుపాయాలు పరిశీలించి, నామినేషన్ పత్రాల స్వీకరణకు సంబంధించి పలు సూచనలు చేశారు. హెల్ప్‌డెస్క్, పోలీస్ బందోబస్తు తదితర అంశాలను పరిశీలిస్తూ, సపోర్టింగ్ స్టాఫ్ వివరాలు ఆరా తీశారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని, నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను రిజిస్టర్ లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. ఆయా డివిజన్ స్థానాలకు దాఖలైన నామినేషన్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి టీ పోల్ యాప్ లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఎన్నికల సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు.

**కమాండ్ కంట్రోల్ సెంటర్ పరిశీలన**

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. నామినేషన్ కేంద్రాలు, హెల్ప్ డెస్క్, మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ద్వారా ఎన్నికల సిబ్బంది విధులను పర్యవేక్షించారు. కమాండ్ కంట్రోల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, షిఫ్టుల వారీగా 24 గంటలు విధులు నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేయాలని అన్నారు.

**చొప్పదండి నామినేషన్ కేంద్రాల పరిశీలన**

చొప్పదండి మున్సిపాలిటీ ఎన్నికల్లో భాగంగా చొప్పదండి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. హెల్ప్ డెస్క్ సిబ్బంది అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేయాలని, ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు స్పష్టంగా వివరించాలని తెలిపారు. చొప్పదండి వార్డు స్థానాలకు అప్పటివరకు దాఖలైన నామినేషన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. పలు నామినేషన్ పత్రాలను పరిశీలించారు. దాఖలైన నామినేషన్లకు సంబంధించి జిల్లా కేంద్రానికి సకాలంలో రిపోర్టులు పంపించాలని అన్నారు. నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, విధుల్లో ఉన్న ప్రభుత్వ సిబ్బంది నామపత్రాలు దాఖలు చేసే విషయంలో అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా, ఉన్నతాధికారులను సంప్రదించాలని సూచించారు. కలెక్టర్ వెంట చొప్పదండి మున్సిపల్ కమిషనర్ మనోహర్ ఉన్నారు.

# దళితుల స్థలం కాజేసేందుకు కుట్ర

- పంచాయితీ భవనం వేరే స్థలంలో నిర్మించాలి
- అంబేద్కర్ బహుజన సమాజ సేవా సంఘం ఫిర్యాదు



**మర్పల్లి జనవరి 29 (జనంసాక్షి) :** వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం గుండ్లమర్పల్లి గ్రామంలో దళితులకు చెందిన స్థలంలో బలవంతంగా పంచాయతీ కార్యాలయ నిర్మాణం చేపట్టడం తీవ్ర వివాదాస్పదంగా మారింది. అంబేద్కర్ బహుజన సమాజ సేవా సంఘానికి కేటాయించిన స్థలంలో సర్పంచ్ వర్గీయులు దౌర్జన్యంగా నిర్మాణ పనులు ప్రారంభించారని సంఘం నాయకులు ఆరోపించారు. గ్రామంలోని హనుమాన్ మందిరం సమీపంలో ఉన్న సుమారు 20 గుంటల స్థలాన్ని గత వంద సంవత్సరాలుగా దళితులు పెంట స్థలంగా ఉపయోగించుకుంటూ వచ్చారని తెలిపారు. గత ప్రభుత్వం పారిశుద్ధ్య కారణాలతో పెంటలు వేయవద్దని సూచించడంతో గ్రామస్తులంతా ఆపేశారని, ఇతర కులాల వారు తమ పెంట స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్నప్పటికీ దళితులు మాత్రం అట్టి స్థలాన్ని అలాగే ఉంచుకొని గత సర్పంచ్ సహకారంతో చదును చేయించుకున్నారని వివరించారు. ఈ స్థలాన్ని అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే విధంగా అంబేద్కర్ ఆశయాలతో బహుజన సమాజ సేవా సంఘాన్ని రిజిస్టర్ చేసి, డబ్బు లేని గ్రామస్తులు పెళ్లిళ్లు, శుభకార్యాలు నిర్వహించుకునేలా వినియోగిస్తున్నామని తెలిపారు. గత పదేళ్లుగా అంబేద్కర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలు ఇక్కడే జరుగుతున్నాయని, గ్రామానికి అందరికీ తెలిసిన విషయమేనని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని నూతన సర్పంచ్, గ్రామ కార్యదర్శికి ముందుగానే తెలియజేసి రిజిస్ట్రేషన్ కాపీలు అందజేశామని, భవిష్యత్తులో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని కోరితే వారు అంగీకరించినట్లు తెలిపారు. అయితే బుధవారం (28-01-2026) ఉపసర్పంచ్ తమ్ముడు మంగలి ఈశ్వర్, సర్పంచ్ భర్త పురుషోత్తం, గ్రామ కార్యదర్శి కలిసి రాజకీయ కక్షతో గ్రామస్థులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా గ్రామ సభ పేరిట పోలీసులు, జేసీబీలను తెప్పించి పరదాలు కట్టి దౌర్జన్యంగా పనులు ప్రారంభించారని ఆరోపించారు. ప్రశ్నించిన గ్రామస్థులను "ఏం చేసుకుంటారో చేసుకోండి" అంటూ బెదిరించారని, ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి గ్రామ కార్యదర్శి వెళ్లిపోయిందని తెలిపారు.

పంచాయతీ కార్యాలయ నిర్మాణానికి గ్రామంలో పాత స్కూల్ భవనం, స్మశానం సమీపంలో ఖాళీ స్థలం, పాడుబడ్డ బావి వంటి ప్రత్యామ్నాయ స్థలాలు ఉన్నప్పటికీ, కేవలం రాజకీయ, వ్యక్తిగత, కుల దురుద్దేశాలతో దళితుల స్థలాన్ని ఎంచుకోవడం దుర్మార్గమని సంఘం మండిపడింది. ఈ దౌర్జన్యాన్ని వెంటనే నిలిపివేయాలని, దాడులు ఆపాలని, సంబంధిత అధికారుల ద్వారా న్యాయం చేయాలని అంబేద్కర్ బహుజన సమాజ సేవా సంఘం తహసీల్దార్, ఎంపీడీఓ, పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు.

# హలో..హలో వినిపించటం లేదు

## సెల్‌ఫోన్ సిగ్నల్ రాక గ్రామస్తుల ఇబ్బందులు

### సిగ్నల్స్ ఉన్నచోటికి పరుగులు





**రాజోలి, జనవరి 29 (జనంసాక్షి) :** ఫోన్లో సిగ్నల్ రాకపోతే ఏం చేస్తాం ? కాస్త పక్కకు వెళ్లి మాట్లాడుతాం. మరీ వినిపించడం లేదంటే ఫోన్ స్విచ్చాఫ్ చేసి ఆన్ చేసి వాడుతాం. కానీ ఇక్కడ ఫోన్ మాట్లాడాలంటే ఇంటి డాబాలపై ఎక్కాల్సిందే. దేశం సాంకేతికంగా దూసుకుపోతున్నా ఇంకా కొన్ని మారుమూల పల్లెలకు మాత్రం కనీస సౌకర్యాలు అందడం లేదు. జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలంలోని తూర్పు గార్లపాడు గ్రామంలో ముఖ్యంగా మొబైల్ సిగ్నల్స్ లేకపోవడంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు, కుటుంబ సభ్యులతో మాట్లాడాలంటే సిగ్నల్ కోసం ఊరి బయటకు వెళ్లాల్సి వస్తుంది లేదా ఇంటి డాబాలపై ఎక్కాల్సిన దుస్థితి నెలకొందని గ్రామస్తులు వాపోయారు.

**సిగ్నల్స్ ఉండవు.. ఫోన్లు పనిచేయవు**

తూర్పు గార్లపాడు గ్రామపంచాయతీ పరిధిలో సుమారు 1600 మంది జనాభా నివసిస్తుంటారు. సెల్ ఫోన్ లేనిదే రోజు గడిచే పరిస్థితి లేని ఈ రోజుల్లో వేల రూపాయలు పెట్టి సెల్ ఫోన్ కొనుగోలు చేసుకుని తీరా ఊర్లోకి వచ్చిన తర్వాత సిగ్నల్ లేకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రైవేటు కంపెనీలు ఎయిర్టెల్, జియో, సెల్ టవర్ లేకపోవడం, ప్రభుత్వ రంగ సంస్థ అయినా బిఎస్ఎన్ఎల్ టవర్ కూడా లేకపోవడంతో ఫోన్ సిగ్నల్ లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఫోన్ మాట్లాడాలంటే డాబా ఎక్కాల్సిందే ఇంటి నుంచి బయటకు రావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్లైన్లో ఏదైనా సమాచారం పంపాలంటే ధాబా పైకి ఎక్కాలని అన్నారు. వందలాది మంది వినియోగదారులు డబ్బులు పెట్టి మొబైల్ రీఛార్జ్ చేసుకున్నప్పటికీ నెట్వర్క్ రాకపోవడంతో నష్టపోతున్నామని వారు వాపోయారు. తక్షణమే ఆయా కంపెనీ వారు స్పందించి నెట్వర్క్ సమస్యను తీర్చాలని వారు వాపోయారు.

**రేషన్ పంపిణిలో సిగ్నల్ కష్టాలు**

రేషన్ దుకాణాల పేరెత్తితో జనం విసిగిపోతున్నారు. సిగ్నల్ సమస్య తలెత్తడంతో సన్న బియ్యం కోసం గంటల తరబడి నిలబెదు తున్నారని మండిపడుతున్నారు. ఉదయం నుంచే సంచులు పట్టుకుని బారులు తీరాల్సిన పరిస్థితి నెలకొన్నదని భగ్గుమంటున్నారు. పనులు మానుకుని బియ్యం కోసం వేచి చూడాల్సిన పరిస్థితులు వచ్చాయని అసహ నం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా రేషన్ దుకాణాల వద్ద బియ్యం తీసుకునేందుకు అరగంట వరకు పట్టేదని, ఇప్పుడు గంటల తరబడి లైన్‌లలో నిలబడాల్సి వస్తున్నదని ఆగ్రహంగా చెప్తున్నారు. సరిగ్గా సిగ్నల్ అందకపోవడంతో రేషన్ బియ్యం కోసం ప్రతినెల కొంతమంది లబ్దిదారు లు ప్రక్కనున్న రాజోలి మండల కేంద్రానికి వెళ్తున్నట్లు పేర్కొన్నారు.

**సిగ్నల్ రాక ఇబ్బందులు పడ్తున్నాం**




సిగ్నల్ లేక ఒక మాట వినబడితే, మరో మాట వినపడక, వచ్చిరాని సిగ్నల్ వారు మాట్లాడు కునే మాటలు విని వినపడక ఇబ్బందులు పడుతున్నాం. మా ఫోన్లకు ఏం జరిగిందో అని రిపేరు సెంటర్లకు వెళ్తున్నాం. బంధువులకు, మిత్రులకు సరిగ్గా మాట్లాడలేకపోతున్నాం. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి మా గ్రామంలో సిగ్నల్ టవర్లను ఏర్పాటు చేయండి.

**-రత్నం, తూర్పు గార్లపాడు**

# మున్సిపల్ ఎన్నికలపై ప్రత్యేక నిఘా

**ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు : వికారాబాద్ ఎస్పీ స్నేహమేహ్రా**



**వికారాబాద్ జిల్లా బ్యూరో జనవరి 29 (జనం సాక్షి):** వికారాబాద్ జిల్లా మున్సిపల్ ఎన్నికలపై పోలీసుల ప్రత్యేక దృష్టి ఉందని ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఒక ప్రకటనలో తెలియజేశారు. వికారాబాద్ జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీ లలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ప్రజలు అందరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు ప్రతి పౌరుడు చట్టానికి లోబడి వ్యవహరించాలని, ఎలాంటి ప్రలోభాలకు లోనుకా కుండా స్వేచ్ఛాయుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆమె కోరారు. డబ్బు, మద్యం, బహుమతుల ద్వారా ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నాలు చట్టవిరుద్ధమని హెచ్చరించారు. అక్రమంగా మద్యం విక్రయం మరియు పంపిణీని కి అనుమతి లేదు అని ఎస్పీ స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో అధికారుల లిఖితపూర్వక అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని, మైక్ సెట్లు లేదా శబ్ద కాలుష్యం కలిగించే పరికరాలు వినియోగించరాదని ఎస్పీ స్పష్టం చేశారు. 50 వేల కంటే ఎక్కువ నగదు తరలించాలంటే తప్పనిసరిగా సరైన ఆధారాలు చూపించాలని, సోషల్ మీడియా వేదికగా తప్పుడు వార్తలు, రెచ్చగొట్టే సందేశాలు, ద్వేషపూరి త వ్యాఖ్యలు ప్రచారం చేస్తే సైబర్ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ అధికారులకు ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలు, గతంలో గొడవలు చోటుచేసుకున్న సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి, అక్కడి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. ఎన్నికల సమయంలో అల్లర్లు సృష్టించే అవకాశం ఉన్నవారు, గతంలో నేర చరిత్ర కలిగిన వ్యక్తులు, రౌడీ షీటర్లను ముందుగానే గుర్తించి, తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## ఎస్‌జిటియు డైరీ క్యాలెండర్ ఆవిష్కరణ

**రాష్ట్ర సహా ప్రధాన కార్యదర్శి పండుగ అంజయ్య**

**తలకొండపల్లి జనవరి 29(జనంసాక్షి):** తెలంగాణ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం 2026 నూతన సంవత్సరానికి చెందిన డైరీ,క్యాలెండర్ ను గురువారం తలకొండపల్లి స్కూల్ కాంప్లెక్స్ లో ఉపాధ్యాయ సంఘం నాయకులతో కలిసి ఎస్ జిటియు రాష్ట్ర సహా కార్యదర్శి పండుగ అంజయ్య ఆవిష్కరించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ.. జీవో నెంబర్ 25 ప్రకారం ఉపాధ్యాయుల సర్దుబాటు గ్రామీణ ప్రాంతం పాఠశాలలు మూసివేసే పరిస్థితి వస్తుందని వెంటనే జీవోను రద్దు చేయాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ప్రాథమిక విద్య ను బలోపేతం చేయాలనీ, తరగతి కి ఒక ఉపాధ్యాయుడు ఉంటేనే నాణ్యమైన విద్య విద్యార్థులకు అందుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పడకల్ జిహెచ్ఎం రాందాస్, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పాండు, ఎస్జిటియు జిల్లా నాయకులు కబీర్, కవిత, హరీష్ రెడ్డి, మల్లేష్, లావణ్య, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

# కొందుర్గులో రెచ్చిపోతున్న బోరు వైర్ల దొంగలు

- ఎండిపోతున్న పంట పొలాలు
- భయాందోళనలో రైతులు, పోలీసు పెట్రోలింగ్ పెంచాలి



**కొందుర్గు జనంసాక్షి :** కొందుర్గు, రంగారెడ్డి జిల్లా మండల కేంద్రంలోని వ్యవసాయ భూముల్లో దొంగలు మళ్లీ పంజా విసిరారు. గత కొన్ని రోజులుగా రాత్రి సమయాల్లో పొలాల్లోని బోరు మోటర్ల వైర్లను కట్ చేస్తుండటంతో రైతులు తీవ్ర ఆర్థిక నష్టానికి గురవుతున్నారు. ఒకవైపు సాగు నీరు అందక పంటలు ఎండిపోయే ప్రమాదం పొంచి ఉండగా, మరోవైపు వేల రూపాయల విలువ చేసే వైర్లను దొంగలు ఎత్తుకెళ్తుండటంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ ఇదే గ్రామంలో అనేకసార్లు బోరు మోటర్ల వైర్లు, కేబుల్స్ దొంగతనానికి గురయ్యాయి. కొన్ని చోట్ల మోటర్లను పగులగొట్టి కాపర్ వైర్లను తీసుకుని, మిగిలిన భాగాలను పక్కనే పడేస్తున్నారు. దొంగలు పదేపదే నేరాలకు పాల్పడుతున్నందున, రాత్రి సమయాల్లో పొలాల బాటలో పోలీసు పెట్రోలింగ్ పెంచాలని రైతులు అధికారులను కోరుతున్నారు.

దొంగతనాల భయంతో కొందరు రైతులు తమ పొలాల్లో సిసి కెమెరాలు కూడా ఏర్పాటు చేసుకుంటున్నారు. నిందితులు పట్టుబడకపోవడంతో రైతులు తమ మోటర్లను కాపాడుకోవడానికి రాత్రుళ్లు పొలాల్లోనే నిద్రించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతులు చేసేది ఏమీ లేక కొత్త కేబుల్ కనెక్షన్లు ఏర్పాటు చేసి పంటపొలాలు దున్నుకునే పరిస్థితి ఏర్పడింది. స్థానిక పోలీసులు పాత నేరస్థులపై నిఘా పెట్టాలని, ముఖ్యంగా దొంగిలించిన రాగి తీగలను కొనుగోలు చేసే స్క్రాప్ వ్యాపారులపై తనిఖీలు చేపట్టాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. వరుస దొంగతనాలకు అడ్డుకట్ట వేయకపోతే ఆందోళన బాట పడతామని రైతులు హెచ్చరిస్తున్నారు.

# మియాపూర్ డివిజన్‌లో రూ.4.72 కోట్లతో అభివృద్ధి పనులు

- పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ శంకుస్థాపన
- వివిధ కాలనీల్లో సీసీ రోడ్లు, రిటైనింగ్ వాల్
- ప్రభుత్వ హామీలు నెరవేరుస్తాం
- మంత్రి శ్రీధర్ బాబు సహకారం



**శేరిలింగంపల్లి, జనవరి 29 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ డివిజన్ పరిధిలో స్థానిక కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్తో కలిసి గురువారం 4.72 కోట్ల రూపాయల ప్రభుత్వ నిధుల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ శంకుస్థాపన గావించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ తో కలిసి ఆయన మాట్లాడుతూ ఒకేసారి 4 కోట్ల 72 లక్షల రూపాయల ప్రభుత్వ నిధుల అంచనాతో మియాపూర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో సిసి రోడ్ల నిర్మాణం పనులకు ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించుకోవడం ఎంతో శుభ పరిణామం అని, ప్రజలకు ఇచ్చిన వాగ్దానం ప్రకారం అభివృద్ధి మంత్రంగా ముందుకు సాగుతామన్నారు. ఈ క్రమంలో మియాపూర్ డివిజన్ పరిధి ఆదిత్య నగర్, అరబిందో కాలనీ, ఎఫ్.సి.ఐ, వీడియో కాలనీ, కృషి నగర్, ఎం.ఏ నగర్, ప్రశాంత్ నగర్, నాగార్జున ఎనక్లేవ్, మక్త మహబూబ్ పెట్ విలేజ్, శ్రీ సాయి నగర్ కాలనీ తదితర ప్రాంతాలలో 4 కోట్ల 72 లక్షల రూపాయలతో నూతనంగా నిర్వహించ తలపెట్టిన సిసి రోడ్ల నిర్మాణపు పనులకు, ఇతర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకోవడం జరిగిందన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలు, ప్రాంతాల అభివృద్దే ధ్యేయంగా లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రభుత్వ నిధులను వెచ్చించడంద్వారా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకై ముందుకు సాగనున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధిని సాధించే దిశగా కార్యాచరణను రూపొందించుకుని అమలు చేస్తున్నామన్నారు. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని, సిసి రోడ్లు, కుడికుంట చెరువు రిటైనింగ్ వాల్ వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, ఎక్కడా రాజి పడకూడదని అధికారులకు సూచించారు. ఇందులో భాగంగా లక్కీ రెస్టారెంట్ బ్యాక్ సైడ్ ఆదిత్య నగర్ కాలనీలో 30.లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించ తలపెట్టిన సిసి రోడ్డు పనులకు, అరబిందో కాలనీ మెయిన్ రోడ్డులో 41 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే సిసి రోడ్డు నిర్మాణం పనులకు అరికపూడి, ఉప్పలపాటి శ్రీకాంత్ శంకుస్థాపన చేయడం జరిగింది. ఎఫ్.సి.ఐ వీడియో కాలనీలో 36.00 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతన సీసీ రోడ్డు పనులకు, కృషి నగర్ కాలనీలో 27 లక్షల రూపాయల అంచనా వ్యాయంతో చేపట్టబోయే సిసి రోడ్డు నిర్మాణం పనులకు, ఎం.ఏ నగర్ కాలనీలో 96.50 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చెప్పటబోయే సిసి రోడ్ల నిర్మాణం పనులకు పిఏసి చైర్మన్ శంకుస్థాపన చేశారు. ప్రశాంత్ నగర్ కాలనీలో 54 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చెప్పటబోయే సిసి రోడ్ల నిర్మాణం పనులకు, నాగార్జున ఎనక్లేవ్ కాలనీలో 40 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చెప్పటబోయే సిసి రోడ్ల నిర్మాణం పనులకు, శ్రీ సాయి నగర్ కాలనీలో 48.50 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చెప్పటబోయే సిసి రోడ్ల నిర్మాణం పనులకు, మక్త మహబూబ్ పెట్ విలేజ్ లో గల పెద్దకుడి చెరువు 1.92 కోట్ల రూపాయల ప్రభుత్వ నిధుల అంచనా వ్యయంతో నూతనంగా చెప్పటబోయే రిటైనింగ్ వాలు నిర్మాణం పనులకు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించడంతోపాటు మక్త మహబూబ్ పెట్ విలేజ్ లో 13.50 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చెప్పటబోయే సిసి రోడ్ల నిర్మాణం పనులకు వారు శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, కాలనీల అసోసియేషన్ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాలు ప్రజలకు ఆదర్శంగా ఉండాలి

**టిపిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి ఏబి శ్రీనివాస్ చిన్నా.**



**ఆర్మూర్, జనవరి 29 (జనంసాక్షి):** రాజకీయంలో నాయకులు ప్రజలకు ఆదర్శంగా ఉండాలని, చిల్లర భాష మార్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి టిపిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి ఏబి శ్రీనివాస్ చిన్నా హెచ్చరించారు. ఆర్మూర్ పట్టణంలోని శాస్త్రి నగర్ లో ఏబి శ్రీనివాస్ చిన్న నివాస గృహంలో గురువారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన జీవన్ రెడ్డి మాట్లాడడం నేర్చుకోవాలని, సుదర్శన్ రెడ్డిని విమర్శించే స్థాయి జీవన్ రెడ్డికి లేదన్నారు. బీఆర్ఎస్ నుంచి పోటీ చేసే అభ్యర్థులు లేక జీవన్ రెడ్డికి మతిస్థిమితం తప్పిందన్నారు. గతంలో జీవన్ రెడ్డి తనపై అక్రమంగా కిడ్నాప్ కేసు పెట్టించి వేధించాడని, అలాంటి వ్యక్తి సుదర్శన్ రెడ్డిని విమర్శిస్తే ఖబర్దార్ అని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు నమ్మకం ఉందన్నారు. జీవన్ రెడ్డి ఎమ్మెల్యే కాకున్న ముందు ఆస్తులు ఎంత, ఇప్పుడున్న ఆస్తులు ఎంత తెలపాలన్నారు. సుదర్శన్ రెడ్డి కాలిబొటనవేలికి జీవన్ రెడ్డి సరిపోడని ఎద్దేవా చేశారు. రాజకీయాలలో చిల్లర భాష మాట్లాడడం జీవన్ రెడ్డి మానుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కో కన్వీనర్ దేగాం ప్రమోద్, సీనియర్ నాయకుడు కోల వెంకటేష్, లక్కారం నారాయణ, ఆసిఫ్, పాషా, సడక్ ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి

- నామినేషన్ కేంద్రాలలో హెల్ప్ డెస్క్‌తో పాటు పోలీస్ బందోబస్తు
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**తాండూరు జనవరి 29(జనంసాక్షి) :** నామినేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. తాండూర్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ ప్రక్రియ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నామినేషన్ల ప్రక్రియను ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. నామినేషన్లు స్వీకరించే సమయంలో అభ్యర్థులు ఏయే ధ్రువీకరణ పత్రాలు జత చేయాలో స్పష్టంగా తెలియజేయాలని, ఏవైనా సందేహాలు తలెత్తినట్లయితే వెంటనే పై అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని తెలిపారు.

ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాల వివరాలను పరిశీలించారు. 1 నుండి 36 వార్డులు 12 కౌంటర్లు, 12 మంది ఆర్‌ఓలు నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. నామినేషన్లు దాఖలు చేసే విషయంలో అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలని, ఏమైనా సందేహాలు ఉంటే సొంత నిర్ణయం తీసుకో కుండా పై అధికారులను సంప్రదించాలని సిబంది కి సూచించారు. నామినేషన్ కేంద్రాలలో హెల్ప్ డెస్క్ తో పాటు పోలీస్ బందోబస్తును పకడ్బందీగా ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జిల్లా లో మొత్తం 100 వార్డ్స్, 261 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడంతో పాటు 54 సమస్యాత్మక లొకేషన్ లు గుర్తించి పూర్తి స్థాయిలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్‌ఓలు, ఓఆర్ ఓలు 20శాతం అదనంగా సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల నియమావళి పక్కాగా అమలయ్యేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, సిఐ సంతోష్ కుమార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిపథంలో హయత్‌నగర్

- మీదాని కాలనీలో 30 లక్షల సిసి రోడ్ల శంకుస్థాపన
- జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ ను కలిసిన
- కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి



**హయత్ నగర్, జనవరి 29 (జనం సాక్షి) :** హయత్‌నగర్ డివిజన్లోని మీదాని కాలనీలో దాదాపు 30 లక్షల రూపాయలతో నిర్మించనున్న నూతన సిసి రోడ్ల శంకుస్థాపన, ఫాతిమా నగర్ నుండి పాత రోడ్డు మీదుగా రాఘవేంద్ర హోటల్ వరకు నూతన భూగర్భ డ్రైనేజ్ ట్రంక్ లైన్ పైప్ లైన్ నిర్మాణం కొరకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డిని వారి కార్యాలయంలో హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హయత్ నగర్ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని అన్నారు. కాలనీవాసులు ఎన్నాళ్లుగా ఎదురుచూస్తున్న సిసి రోడ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ఈ పనులు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. సుమారు 30 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న ఈ సిసి రోడ్లు పూర్తయితే ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా అందుబాటులోకి వస్తుందన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, ప్రతి రూపాయి ప్రజల సౌకర్యానికే ఖర్చు అవుతుందని స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా కాలనీల మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని, ప్రజల సహకారం ఎల్లప్పుడూ ఇలానే కొనసాగాలని కోరారు.

డివిజన్ లో భూగర్భ డ్రైనేజ్ ట్రంక్ లైన్ పైప్‌లైన్ నిర్మాణం చేపట్టి ఇప్పటికే చాలా సంవత్సరాలు గడిచిన కారణంగా తరచూ డ్రైనేజ్ ట్రంక్ లైన్లు పగిలి పోతూ రోడ్లు కుంగిపోతున్నాయని తెలిపారు. సమస్య తీవ్రతను గుర్తించి, అవసరమైన ప్రతిపాదనలను పరిశీలించి త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు సిజిఎం నరేంద్ర కుమార్, డీజీఎం రాజగోపాల్, మేనేజర్ రాజు, సూపెర్వైసోర్ బాలు బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, డివిజన్ అధ్యక్షులు గంగాన్ని శ్రీనివాస్, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్, నాయకులు ఎర్ర శ్రీకాంత్, బాలు, భరత్, చిరంజీవి, కాలని ఉపాధ్యక్షుడు కృష్ణ, కార్యదర్శి ముస్తఫా, కోశాధికారి రమేష్ రెడ్డి, సభ్యులు చంద్ర శేఖర్ రెడ్డి, అంజయ్య గౌడ్, జంగా రెడ్డి, సుధీర్ రెడ్డి, తిరుమల్ రెడ్డి, గోపాల్ రెడ్డి, నరసింహ, సత్యనారాయణ, రాజశేఖర్ రెడ్డి, సుధీర్ రెడ్డి పాల్గొన్నారు.

# ఖర్గే, రాహుల్‌తో థరూర్ భేటీ



- కేరళ అసెంబ్లీ ఎన్నికలపై నేతల చర్చ

**న్యూఢిల్లీ, జనవరి 29 (జనంసాక్షి) :** కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ గురువారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీలతో సమావేశమయ్యారు. బుధవారం పార్లమెంటులో ఖర్గే కార్యాలయంలో కొన్ని గంటలపాటు ఈ సమావేశం జరిగింది. గతవారం కేరళలో జరిగిన కీలక సమావేశానికి థరూర్ హాజరుకాలేదు. దీంతో శశిథరూర్ కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పారని ఊహాగానాలు వినిపించాయి. ఈ తరుణంలో ఖర్గేతో, రాహుల్‌తో శశిథరూర్ సమావేశం జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశం అనంతరం థరూర్ మీడియాతో మాట్లాడుతూ.. ' మా ఇద్దరి నాయకులతో మాట్లాడాను. మా చర్చలు సానుకూలంగా జరిగాయి. అంతా బాగానే ఉంది. మేము కలిసి నడుస్తాము. ఇంకేం చెప్పగలను. నేను ఎప్పుడూ పార్టీ కోసం ప్రచారం చేశాను. నేను వ్యక్తిగతంగా ఎక్కడా ప్రచారం చేయలేదు' అని అన్నారు. మీరు ఎన్నికల్లో పోటీ చేస్తారా? సిఎం పదవి గురించి ఈ సమావేశంలో చర్చించారా అని మీడియా అడిగిన ప్రశ్నకు.. 'ఈ విషయంపై మేము మాట్లాడుకోలేదు. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థిగా పోటీ చేయడానికి నాకు ఇష్టం లేదు. ప్రస్తుతానికి నేను ఎంపిని. తిరువనంతపురం నుండి నా ఓటర్ల విశ్వాసం నాకు ఉంది. పార్లమెంటులో వారి ప్రయోజనాలను నేను చూసుకోవాలి. అది నా పని' అని ఆయన అన్నారు. ఖర్గేతో, రాహుల్‌గాంధీతో చర్చలు సజావుగా సాగినందుకు వారికి శశిథరూర్ కృతజ్ఞతలు తెలిపారు.

# స్కామ్‌లకు కేంద్రంగా తెలంగాణ

- కుంభకోణాలు, అవినీతి వ్యవహారాలు
- టీవీ సిరియల్‌లా సాగుతున్న ట్యాపింగ్
- మంత్రుల మధ్య తీవ్రస్థాయిలో విభేదాలు
- మండిపడ్డ బిజెపి ఎంపి డాక్టర్ లక్ష్మణ్



**న్యూఢిల్లీ, జనవరి 29 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో స్కామ్‌లు వేగంగా పరిగెడుతున్నాయని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ వ్యాఖ్యలు చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చారని.. కానీ అమలు కావడం లేదని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చి రెండేళ్లు గడిచినా, వైఫల్యాలను మెరుగుపరచడానికి కాలయాపన చేస్తున్నారని వ్యాఖ్యానించారు. తెలంగాణలో కుంభకోణాలు, అవినీతి, మంత్రుల మధ్య గొడవలు రోజువారీ వార్తలుగా మారాయని లక్ష్మణ్ తెలిపారు. రాష్ట్రం స్కామ్‌లకు పరిశోధన కేంద్రంగా మారిందని ఆయన అన్నారు. కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడంపై స్పందిస్తూ.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని రోజువారీ టీవీ సీరియల్‌గా మార్చారని, రోజుకో పేరును ప్రస్తావిస్తూ సిట్ పేరిట కాలయాపన చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ సాధించలేదన్నారు. ఫోన్ ట్యాపింగ్ సూత్రధారులను శిక్షించిన పాపాన పోలేదని ఎంపీ విమర్శించారు. తెలంగాణలో బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్ వస్తుందనే అనే భయంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ కలిసి గేమ్ ఆడుతున్నాయని ఎంపీ ఆరోపించారు. మున్సిపాలిటీలలో కనీస సదుపాయాలు కల్పించడం లేదన్నారు. 106 మున్సిపాలిటీల అభివృద్ధికి ఎన్ని కోట్లు ఖర్చు చేశారో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం స్మార్ట్ సిటీ, పట్టణాల అభివృద్ధి కోసం పని చేస్తోందని.. కానీ రాష్ట్ర ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికుల జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితిలో ఉందని విమర్శించారు. బీజేపీకి ఓటు వేస్తేనే ప్రోగ్రెస్ జరుగుతుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ ఒక వర్గాన్ని సంతోషపరచడం కోసమే పని చేస్తోందని ఆరోపించారు. రాహుల్ గాంధీ.. ఓ ఫెయిల్యూర్ నాయకుడు అని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు.

# గుండెపోటుతో సినీ సంగీత దర్శకుడు నల్లూరి మృతి

- సుధీర్ మృతికి పలువురు ప్రముఖుల సంతాపం



**హైదరాబాద్, జనవరి 29 (జనంసాక్షి) :** ప్రముఖ టీవీ, సినీ సంగీత దర్శకుడు నల్లూరి సుధీర్ కుమార్ గుండెపోటుతో గురువారం తెల్లవారుజామున కన్నుమూశారు. టీవీ ధారావాహికలకు సంగీతం అందించిన సుధీర్ కుమార్ పలు నంది అవార్డులను అందుకున్నారు. రెండున్నర దశాబ్దాలపాటు టీవీ, రేడియో రంగాలలో, చిత్రసీమలోనూ సంగీత దర్శకుడిగా రాణించిన నల్లూరి సుధీర్ కుమార్ హైదరాబాద్ దూరదర్శన్ తొలినాళ్ళలో వందలాది పాటలను స్వరపరిచారు. టీవీ ధారావాహికలకు, స్పెషల్ ఎపిసోడ్స్ కు సంగీతం అందించిన ఆయన ఎన్నో నంది అవార్డులను అందుకున్నారు. పలు చిత్రాలకూ ఆయన సంగీతం అందించారు. ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ దర్శకత్వం వహించిన తొలి చిత్రం 'అగ్ని ప్రవేశం'కు ఆయనే సంగీత దర్శకుడు. అలానే తమ్మారెడ్డి భరద్వాజ రూపొందించిన 'కూతురు', 'అమ్మో అల్లుడా' తదితర చిత్రాలకు సంగీతం అందించారు. 2024లో తారకరత్న హీరోగా నటించిన 'ఎస్ -9' ఆయన సంగీతం సమకూర్చిన చివరి చిత్రం. మచిలీపట్నం మల్కాపట్నంకు చెందిన సుధీర్ కుమార్ నోబుల్ కళాశాల పూర్వ విద్యార్థి. యుక్తవయసులోనే హైదరాబాద్‌కు వచ్చి అక్కడే స్థిరపడ్డారు. ఆయన తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయులు. ఆయన మృతికి పలువురు టీవీ, సినీరంగాలకు చెందిన వారు సంతాపం తెలిపారు.

# ఎవరి కోసం మళ్లీ పాదయాత్ర

- గతంలో అధికారం ఇస్తే ఏం చేశావు
- రుషికొండను బోడిగుండు చేశావు
- మద్య నిషేధం పేరుతో ఏరులై పారించావ్
- వైఎస్ జగన్ పాదయాత్ర ప్రకటనపై మండిపడ్డ షర్మిల

**విజయవాడ, జనవరి 29 (జనంసాక్షి) :** జగన్ పాదయాత్ర ఇప్పుడు ఎందుకు... అధికారం కోసమే కదా అని కాంగ్రెస్ ఏపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఎద్దేవా చేశారు. అధికారం ఇస్తే.. జగన్ ఏం చేశారని ప్రశ్నించారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాదయాత్ర ప్రకటనపై వైఎస్ షర్మిల స్పందించారు. వైఎస్సార్ జలయజ్ఞం పేరుతో చేపట్టిన ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన జగన్... ఆ తర్వాత వాటిని ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. విజయవాడలోని కాంగ్రెస్ కార్యాలయంలో షర్మిల మాట్లాడారు. మద్యం మాఫీ అన్న వ్యక్తి... మద్యాన్ని ఏరులై పారించి, నకిలీ మద్యంతో రూ.కోట్లు గడించారని వైఎస్ షర్మిల ఎద్దేవా చేశారు. 'రిషికొండ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత బోడి గుండు అయ్యింది. జగన్‌కు అధికారం ఇస్తే.. ప్రజలకు ఏం చేశారు. ప్రజల్లో ఉన్నారా, కనీసం వారి నాయకులకు కూడా అపాయింట్‌మెంట్ ఇచ్చారా..?. సీఎంగా అసలు జనాల్లోకి ఆయన ఎప్పుడు వచ్చారు. ఎన్నికలకు ముందు సిద్ధం సభలతో హడావుడి చేశారు. ఇప్పుడు మళ్లీ అధికారంలోకి వస్తే జగన్ ఏం చేద్దామని అనుకుంటున్నారు. ఒక మనిషి నిజమైన నైజం తెలియాలంటే.. ఆయనకు అధికారం ఇచ్చి చూడండి అని అబ్రహం లింకన్ అన్నారు. అధికారంలో ఉన్న జగన్ పని తీరు మనమంతా చూశాం' అని వైఎస్ షర్మిల విమర్శించారు. 2027 జూలైలో జగన్ పాదయాత్ర చేస్తే.. ఇప్పుడు ఎందుకు ప్రకటన చేయడం. మేము ఇప్పుడు యాత్ర చేస్తున్నాం కాబట్టి ప్రకటించాం. జగన్ ఉపాధి హామీ పథకం కోసం, కూలీల కోసం యాత్ర ఎందుకు చేయడం లేదు. మంద్రేగా కోసం మేము కూలీలకు అండగా నిలిచాం. జగన్ పాదయాత్ర ఎందుకోసం, ఎవరి కోసం.. ప్రయోజనం ఏంటో చెప్పాలి' అని వైఎస్ షర్మిల ప్రశ్నల వర్షం కురిపించారు.

# భక్తులతో కిక్కిరిసిన గద్దెలు

- నిలువెత్తు ఎత్తు బంగారం సమర్పిస్తూ మొక్కుల సమర్పణ
- గద్దె పైకి సమ్మక్క అమ్మవారు
- పుష్కారాలను తలపిస్తున్న జంపన్న వాగు



**ములుగు బ్యూరో, జనవరి 29 (జనంసాక్షి) :** ములుగు జిల్లాలోని మేడారం భక్తజన జాతరగా మారింది. లక్షలాదిగా తరలివచ్చినభక్తులతో వనదేవతల ప్రాంగణం జనసంద్రాన్ని తలపించింది. తెలంగాణ నుంచే కాకుండా మహారాష్ట్ర,ఏపీ,చత్తీస్గఢ్ రాష్ట్రాలతో పాటు దేశ నలుమూలల నుంచి ఆదివాసి గిరిజనులు,భక్తులు మేడారానికి తరలివచ్చారు.దీంతో మేడారానికి వచ్చే దారులన్నీ వాహనాలతో రద్దీగా మారాయి. వెంట తెచ్చుకున్న కోళ్లను వనదేవతల గద్దెల సమీపంలో గాల్లోకి ఎగురవేస్తూ భక్తులు సందడి చేస్తున్నారు.కుటుంబాలను చల్లగా దీవించు తల్లీ అంటూ దేవతలను కొలుస్తున్నారు.ఎత్తు బంగారాలను సమర్పిస్తున్నారు.వచ్చే రెండు రోజులు భారీ సంఖ్యలో భక్తులు మేడారంకు తరలిరానున్నారు.మేడారం వెళ్లే దారి పొడవునా గిరిజన మహిళల నృత్యాలు,దొరల కొమ్ము బూరల శబ్దాలు భక్తులకు స్వాగతం పలుకుతున్నాయి. ఇక్కడి వాతావరణం భక్తులను భక్తి పారవశ్యంలోముంచెత్తుతోంది. విదేశాల నుంచి కూడామానవ శాస్త్ర పరిశోధకులు ఈ అరుదైన గిరిజన సంస్కృతిని అధ్యయనం చేయడానికివిచ్చేస్తున్నారు.ఇప్పటికే సారలమ్మ అమ్మవారు పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలపైకి వచ్చారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని గత నెల రోజుల నుంచే భక్తులు మేడారానికి తరలివస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈసారి రూ.251 కోట్లతో శాశ్వత అభివృద్ధి పనులను పూర్తి చేసింది. అడవి తల్లుల ఆశీస్సుల కోసం..లక్షలాది మంది భక్తుల రాకతో మేడారం అడవి పులకించిపోతోంది. ఆధునిక కాలంలోనూ ఆదివాసీ సంప్రదాయాలు ఎంత శక్తివంతంగా ఉంటాయో చాటిచెప్పే ఈజాతర, కేవలం ఒక పండుగ మాత్రమేకాదు.. అది కోట్లాది మంది నమ్మకం. మేడారంలో ఎక్కడ చూసినా బెల్లం (బంగారం)..కుప్పలే కనిపిస్తున్నాయి. భక్తులు తమ కోరికలు తీరినందుకు కృతజ్ఞతగా తల్లులకు'బంగారం' సమర్పించుకుంటున్నారు. గిరిజన ఆచారం ప్రకారం వనదేవతలకు మొక్కులు చెల్లిస్తున్నారు. కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నజంపన్న వాగు ఇప్పుడు భక్తుల స్నానాలతో జన సముద్రాన్ని తలపిస్తోంది. వాగులోస్నానం చేస్తే పాపాలు తొలగిపోతాయనిభక్తుల ప్రగాఢ విశ్వాసం. జంపన్న వాగు పుష్కరశోభను తలపిస్తున్నది. కాగా గద్దెల వద్ద తొక్కిసలాట జరగకుండా అత్యాధునిక సెన్సార్ల ద్వారా రద్దీని ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నారు. 50కి పైగా మొబైల్ మెడికల్ యూనిట్లు,ఎమర్జెన్సీ కోసంఎయిర్ అంబులెన్స్ సౌకర్యం సిద్ధంగా ఉన్నాయి. భక్తుల కోసం ప్రత్యేకంగా లి'మేడారం యాప్'లి అందుబాటులోకి తెచ్చారు. దీని ద్వారా పార్కింగ్ ప్లేసులు,ట్రాఫిక్ అప్డేట్స్ తెలుసుకోవచ్చు.మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర స్వయంగా జాతర ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 42,000 మంది ప్రభుత్వ సిబ్బందిని విధుల్లో ఉన్నారు. భక్తులు ప్రశాంతంగా వనదేవతలను దర్శించుకుంటున్నారు. ప్రభుత్వం చేసిన ఏర్పాట్ల పట్ల భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

భక్తుల రద్దీతో విద్యుత్ వెలుగులతో , రాత్రి వేళ అద్భుతమైన దృశ్యంతో మేడారం మెరిసిపోతున్నది. చిన్న చిన్న వాగుల ఒడ్డున, చెట్లకింద వేలాది మంది భక్తులు వంటలు చేసుకుంటూ, చిన్న చిన్న దీపాల వెలుగులో ఆనందంతో కుటుంబ సభ్యులతో సేద తీరుతూ ఈ పర్యటనను మదిలో నిలుపుకుంటున్నారు.బంధు మిత్రులతో కులమతాలకు అతీతంగా అందరూ ఒకే చోట కూర్చుని భోజనం చేయడం ఇక్కడి ప్రత్యేకత. చాలామంది భక్తులు తమ ఇళ్ల నుంచే బియ్యం,పప్పు తెచ్చుకుని, మేడారం చెట్ల కింద 'వనభోజనాలు' చేస్తారు. ఇది ఒక గొప్ప పర్యాటక అనుభవాన్ని కూడా ఇస్తుంది. మేడారంఅంటే కేవలం మొక్కులు తీర్చుకోవడం మాత్రమే కాదు, అది తెలంగాణ గిరిజన అస్తిత్వానికి, ధైర్యానికి ప్రతీక. ఆధునిక ప్రపంచంలో మనిషికి, ప్రకృతికి ఉన్న విడదీయరాని బంధాన్ని ఈ జాతర గుర్తు చేస్తుంది.

# మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్చొద్దు

- నిరుద్యోగం, ధరల పెరుగుదలపై ప్రధాని మోదీ దృష్టి పెట్టాలి
- ఎన్డీయే ప్రభుత్వ చర్యలు ఇలాగే ఉంటే దేశంలో ఉద్యమాలు తప్పవు
- ఎంపీ మల్లు రవి



**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్చొద్దని.. నిరుద్యోగం, ధరల పెరుగుదలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టి పెట్టాలని.. నాగర్ కర్నూల్ ఎంపీ డా.మల్లు రవి డిమాండ్ చేశారు. న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో గురువారం మల్లు రవి విలేఖరులతో మాట్లాడారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టినప్పుడు.. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు 90 శాతం వచ్చేవని, కేవలం 10 శాతం మాత్రమే రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించేవని, ఇప్పుడు దాన్ని కూడా మార్చి కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వాలు 40 శాతం ఇవ్వాలని కొత్త బిల్లు ద్వారా మార్పును తీసుకొచ్చారని తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నాయన్నారు. భవిష్యత్తులో ఈ 40 శాతం నిధులను విడుదల చేయడానికి ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. అందుకే కొత్తగా తీసుకొచ్చిన బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతులు ఉద్యమం చేసి వాటిని వెనక్కి తీసుకునేలా చేశారని, అలాగే ఈ బిల్లును కూడా వెనక్కి తీసుకొని.. పాత పద్ధతి ప్రకారం నిధులు కేటాయించి పేరు మార్పు లేకుండా చేయాలని కొనసాగించాలని డిమాండ్ చేశారు. మన చుట్టుపక్కల ఉన్న శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ దేశాల్లో ఇటీవల ఎలాంటి ఉద్యమాలు జరిగాయో మనందరం చూశామని, ఆ ఉద్యమాలకు కారణం నిరుద్యోగం, నిత్యావసర వస్తువుల ధరలు పెరగడమే. అలాంటి పరిస్థితి ఇండియాలో రాకూడదన్నారు.. దేశంలో నిరుద్యోగం, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల కారణంగా ఉద్యమాలు వచ్చే ప్రమాదం ఉందని, అందుకే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ అంశాలపై తొలుత దృష్టి సారించాలని కోరారు. ఆ తరువాత వికసిత్ భారత్ లక్ష్యాలపై దృష్టి పెడితే బాగుంటుందని చెప్పారు.



# హోంగార్డు ఆస్తులు 20కోట్లు

- ఏసీబీ దాడుల్లో బట్టబయలు

**విజయనగరం, జనవరి 29 (జనంసాక్షి) :** ప్రభుత్వ ఉద్యోగులు అడ్డదారిలో అక్రమాస్తులు కూడబెట్టి అడ్డంగా దొరికిపోయిన ఘటనలు నిత్యం ఎక్కడో ఒక చోట చూస్తూనే ఉంటాం. అయితే కొన్నిసార్లు వాళ్లు చేస్తున్న ఉద్యోగానికి వెనకేసిన అక్రమ సంపాదనకు పొంతనే ఉండదు. అలాంటి షాకింగ్ ఘటనే ఏపీలో వెలుగు చూసింది. ఆంధ్రప్రదేశ్‌లో ఓ హోంగార్డు భారీగా అక్రమాస్తులు కూడబెట్టి హాట్ టాపిక్‌గా మారాడు. విజయనగరం జిల్లా పోలీస్ కార్యాలయంలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. విజయనగరం, గుర్ల, విశాఖపట్నం ప్రాంతాల్లోని శ్రీనివాస రావు నివాసాల్లో తనిఖీలు చేసి, సుమారు రూ.20 కోట్లు అక్రమ ఆస్తులు కూడబెట్టినట్టుగా గుర్తించారు. శ్రీనివాసరావు ఏసీబీలో 15 ఏళ్లు పనిచేసి అధికారుల దాడుల గురించి ముందుగానే సమాచారమిచ్చి డబ్బులు తీసుకునేవాడని, అవినీతి ఆరోపణలు రావడంతో అతడిని పోలీస్ కార్యాలయానికి బదిలీ చేశారని ఏసీబీ అధికారులు వెల్లడించారు. హోంగార్డు శ్రీనివాసరావు ఇంటితోపాటు అతడి సన్నిహితులు, బంధువుల నివాసాల్లో కూడా ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నట్టు సమాచారం. సాధారణ హోంగార్డు ఉద్యోగం చేసే వ్యక్తి ఇంత భారీ మొత్తంలో ఆస్తులు సంపాదించడం ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇవాళ తెల్లవారుజాము నుంచే ఏసీబీ బృందాలు రికార్డులను పరిశీలిస్తున్నాయి.

# మేడారం జాతరలో చిన్నపిల్లలకు 'క్యూఆర్' కోడ్ రిస్ట్ బ్యాండ్ వేయించండి

- తప్పిపోయిన ఇద్దరు చిన్నారుల ఆచూకీ గంటల్లోనే లభ్యం
- మల్టీజోన్ -2 ఐజిపి ఎస్.చంద్రశేఖర్ రెడ్డి



**హైదరాబాద్, జనవరి 29 (జనంసాక్షి) :** మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర-2026 సందర్భంగా రాష్ట్ర ప్రజలకు మల్టీజోన్-2 ఐజిపి ఎస్.చంద్రశేఖర్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. జాతర రద్దీలో చిన్నారులు తప్పిపోయే ప్రమాదం ఉన్నందున, వారి రక్షణ కోసం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 'క్యూఆర్ కోడ్ రిస్ట్ బ్యాండ్' వ్యవస్థను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు టీజీఎస్ఆర్టీసీ సహకారంతో భక్తులు వచ్చే ప్రధాన మార్గాల్లో 11 ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి, చిన్న పిల్లలకు ఈ బ్యాండ్లను ఉచితంగా అందజేస్తున్నట్లు వెల్లడించారు. హన్మకొండ హయగ్రీవాచారి గ్రౌండ్, హైదరాబాద్‌లోని ఉప్పల్, ఎంజీబీఎస్ బస్ స్టేషన్ లలో కరీంనగర్ ,పరకాల, పెద్దపల్లి, మంథని, ఏటూరునాగారం, కాటారం బస్ స్టేషన్లతో పాటు... వరంగల్ రైల్వే స్టేషన్,కాజీపేట్ రైల్వే స్టేషన్లలో రిస్ట్ బ్యాండ్లను అందజేసే కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. జాతరలో ఎవరైనా చిన్నారి తప్పిపోయినట్లు కనిపిస్తే, వారి చేతికి ఉన్న రిస్ట్ బ్యాండ్‌పై గల క్యూఆర్ కోడ్‌ను స్మార్ట్‌ఫోన్ ద్వారా స్కాన్ చేయాలన్నారు. అలా స్కాన్ చేసిన వెంటనే లభించే ఫోన్ నంబర్ ద్వారా సదరు బాధితుల బంధువులకు లేదా పోలీసులకు సమాచారం అందించి, చిన్నారులను క్షేమంగా వారి కుటుంబ సభ్యుల వద్దకు చేర్చవచ్చని ఆయన వివరించారు. ఈ క్యూఆర్ రిస్ట్ బ్యాండ్లు జాతరలో ఇప్పటికే సత్ఫలితాలను ఇస్తున్నాయని ఐజిపి వెల్లడించారు. తప్పిపోయిన ఇద్దరు చిన్నారులను కేవలం గంటల వ్యవధిలోనే గుర్తించి, వారి తల్లిదండ్రుల వద్దకు సురక్షితంగా చేర్చినట్లు తెలిపారు. కరీంనగర్ బస్టాండ్‌లో రిస్ట్ బ్యాండ్ వేయించుకున్న మురళీకృష్ణ కుమారుడు అరియాన్ష్ (4) అనే బాలుడు జాతరలో తప్పిపోగా, ఈ సాంకేతికత ఆధారంగానే అతడిని త్వరగా గుర్తించగలిగామని పేర్కొన్నారు. అలాగే హనుమకొండ హయగ్రీవచారి గ్రౌండ్స్‌లో రిస్ట్ బ్యాండ్ ధరించిన గోవిందరావుపేట గ్రామానికి చెందిన మిల్కీ అనే బాలిక కూడా తప్పిపోయిన కొద్దిసేపటికే తన తండ్రి గుంజ నాగరాజు చెంతకు చేరిందని ఐజిపి ఎస్.చంద్రశేఖర్ రెడ్డి వివరించారు.

# పరిశుభ్రమైన గాలితోనే నిజమైన అభివృద్ధి

- రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన లక్ష్యంతో శాస్త్రీయ విధానాన్ని అనుసరిస్తోంది
- నివాస ప్రాంతాల్లోని పరిశ్రమలతో భద్రత, ఆరోగ్య ప్రమాదాలు
- గాలి నాణ్యత పర్యవేక్షణకు రాష్ట్రంలో 40 కొత్త స్టేషన్లను ఏర్పాటు చేశాం
- త్వరలో గాలి నాణ్యత డాష్ బోర్డులను ప్రారంభిస్తాం : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్ (జనంసాక్షి) :** పరిశుభ్రమైన గాలితోనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది అందుకే ఈ విషయంలోతెలంగాణ ప్రభుత్వం స్పష్టమైన లక్ష్యంతో శాస్త్రీయ విధానాన్ని అనుసరిస్తుందనీ హైదరాబాద్ నగరం తో పాటు రాష్ట్ర ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని కల్పించేందుకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ క్యాబినెట్ ముందుకు వెళుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు.రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి విభాగం లో "గాలి నాణ్యత సూచీ మరియు గాలి నాణ్యత నిర్వహణ" అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సదస్సు యొక్క స్పష్టమైన, ఉన్నత లక్ష్యం ఆరోగ్యవంతమైన తెలంగాణ కోసం స్వచ్ఛమైన గాలి అన్నారు.నేడు తెలంగాణ దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలలో ఒకటి, హైదరాబాద్ ఐటీ, లైఫ్ సైన్సెస్, తయారీ, ఆవిష్కరణల కేంద్రంగా ఎదిగింది, ఈ అభివృద్ధి మనకు గర్వకారణం అని తెలిపారు.అదే సమయంలో ఇది మనపై బాధ్యతను కూడా మోపుతుంది అన్నారు.అభివృద్ధి మరియు పర్యావరణ పరిరక్షణను ఎదురెదురుగా నిలబెట్టలేం, అవి చేతులు కలిపి ముందుకు నడవాలి అని డిప్యూటీ సీఎం అన్నారు.సుస్థిర అభివృద్ధి ద్వారా మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యాన్ని సాధించాలనే దృఢ సంకల్పంతో మా ప్రభుత్వం పనిచేస్తోందనీ తెలిపారు. అదే సమయంలో జలాశయాల పునరుద్ధరణ, సహజ వనరుల సంరక్షణ, గాలి నాణ్యత మెరుగుదలపై కూడా తమ ప్రభుత్వం పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతోందనీ డిప్యూటీ సీఎం తెలిపారు.ఎందుకంటేశుభ్రమైన గాలి లేకుండా జరిగే అభివృద్ధి నిజమైన ప్రగతి కాదు,అది కేవలం ఆలస్యమైన నష్టం మాత్రమే అని వివరించారు.గాలి నాణ్యత ఒక పర్యావరణ సూచీ మాత్రమే కాదు,అది ప్రజారోగ్య సూచీ,అది ఉత్పాదకత సూచీ మరియుఅది ఆర్థిక సూచీ కూడా అన్నారు. 2024 'స్టేట్ ఆఫ్ గ్లోబల్ ఎయిర్ రిపోర్ట్' సహా ప్రపంచ స్థాయి అధ్యయనాలు ఈ సమస్య తీవ్రతను స్పష్టంగా చూపుతున్నాయి అని తెలిపారు.నేడు గాలి కాలుష్యం, అధిక రక్తపోటు తర్వాత, ప్రపంచంలో మరణాలకు రెండో ప్రధాన కారణంగా మారిందనీ,ప్రతి ఏడాది 80 లక్షలకు పైగా అకాల మరణాలకు ఇది కారణమవుతోంది అన్నారు.ఇది మన పిల్లలను, వృద్ధులను, పని చేసే జనాభాను తీవ్రంగా ప్రభావితం చేస్తోందనీ అన్నారు.ప్రపంచ బ్యాంక్ అధ్యయనం ప్రకారం, గాలి కాలుష్యం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఏటా నాలుగు ట్రిలియన్ డాలర్లకు పైగా నష్టం వాటిల్లుతోందన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370